ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక



4 అణాలు
24-3-54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



కుందేలు —ఫోటో: యస్. యస్. శర్మ, తెల్లపోలు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 28
24-3-54

విజయ ఫాల్గున బహుళ పంచమి బుధవారం



బిర్లా మందిర్ (న్యూఢిల్లీ) లో మకరముఖ బిలద్వారం.

ఫొటో: ఎస్. వి. కె. పర్వతాలు—మద్రాసు.

ముష్టిలో ఖూనీరాగం

"ఆరుద్ర"

ఏ మాత్రం సుమారైన తెల్ల బట్టలైనా కట్టుకొని మీరు దారంట పోతూ ఉంటే చెన్నపట్నంలో గోడలు కూడా చేతులు చాచి బిచ్చమడుగుతాయి.

ముష్టివాళ్ళంటే దయాదాక్షిణ్యాలున్న వాళ్లు చెన్నపట్నానికొచ్చిన నాలుగు రోజుల్లో పాషాణ హృదయులుగా మారిపోవడానికి ఆస్కారం ఉంది. విసిగెత్తించి వేధించి, ప్రాణాలు తోడేసి వాణ్ణి చంపడమో, మనం చచ్చిపోడమో జరిగేటంత తీవ్రస్థాయికి మనందరిని చెన్నపట్నంలోని బిచ్చగాళ్లు తరుముతారు. వాళ్ళని మనం గాని, పోలీసులుగాని ఎంత తరిమినా లాభం లేదు. "వదిలాయిరా బాబూ!" అని బరువు తగ్గిన హృదయంతో నిట్టూర్పు తృప్తితో కన్ను మూసి తెరచేలోగా మళ్లా ఇంకో బిచ్చగాడు ప్రత్యక్షమవుతాడు.

కుంటివాళ్ళు, గుడ్డివాళ్లు, మరుగుజ్జులు మొదలైన వాళ్లు ముష్టెత్తుకోడం బాగానే ఉంది. ఈ దుర్భర దౌర్భాగ్య నగరంలో బిచ్చమెత్తడానికి ఒక రైమూ రీజను ఉన్నట్టు లేదు. స్కూలుకుర్రాడు ఎక్సర్సైజు పుస్తకం కొనుక్కోవాలని చెయ్యి చాపుతాడు. కొనుక్కోమని మీ రివాళ ఒక అణా ఇచ్చేరనుకోండి. మళ్లా ఎల్లుండి ఆ కుర్రాడే ఆ ఎక్సరసైజు పుస్తకం కోసమని ఆ చెయ్యే చాపుతాడు. సంవత్సరంలో మూడువందల అరవై అయిదురోజులు పాపం ఆ కుర్రాడు ఎక్సరసైజు పుస్తకం ఎలా కొనడమా అన్న తేలని సమస్యలో పడతాడు. నిజమే ఎవరేనా ఆ పుస్తకం కొనుక్కోమని డబ్బు ఇచ్చినా ఆ డబ్బు అందుకోసం వినియోగించక పోవడం చేత ఆ సమస్య తేలని సమస్యగానే ఉండిపోతుంది.

రోడ్డు వార మండుటెండలో పాపం ఇంకో క్షణానికి ఆ రోడ్డువారే కనేస్తుందా అన్న జాలి పుట్టించే స్థితిలో ఒక పూర్ణ గర్భిణి ఉంటుంది. ఆ చూలాలిని ఊహించి ఇంకో అనపాయురాలైన అతిథి పురిటి ఖర్చుల కోసం – బిచ్చమెత్తుతుంది. మన హృదయం కరిగి ధర్మం చేస్తాం. అదృశ్యం చూడలేక వెళ్ళిపోతాం. గాని అమర్నాడూ ఆ తరవాత కొన్ని వారాలదాకా పాపం ఆ చూలాలు అలాగే ఉంటుంది. ఆ పేటలో కాకపోవచ్చు రోజుకో పేటలో అయితే నేం ఎన్ని నెలలయినా కనవలసిన అవసరం లేని చూలాలు అదృష్టవంతురాలు.

బిచ్చమెత్తడానికి పూర్వం ఏదో ఒక పాట వచ్చివుండడం అవసరం. విశ్వనాథ సత్యనారాయణగారురచించిన రైల్లో బిచ్చగాడి మాదిరిగా కనీసం దాశరథీ శతకంలోని ఒక పద్యమేనా రావడం అవసరం. ఎప్పుడూ అదే పాడినా ఇబ్బంది లేదు. ఏదో ఒక పాట మాదిరీ ధ్వనిచేస్తూ బిచ్చమెత్తడం ముష్టివాళ్ల సంప్రదాయం.

చెన్నపట్నంలోని చాలామంది బిచ్చగాళ్ళు ఈ రోజుల్లో పాటలు పాడడం మానేస్తున్నారు. పాడకపోవడమే బాగుంది, లేకపోతే అది వినలేక బిచ్చం వేయవలసి వచ్చేది.

సినిమా పాటలూ, తత్వాలూ, పల్లెపదాలు బిచ్చగాళ్ల నోళ్లల్లో పడి అప్పుడప్పుడు అనుకోని మెరుగులు తిరుగుతూ ఉంటాయి. రైళ్ళలో ఇది మీరు గుర్తించే ఉంటారు. రాజకపూరు బూట్ పాలిష్ అనే చిత్రంలో రైళ్లలో బిచ్చగాళ్ళకి ఒక పంజాబీ పాట పెట్టాడు. అది దివ్యంగా ఉంది. చాలా విషయాల్లో పంజాబీలు తెలుగువాళ్ళు ఒకే మాదిరిగా ఉంటారు. ఆ పంజాబీ పాటకి వచనంలో యథాశక్తి తర్జుమా చేశా. వినండి: అది తిట్టుకవిత్వంలో చాలా గొప్పది.

"కాణీ పడేయ్ దాతా
కాణీ పడేయ్."

ఇంతదాకా బాగానే ఉంది. ఆ దాత కాణీ పడెయ్యడు. బిచ్చగాడు కాణీ పడెయ్యకపోతే ఆ దాతకి జరిగే కష్టాలు మొదలెడతాడు., "కాణీ పడెయ్యకపోతే, మీ యింట్లో దొంగలు పడతారు. దొంగలు పడితే మీరు పోలీసుస్టేషను కెళ్లాలి. వెళితే అక్కడ తానేదార్ మిమ్మల్ని చిక్కుల్లో పెడతాడు. మీ కాళ్లు అరిగిపోతాయి. పోయిన వస్తువులు మీకు దొరకవు. ఈ బాధలన్నీ పడడం ఎందుకు నాకు కాణీ పడేయ్ దాతా, కాణీ పడేయ్" ఇది ముష్టివాడి నయబోధ. ఇది ఆ దాత వినిపించుకోకపోతే ముష్టివాడు దాతకి రాబోయే మరో కష్టం చెప్తాడు.

"కాణీ పడెయ్యకపోతే మీ ముసిల్ది చస్తుంది. మీ ముసిల్దిచస్తే అస్తికలు పట్టుకొని మీరు ప్రయాగ వెళ్ళాలి. ఎంతో డబ్బు ఖర్చవుతుంది. నానాకష్టాలు పడాలి. ఆ బాధలు పడడం ఎందుకూ నాకు కాణీ పడేయ్ దాతా – కాణీ పడేయ్" ఇలాంటి చరణాలు చాలా ఉన్నాయి.

మన అభ్యుదయ కవులు చాలామంది బిచ్చగాళ్ల పాటలు రాశారు. గాని ఏదీ ఇలాంటి పాట! ఇలా రాయడం పంజాబీ

విషయానుక్రమణిక

ముఖచిత్రం:— "పల్లెపడుచు"
లో జి. వరలక్ష్మి.

కాలక్షేపం

కారణాంతరాలవల్ల ఈ వారం కాలక్షేపం ప్రచురించలేకపోతున్నందుకు విచారిస్తున్నాం. పై వారంనుంచి యథాప్రకారం ప్రచురించబడుతుంది.

వాడికే చెల్లింది. సభ్యంగా గానైనా అసభ్యంగానైనా గంటకుపైగా తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టడంలో పంజాబీలు తెలుగు వాళ్ళు దొందుకు దొందే. గాని బిచ్చగాళ్ల పాటల్లో మట్టుకూ పంజాబీలదే పైచెయ్యి.

ఇప్పుడు నేను మనవిచేసిన పాటలో మాదిరిగా తిట్లు తిట్టడంలో చెన్నపట్నం బిచ్చగాళ్లు పండిపొయ్యారు అయితే పాటల్లో తిట్టరు. చాలా ఉత్తేజవంతంగా ఉద్రేకపూరితంగా నల్లచొక్కా భాషలో గొప్పవాళ్ళ దౌర్జన్యాలు పేదవాళ్ళ కష్టాలు వివరించి తమిళ చిత్రాలలోని సంభాషణల ధోరణిలో చెవి చిల్లుపడేటట్టు తిడతారు.

చెన్నపట్నంలోని అసంఖ్యాకుల మాదిరిగా నేనూ బిచ్చగాళ్ల బాధితుణ్ణి. వీధిలో అడుగుపెట్టడానికి భయపడుతూ ఉంటాను-గాని రెండురోజుల కిందట పొద్దున్నే పేపరు విప్పేసరికి నాపాలిటి పెన్నిధిలాంటి వార్త కనబడ్డాది. మేల్‌పాక్కం అనే శివారులో పోలీసువాళ్ళు నగరంలోని బిచ్చగాళ్ల సంరక్షణా శిబిరం స్థాపించారు. దానికి ముఖ్యమంత్రి రాజగోపాలాచారి గారు ప్రారంభోత్సవం చేశారు. నగరంలోని బిచ్చగాళ్ళని పట్టుకొని దానిలో పెడతారట. అప్పుడే కొంతమందిని పెట్టారట.

ఈ వార్త చదవగానే చాలా సంతోషించాను - "హమ్మయ్య రోడ్డుమీద కాలు పెట్టేసరికల్లా వేధించి ప్రాణాలు తోడే బిచ్చగాళ్ళ బాధ తప్పింది కదా" అని. చాలా సంతోషించాను. ఆఫీసుకుపోతూ బస్సుకోసం నిలబడి పేపరు చాలా ఆనందంగా చదువుతున్నా. రాజగోపాలాచారిగారి ఉపన్యాసం అవురావురుమని పఠిస్తున్నా. బిచ్చగాళ్ళబాధ తప్పించినందుకు పోలీసువాళ్ళకి వెయ్యి దండాలు పెట్టాను. గాని "అప్పా ఒరు కాలణా కుడప్పా" అని ముష్టివాడు చెయ్యిచాపాడు. ముచ్చెమటలుపోసి మూడు చెరువుల నీళ్ళు తాగేందుకు అక్కడనుంచి పారిపొయ్యాను.

* * *

సదరు బిచ్చగాళ్ల సంరక్షణ శిబిరం "ప్రారంభోత్సవం సందర్భంలో దేవసహాయంగారు కొన్ని అంకెలిచ్చారు. చెన్నపట్నంలో సుమారు ఏడువేల అయిదువందల మంది బిచ్చగాళ్ళున్నారట! అందులో రెండువేలమంది కుర్ర బిచ్చగాళ్ళట... ఈ ఏడువేలమందిబిచ్చగాళ్ళలో ఎనభైముగ్గుర్ని పట్టి మార్చి ఒకటవ తారీఖునుంచి ఆ శిబిరం ప్రారంభించారట. ప్రస్తుతం శిబిరంలోని బిచ్చగాళ్ళ సంఖ్య పెరిగింది. రెండువందల ఇరవైతొమ్మిదిమంది మగాళ్ళు, ఎనభై నలుగురు ఆడవాళ్ళు ఇరవైమంది పిల్లవాళ్ళూ అందులో ఉన్నారు. అంటే మూడు వందల ముప్ఫయిముగ్గురికే ప్రస్తుతం ఆశ్రయం దొరికిందన్నమాట. పోతే సుమారు ఏడువేల నూటరవై ఏడుమంది బిచ్చగాళ్ళింకా పట్నంలో విచ్చలవిడిగా బిచ్చమెత్తుకొంటున్నారు. బాగానే ఉంది. గుడ్డిలో మెల్ల. కొంతమందైనా తగ్గారు. అదికూడా సంతోషించదగ్గ విషయమే!

* * *

"ఈ రైళ్ళు వేదాల్లో ఉన్నాయివ!" అన్నాడు అగ్నిహోత్రావధాను నిజమే. అనిపిస్తుంది. ఈ రోజుల్లో ఏ సరికొత్త విడ్డూరం గురించిచదివినా,అలాంటివిడ్డూరం మన పురాణాల్లో కనబడుతూనే ఉంటుంది. కావలిస్తే చూడండి.

ఈమధ్య అతి చక్కని విడ్డూరం గురించి చదివాం. ముప్ఫయి మూడేళ్లవాడూ ఇద్దరు పిల్లలతండ్రీ అయిన ఒక మాజీ విమానం పైలెట్ మాజీ మొగాడిగా మారి అందమైన సుందరిగా తయారవడం జరిగింది ఈ వార్త అగ్నిహోత్రావధాన్లులాంటివాళ్లకి చదివి వినిపించాం అనుకోండి. మన పురాణాలు

రోడ్డుచరిత్ర

కొనకళ్ల వెంకటరత్నం

లాగరా అయిలెస్స
లాగరా...
రోడ్డురోలరు ముందడుగై
సాగరా...

నడినెత్తిన సూరేడూ
నకనకలాడే డొక్కలు
కంకర రస్తాలో నగ
మింకా మిగిలున్నదిరా
లాగరా...

రోల్సురోయి మోటార్ల షి
కార్లకు కుదుపొచ్చిందట
పూలపానుపల్లె తోవ
పొడుగున మలసాలంట
లాగరా...

గోదావరి వరదలొచ్చి
గోలగున్నదంట యీడ
కట్టసుకాలింటానికి
గవినే రొస్తాడంట
లాగరా...

మండే ఆకలికడుపుల
మాయదారి బతుకుకంటె
బరువా యింతోటిపెద్ద
బండరాయి మామయ్యా
లాగరా...

లచ్చలున్న సావుకారు
లాబాలను మోసిందుకు
బారీ యాపారములో
లారీ కొన్నాడంట
లాగరా...

మ్రిచెట్టు పూడసీడ
మడిసిపురుగు లేని కాడ
నను బాలకు కక్కటిల్లి
సంటో డేడుస్తుండడు
లాగరా...

....

మెతుకు విదిపితేనే తమ
బతుకుపోయె ననుకొంటరు
మాదాకవళం మల్లన
మడిసిపోయిం డీ పక్కన
లాగరా...

....

పొలము పుట్ర అమ్ముకోని
పొట్టసేత బట్టుకోని
వలస పోయిం డీ దారిన
పంటకాపు పట్నానికి
లాగరా...

త్వరలో కొత్త సీరియల్

"మంచీ - చెడూ"

రచన: శ్రీ "శారద"

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పాఠకులకు త్వరలోనే ఒక కొత్త సీరియల్ నవలను అందించగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము.

ఆర్థిక స్తోమతు లోపమైనప్పుడు సమాజంలో జీవనం ఎంత యాతనామయమౌతుందో, ముఖ్యంగా స్త్రీలకు అట్టి పరిస్థితులలో ఎంతటి ఘోరపతనం సంభవిస్తుందో ఈ చిన్న నవల యధాతధంగా చిత్రిస్తుంది. అయితే అమానుషమైన ఈ దుఃఖాంధకారంలో సహజ మానవ సౌశీల్యం, ప్రేమార్ద్రతలు వెలుగుదారులు చూపగలవు. నేటి సామాజిక జీవనాన్ని వాస్తవికంగా చిత్రించడానికి రచయిత శ్రీ 'శారద'గారు చేసిన కృషి పాఠకులలో ఔత్సుక్యం రేకెత్తించగలదని ఆశిస్తున్నాము - సంపాదకుడు.

చూసుకోమంటాడు.

అర్జునుడు బృహన్నలగా మారాడు. ఆడారితనమే గాని ఆడతనం కాదని మనం దీన్ని నిరాకరించవచ్చుగాని నారదుడు ఆడదానిగామారి పిల్లల్ని కూడా కన్నాడు. ఇంకా పురాణగాథల్ని గాలిస్తే ఇలాంటి కేసులు కనబడతాయి

పురాణాల గొడవ అలా ఉంచండిగాని ఈరోజుల్లో జరుగుతున్న ఈ లింగభేద పరిణామాలు ముచ్చటగా ఉన్నాయి. ఆమధ్య ఒకటిరెండు ఇలాంటి కేసులగురించిచదివాం. ఏదో అనుకొన్నాం. సరిపోయింది గాని మాజీ పైలట్ కేసు వింతగా ఉంది. ఇద్దరు పిల్లల తండ్రి ఆడదానిగా మారడం వైద్యచరిత్రలోనే కొత్తట! ఇది నన్నేం బాధించడంలేదు. నాకు వచ్చిన అనుమానమల్లా ఆ పిల్లల మాజీ మగాణ్ణి నాన్నా అంటారా అమ్మా అంటారా లేకపోతే పిన్నీ అని పిలుస్తారా అన్నదే సమస్య. ఏమైనా వాళ్ళు ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డలు.

* * *

ఇంతకన్నా విడ్డూరం మనదేశంలోనే మరొకటి జరిగింది. ఒక యువకుడి కడుపులో ఆ యువకుడంత వయస్సుగల కవ ఉండటం. దాన్ని చూడడానికి తండోపతండాలుగా ప్రజలు వెళుతున్నారట.

ఇటువంటి విడ్డూరాలు రోజు కొకటి పేపర్లలో పడుతున్నాయి. ఇవన్ని చూసి "కలికాలం కలికాలం" అని కొంతమంది అబ్బురపడినా పెదవి విరచవచ్చు. అయినా అగ్నిహోత్రావధాన్లు ఇవి పూర్వంనుండీ ఉన్నవే అంటారు.

* * *

ఈ విడ్డూరాలను మించిన విడ్డూరాలు రాజకీయాలలో కనబడుతున్నాయి. ప్రజాసోషలిస్టుల చర్యలు వెయ్యిమంది మగాళ్లు ఆడవాళ్లగామారిన వార్తకన్నా - వింతగా ఉంటాయి.

తిరుకొచ్చిలో ఇటీవల జరిగిన ఎన్నికల ముందు కాంగ్రెసుని ఓడించాలనే ఏకైక మహాదాశయంతో ప్రసోషలిస్టులు వామపక్ష సమాఖ్యవాళ్లతో చేతులు కలిపారు. ఇలా చేతులు కలపడంవల్ల పూర్వం శాసనసభలో వాళ్లకి పన్నెండు సీట్లే ఉంటే, అవి కాస్తా పందొమ్మిది సీట్లుగా పెరిగాయి. బలం సగానికి సగం ఎక్కువవడం వల్లనేమో తెలియదుగాని వాళ్ళ వాదనలలోని విడ్డూరంకూడా ఆ నిష్పత్తిలోనే పెరిగింది. శాసనసభలో వాళ్ల సంఖ్య పంధొమ్మిదే ఉన్నా వాళ్లనే మంత్రివర్గం స్థాపించడానికి రాజప్రముఖు పిలిస్తే బాగుండునని వాళ్లు ఊహాగానం చేశారు. ఆ ఊహాగానం విడ్డూరంగానే ఉండవచ్చు గాని అది ఉన్నట్టుండి తప్పకుండా నిజమయి ఊరుకొంది. ముఖ్యమంత్రిగా పట్టం తాను పిళ్లై తాను పట్టం కట్టుకొన్నాడు.

కట్టుకోమనండి మనకేం అభ్యంతరం లేదు. ఎటొచ్చీ ఎన్నికలు అయిపోయిన నాటినుండి, అధికారంలోకి రావడందాకా మధ్య జరిగినవే కొంచెం కొట్టొచ్చేటట్టు కనబడ్డాయి. ఈప్రజాసోషలిస్టులు ఎన్నికలు తీరిపొయ్యాక అంతదాకా తాము చేతులు కలిపిన వామపక్ష సమాఖ్య వాళ్ళతో మరి పొత్తు లేదన్నారు. ఏదో మహత్తర ఆశయాలతో వాళ్ళు వాళ్ళూ కలిశారనుకొంటే ఇంతా చేసి ఈ కలయిక ఎన్నికల ఖర్చులు తగ్గించడానికే నట! అందుకే ఎన్నికల ఏరుదాటిన తరవాత ఎన్నికలముందు కట్టిన నేస్తం అనే తెప్పని తగలెయ్యడం దివ్యంగా ఉంది. ఏరుదాటగానే తెప్ప తగలెట్టేస్తాం అని ముందే చెప్పేంకదా అని అనడంలోనే విడ్డూరం ఉంది. "కొండ తవ్వి ఎలకని పట్టాం చరిత్రని నిర్మిస్తున్నాం" అని తమ తీర్మానం మీద తామే వ్యాఖ్యానంచేసే అధిష్ఠానవర్గం వాళ్ళున్న పార్టీలో ఈమాత్రం విడ్డూరం జరక్కపోతేనే విడ్డూరంగా ఉంటుందేమో! ఏమైనా చరిత్రని నిర్మించడానికి ఈ"ఎలకల్ని పట్టేవాళ్ళకి"అవకాశం ఇస్తూ రాజప్రముఖ్ చరిత్రని నిర్మించడమే చెప్పుకోదగ్గ సంగతి! ★

రెండో పెళ్ళి

౩

సాయంత్రమయింది. మనసులో రైళ్లు పరుగెత్తటం మొదలెట్టాయి. ఎదురుగా ఉన్న ప్రతి జీవీ నన్ను పరిహసిస్తున్నట్టూ, నన్ను తేలికగా చూస్తున్నట్టూ కనుపిస్తోంది. ఇంక రెండుగంటలలో - ఇంకోసారి కాలుజారి పోతున్నాను. ఈసారి కాలు జారటంతో పూర్తిగా వంచకుడ నయిపోతాను...

ఆనాడు... కన్నీటితో...మరణావస్థలోనున్న కాంతకి నా వాగ్దానం గుప్పున జ్ఞాపకమొచ్చింది; "ఏమండీ, బాబును అమ్మణ్ని అన్యాయం చేయనని చేతిలో చెయ్యి వెయ్యండి" అని. చేతిలో చెయ్యి వేయడం - ఆ చేతిని కాంత తన కళ్లకద్దుకోవటం - తరువాత కాంత చిరునవ్వుతో నన్నూ - చిట్టిబాబునూ - పక్కన నిలబడి ఏడుస్తున్న అమ్మణ్ణినీ వదలి...శాశ్వతంగా కళ్ళు మూయడం ఒకటి వెంట ఒకటి కళ్ళ ఎదురుగా సినిమాలాగ కనుపిస్తున్నాయి. ఏం చేయను?

వారంరోజుల క్రితం... నేను ఎంత వద్దంటున్నా నామాట వినక - చుట్టాలు, పక్కాలు బలవంతాన ఈ సంబంధం స్థిరపరచారు. నా తల్లీ దండ్రీ నేనీ పెళ్ళి చేసుకోకపోతే కాశీ లేచిపోతామన్నారు. ఆయింట పరిషేచనముకూడా చేయము అని ఖండితంగా చెప్పారు. ఆలోచనలో పడ్డది మనస్సు. ఆ రాత్రల్లా ఆలోచించాను. మనస్సు ఎటూ పాలుపోలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో నాకే తెలియదు. మిత్రుడు రామారావు వచ్చి లేపేవరకూ మెలకువ రాలేదు. లేచి చూచేటప్పటికి ఉదయం 8 గంటలయింది.

"ఏరా ఇంత మొద్దునిద్దర?"

"ఏంలేదురా. రాత్రి చాలాసేపువరకూ ఏదో ఆలోచనలో పడి నిద్రపట్టలేదు."

"ఏమిటబ్బా అంత ఆలోచనా"

"ఆ. ఆలోచనే...ఆలోచించి ఆలోచించి మతిపోతోంది కాని__"

"ఏమిటో చెప్పకుండా అట్లా బాధపడతావేరా."

"ఒకే రామం. కావలసినవాడివి కాబట్టి నీతో చెపుతున్నాను. నీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పు. అనుమానించకు ...ఏమిటంటే. ఎదురుగా లేనివాళ్లకు లేరుగదా అని అన్యాయం చేయటమా? ఎదురుగా ఉన్నవాళ్లను గురించి ఆత్మద్రోహం చేసుకోవటమా?"

"ఊ. సరేగాని ఒక్క విషయం నే నడుగుతా, నివ్వు సమాధానం చెప్పు. నివ్వు మాట్లాడుతున్నది అధమపక్షం నీ కర్థమవుతోందా అని?"

"బహుశా అర్థం కావటం లేదేమో కూడాను. అందుకనే నిన్ను పట్టుకు వేళ్లాడటం. ఏం చెప్పనురా భాయీ. చనిపోయిన కాంతతో పిల్లల కన్యాయం చేయనని మాట యిచ్చాను. ఇప్పుడు పెళ్ళిచేసుకోమని అమ్మా నాన్నా మొండిపట్టు పడుతున్నారు. ఈ విషయంలో నీ సలహా_"

"ఈ విషయంలో నేను పెద్దగా నీతో తర్కించలేనుగాని నాకు తోచిన సలహా మాత్రం చెపుతాను. నీ తల్లీ దండ్రీ పెద్దవాళ్లయారు. నీ తల్లిసంగతి నీకు తెలుసుగా - ఒకరోజు లేస్తే ఒకరోజు పడకవేయటం. అందువల్ల పిల్లపోషణ ఎంత అధ్వాన్నంగా ఉందో నీవు చూస్తూనే ఉన్నావు. అనుకోకూడదుగాని నీ తల్లికూడా రేపో మాపో అన్నట్లుగా ఉంది. దైవం సరిగా చూడక ఆమె కేమయినా అయితే, నీ కుటుంబ పరిస్థితి ఏమిటి? నీ తండ్రిని చూసేదెవరు? నీ పిల్లలగతేమిటి? పోనీ వెనక బోలెడంత నిల్వలుంటే నౌకర్లూ చాకర్లూ పెట్టి చేయించుకోవచ్చు. ఇప్పుడున్న పరిస్థితి చూస్తే ఉద్యోగం గనుక పోయిందంటే పొయ్యిలో పిల్లి లేచే విధమే లేదయ్యో. అటు ఉద్యోగమే చూసుకుంటావా...ఇటు పిల్లలు, తండ్రి సంరక్షణే చూసుకుంటావా? ఏమిటి మాట్లాడవు.."

"ఊ.....అయితే కాంత [illegible] వాగ్దానం?"

"వాగ్దానం...వాగ్దానం నిలబెట్టుకుని ఆదర్శవంతు డవుదామనుకుంటున్నావా బ్రదర్! ఆదర్శాలూ, ఆచరణ [illegible] మాటలు సాగినవాళ్లకుగాని, [illegible] ఖరీదు చెయ్యనివాళ్లకు మనకెలా సాగుతాయి చెప్పు. కాకపోయినా ఆ వ్యక్తి...వాగ్దానం చేయించుకున్న వ్యక్తి. ఆవిడ ఎప్పుడో ఈ కష్టాలన్నీ వదలి వెళ్లిపోయింది. వెడుతూ తన పిల్లలకోసం తాపత్రయపడిందిగాని, నీసుఖం, కుటుంబపరిస్థితులనుగురించి ఆ క్షణ ఆలోచించలేదు. అద్దె నా పరిస్థితు లనుకూలించనప్పుడు నీవేం చేయగలవు? పిల్ల లెలా సుఖపడతారు? నీ వెన్నన్నా చెప్పు భాయీ! ఈ పిల్లల సంరక్షణా, వంటా పెట్టూ మొదలైనవన్నీ ఆ ఆడవాళ్లకే తగునుగాని మనం చస్తే చేసుకోలేము. అందుకే వాళ్ళను 'గృహలక్ష్మి' అన్నారు పెద్దలు ... ఏమో నబ్బా నా ఉద్దేశంమాత్రం మళ్లీ ఒకయింటివాడవయితేనే బాగుంటుందని.

"మరి పిల్లలకు సుఖం లభిస్తుందంటావా?"

"లభించదని నీవు అనగలవా? ఓయి వెర్రివాడా! ప్రపంచంలో అందరు సవతితల్లులూ రాక్షసులేనంటావా? ఉదాహరణకి చూడు మా అమ్మపోయేటప్పటికి నేను నాలుగేళ్ల పిల్లవాడినట. నిజానికి మా అమ్మ ఉన్నా ఇప్పటి అమ్మదగ్గరఉన్న గారాబం, స్వతంత్రం ఉండేది కాదేమో?"

"సరే - అయితే"

రామారావు ఇంకా ఏమేమో లోకాభిరామాయణం చెప్పి ఆఫీసుటయిమైపోతోందని వెళ్ళిపోయాడు. ఆలోచనలోపడి చివరకు రామారావు చెప్పినదే మంచిదని తోచి వివాహానికి తలపడ్డాను.

వివాహం అయిపోయింది. కాని నాకు మాత్రం అడుగడుగునా ఏదో చెప్పరాని భయం ఆవేదనా కలుగుతూనే వచ్చాయి. నాకాంతకు నేను చేసినవాగ్దానం తలపుకు వస్తూనే ఉంది. వశిష్ఠులు చదివే ప్రతి

రెండో పెళ్లి

మంత్రం నా కాంత గొంతుకలోనుంచి వచ్చే ఆనాటి మాటలు గానే స్ఫురిస్తున్నాయి. ఈ జరుగుతున్న వివాహపు అనుభవాలన్నీ ఆరేళ్ళక్రితం ... నా కాంతతో జరిగినవే. నా కాంత ఎంతో అందకత్తె అని, ఆమె సాహచర్యం నా భాగ్యమని - భూమిమీద నా అంత అదృష్టవంతుడు లేడనీ - ఏవేవో ఆశలతో అప్పుడు ఆవివాహం జరిగింది. ఆరేళ్ల అనుభవం అనంతరం ఆ ఆశలన్నీ అడియాసలయినాయి. విధి తారుమారయింది. ఈనాడు మరల అదే వివాహం,.. కాని నా కాంతతో కాదు. ఆనాటి ఆలోచనలూ లేవు. కేవలం ఒక దోషిలాగ, చెయ్యరాని తప్పు చేస్తున్న అపరాధిలాగ - కూర్చుండి పోయాను. నా అపరాధానికి ఈ వివాహం ఒక శిక్షలాగుంది. ఒకటి రెండుసార్లు ఆ అమ్మాయి వైపు తలెత్తి చూశాను. అంత చక్కటి పిల్లకు నేను భర్తగా తగనేమోననిపించింది. కాని ఆ అమ్మాయి కూడా విచారంగా కూర్చున్నట్టే కనిపించింది. కామెర్లవాడికి ప్రపంచమంతా పచ్చగానే ఉంటుందిట. లేక నున్నటి ఆఅమ్మాయి చెక్కుటద్దాలలో నా ముఖమే అలా ప్రతిబింబిస్తోందా? ఏది ఎట్లా ఉన్నా ఆ రెండురోజులూ నన్ను జైలులో పెట్టి మూడవరోజున విడుదల చేసినట్లనిపించింది.

వివాహమయిన మరునటి రోజునుంచి ఎన్ని విధాల ప్రయత్నించినప్పటికీ కాంతతో గడపిన జీవితం మరపురావటం లేదు సరిగదా, ఈ వివాహం చేసుకోవటం ఏదో పెద్ద నేరం చేసినట్టుగా ఆత్మ ఘోషిస్తోంది. ఇవాళ వద్దుపొమ్మనటానికి ఇది బజారులో వస్తువు కాదుగదా! ఆనాటి మూడుముళ్లతో స్వయంగా మెడకు ఒక గుదిబండ తగిలించుకున్నట్లయింది. ఆ వివాహం, ఎందుకు చేసుకున్నానా అని చాలా బాధపడుతున్నాను. ఆరోజు రామారావు రాకపోయినా బాగుండిపోయేదేమో. వాడు చెప్పిన మాటలూ ధోరణీ నన్ను ఎక్కువగా వివాహంపైకి మనస్సు మళ్లించాయి. ఏదైనా చేతులు కాలినతరువాత ఆకులు పట్టుకోవడమే!

పాపం! ఆ అమ్మాయి పెండ్లిచేసుకుని ఏదో స్వర్గసుఖ మనుభవిద్దామని అనుకుని ఉంటుంది. తప్పేముందీ? ప్రతివాళ్ళూ యౌవనంలో అలా అనుకోవటం సహజమే గదా! నేననుకోలేదా, కాంతతో పెళ్ళి రోజున?

సరే. పెద్దలవాళ్ళంతా కలసి రెండో వివయానికికూడా లగ్నం ఏర్పాటు చేశారు. ఆ నిర్భాగ్యపు రాత్రి యిదే. అప్పుడే సాయంత్రం ఏడుగంటలయింది.. రోట్లో తలపెట్టి రోకటిపోటుకు దడవటం దేనికి?

ఇంతలో బాబూ, అమ్మడూ పరుగెత్తుకొచ్చి ఒకళ్లు నడుం, ఒకళ్లు మెడ చుట్టేశారు. "చూశారా నాన్నగారూ! తాతయ్య అంటున్నారుగదా. ఇవాళ మేము మీదగ్గర పడుకోకూడదట. బయట బల్లమీద పక్కేస్తారుట. అక్కడ తమ్ముడూ నేనూ పడుకోవాలిట... మమ్మల్ని ఒక్కళ్లనీ పడుకోబెడితే మాకు భయం కాదుటండీ. మీరేమో లోపల పడుకోవాలేం...నాన్నగారూ! మేముగూడా మీదగ్గర పడుకోవద్దూ"

ప్రపంచం గిఱ్ఱున తిరిగినట్లనిపించింది. ఈ రెండేళ్లనుంచీ, అంటే తల్లి పోయినప్పటినుంచీ వీళ్ళిద్దరూ నాదగ్గరే తిండీ, పడకానూ. పాపకు అయిదేళ్లు. బాబుకు మూడేళ్ళు. నేను చేస్తున్న ఈ పనికి ఈ పసికూనలు శిక్ష అనుభవించాలా? ప్రతి రాత్రి ఈ కూనలు నా డొక్కలో దూరి, ఆ చిట్టికాళ్ళు నాపై వేసి తల్లి పోయిన దుఃఖాన్ని కూడా మరిచి ఏదో అవ్యక్తమయిన ఆనందాన్ని పొందుతూ అలా నిద్దరపోయేవాళ్ళే! అటువంటి ఈ కూనల్ని -కళ్లు తెరవని కూనల్ని నా స్వలాభానికి గురి చేయడమా? చేసిన ఈ తప్పు సరిదిద్దుకునేదెలా? కూర్చున్న పళంగా భూకంపం వచ్చి నన్ను లోపలికి ఈడ్చుకుపోయినా బాగుండి పోను.

"ఏమిటి నాన్నగారూ మాట్లాడరూ? మీదగ్గరే పడుకుంటామండీ" అన్నది పాప.

"ఊఁ. నేనూ బబ్బొంత" అన్నాడు బాబు. ఉలిక్కిపడి మళ్ళీ మామూలు ప్రపంచంలో పడ్డాను.

"అలాగేనమ్మా. నాదగ్గరే పడుకుందురు గాని......నాదగ్గరే పడుకుందురు గాని. ఎవ్వరూ వేరు చేయలేరు" అని ఏమేమో అని నా పిల్లల్ని హృదయానికి హత్తుకున్నాను. భగభగ మండే మంటలో ఉన్నా నా కింత బాధగా ఉండేది కాదు. ఎవరేమన్నా ఏమనుకుంటున్నా బిడ్డల్ని మాత్రం నా గదిలోనే పడుకోబెట్టుకోటానికి నిశ్చయించుకున్నాను. ఆ గదిలోనే ఇంకో మంచం వేయమని ఆదేశించాను. ఈ ఆదేశానికి కొంతమంది నవ్వుకున్నారు, కొంతమంది జాలిపడ్డారు. ఎవరేమనుకుంటేనేం నా బిడ్డలకు మాత్రం ఏనుగెక్కినంత సంబరం వేసింది.

జరగవలసిన తతంగమంతా కష్టంగానే తేల్చేశారు పెద్దలు. నేను గదిలోకి వెళ్ళాను. 'పిల్లలిద్దరూ దొంగనిద్దర పోతున్నార'ని బలవంతాన మూసుకున్న వాళ్ల కళ్ళే తెలుపుతున్నాయి......నా ఆవేదన పాపం! వాళ్ళకేం తెలుసు? రేపు సవతి తల్లి చేతుల్లో నానా బాధలు పడేప్పుడు గానీ, ఈ తండ్రిని—ఈ నిర్భాగ్యపు పని చేసిన నరరూప రాక్షసుణ్ణి - వెయ్యివిధాల తిట్టుకోరూ? వెళ్ళి మంచంమీద కూర్చున్నాను. ఇద్దరూ పకపకా నవ్వుతూ "నాన్నగాలూ మేం నిద్దరపోలా. ఉత్తినే మిమ్మల్ని గమ్మత్తు చేయటానికి బబ్బున్నాము" అన్నారు.

ఇంతలో బయటనుంచి ఎవరివో ఏవో అస్పష్టంగా మాటలు వినపడ్డాయి - "ఈ కుమ్మరాంకూడా ఏమిటమ్మా ఇప్పుడూ- " అని నా పిల్లల నుద్దేశించి. నాకు ఒళ్ళు మండిపోయింది. వెంటనే వెళ్లి ఆవిడను జుట్టు పట్టుకొని తందామనిపించింది. కాని ...ఆవేశం అణగద్రొక్కుకున్నాను. ఒకళ్లనని ఏం ప్రయోజనం? తండ్రి అన్నవాడిని నేనే ఇంత కిరాతకానికి ఒడిగట్టినప్పుడు, ఎవరో పరాయివాళ్లు ఏదో అన్నారని సిగ్గుపడడం దేనికి?

"పడుకోండి బాబూ" అని వాళ్ళను నిద్రపుచ్చుతున్నాను పిల్లలు క్రమంగా కళ్లు మూసుకుంటున్నారు......ఎదురుగా శోభనపు మంచం. ఆ మంచంమీద నా కాంత.. కళ్లనీళ్ళతో నావైపూ, తన పిల్లల వైపూ చూస్తున్నట్లు అనిపించింది. నాకు కళ్లనీళ్ళు తిరిగాయి. కొత్త అత్తవారు పెట్టిన బట్టలతో కన్నీళ్లు అద్దుకున్నాను. అంతకన్న ఏం చేయగలను? ఈ జరుగుతున్న తంతు కాంతకు ఎంత కష్టంగా ఉందో తన నిమిత్తమై వచ్చిన కళ్ళనీళ్లుకూడా పరాయివారు పెట్టిన బట్టలకు అంటకూడదో - అన్నట్లు బట్టలమీద పడ్డ కన్నీరు ముత్యాల్లాగ క్రింద జారిపోయాయి.

ఇంతలో తలుపు చప్పుడయింది. ఎవరో కొత్త పెళ్లికూతురిని లోపలికి పంపి బయట తలుపు వేశారు...ఆనాడు కాంతకూడా ఇట్లాగే వచ్చింది. నూతన వధువును ఆహ్వానించలేకపోయాను. ఎంతయినా నాకు ఒక చెల్లెలిని చూసినట్లుగా ఉందిగాని ఆభావమే కలగటం లేదు...చాలాసేపు నిలబడిఉంది. పాపం పిచ్చిపిల్ల! నేను కలుగజేసుకొని ఏమైనా అంటానని—ఏవేవో కబుర్లు చెప్పి తనను ఆనందింపజేస్తానని అనుకుంటూ ఉంటుంది. కాని నేను దిగాలుపడి చూడటం తప్ప ఏమీ అనలేకపోయాను. ఆమెకూడా, బహుశా నేను పలకరించలేదనే కారణంచేత కావచ్చు - విచార

ముఖంతో అలాగే నిలబడిపోయింది. షుమారు పావుగంట గడిచింది...ఎంతసేపు ఈ మౌనం? చివరకు మగవాడి కనుక నేనే తెగించాను. ఒకసారి ఏదో ప్రారంభించబోయేసరికి, ఆమాట గొంతుకలోనే ఉండిపోయింది. అతి కష్టంమీద అన్నాను - "ఆ మంచంమీద కూర్చో—" అని. మారు మాట్లాడకుండా పోయి కూర్చుంది. ఏమి చేయాలి నేను? ఏమిటి కర్తవ్యం? దగ్గరగా వెళ్లి మాట్లాడదామా అనుకున్నాను. కాళ్లు స్వాధీనం తప్పి నిలబడలేకపోయాను. ఎలాగో లేచి నిలబడాను. ఒకే ఒక అడుగు ఆ మంచంవైపు వేశాను. రాధ - అంటే నూతన వధువు - ఎందుకో నాకేసి బెదురుగా చూసింది. ఇంతలో బాబు కెవ్వున కేకవేసి ఏడుపు ప్రారంభించాడు. ఏమిటి అపశకునం? - కాదు కాదు - ఏమిటి సూచన? నా చర్యను అరికట్టడానికి కొంత ప్రయత్నమా? వెంటనే వెళ్ళి బాబును జోకొట్టబోయాను. వాడు ఏడుపు మానలేదు. చివరకు నేనుగూడా వాడిపక్కన పడుకుని పొట్టలోకి లాక్కునేవరకూ వాడు ఏడుపు మానలేదు. రాధవైపు చూశాను. మనస్సులో ఏముందో ఎవరికి తెలుసు! మనిషిమాత్రం నిశ్చలంగా కూర్చుని ఉంది. మా నాన్నగారనే వారు - దేవుడేదిచేసినా మన మేలుకొరకే - అని. ఈ సంఘటనతో ఏం మేలుజరుగుతుంది...! అయినా ఏమిటీ నా వెర్రిగాని, అన్ని శాస్త్రాలకు అన్నివేళలా అర్థాలుంటాయా? ఏవేవో ఆలోచనలతో నాకూ నిద్రపట్టింది.

తెల్లవారు ఝామున కొద్దిగా మెలకువ వచ్చింది. రాధవైపు చూశాను. ఒక ప్రక్కగా వరిగి నిద్రపోతోంది. చంపల మీద కన్నీటి చారికలు ఇంకా అలానే ఉన్నాయి. బహుశా నా చర్యను నిరశిస్తూ— తనమీద నాకు ప్రేమలేదని రూఢిచేసుకొని— విచారించి విచారించి నిద్దరబోయి ఉంటుంది. కేవలం ఒక్కసారి నేను కాలు జారినందుకు ఎన్ని ప్రాణులు విచారించవలసి వచ్చింది! నా తప్పిదానికి నేను



పొడుగు నీడలు

—ఫొటో: ఎస్. ఎస్. శర్మ (తేలప్రోలు)

రెండో పెళ్లి

ఎన్నిసార్లు తిట్టుకున్నానో లెక్కలేదు. తల కొట్టుకుని బాదుకోవాలనిపించింది......

గడియారం నాలుగు గంటలు కొట్టింది. ఎవరో తలుపు తట్టుతూ "రాధా, రాధా" అని పిలిచారు. రాధ ఉలిక్కిపడి లేచింది. ఒకసారి నావైపు చూసి, ఒక నమస్కారం పెట్టి నింపాదిగా వెళ్లిపోవటం — నేను క్రీగంట కనిపెట్టాను...ఒక గండం గడిచినంత పనయింది...బరువుగా నిట్టూర్చాను. కాని ఎన్నాళ్లు ఈవిధంగా! ఒక రోజు, రెండు రోజులతో పోయేది కనకనా... బయట ఎవరో ఆమెను ఏవేవో గుచ్చిగుచ్చి అడుగుతున్నారు. కాని అవేమీ తనకు సంబంధించనట్లుగా ఎవరికీ ఏవిధమయిన సమాధానం ఇవ్వలేదు రాధ. ఎవరి దారిన వాళ్లు చక్కాపొయ్యారు. ఆ సందర్భంలో రాధమీద నాకు చాలా గౌరవం ఏర్పడ్డది. ఆమె ధర్మమా అని రాత్రి జరిగిన విషయం పూసగుచ్చినట్లు చెప్పలేదు.

మరునాడు—రాత్రి ఎనిమిది గంటలయింది. నేను కూర్చుని పిల్లలకు జోకొట్టుతున్నాను. తలుపు తీసుకుని ఎవరో లోపలికి వచ్చారు. ఆవిడ ఎవరో రాధవైపు చుట్టమయి ఉంటుంది. సుమారు నలభై యేళ్లుంటాయి. లోపలికి వచ్చింది. ఆవిడగారు వచ్చే ధోరణి చూసి నా ప్రాణాలు ఎగిరిపోయాయి. రాత్రి జరిగినది రాధ చెప్పిన మీదట ఆవిడగారు హుటాహుటి నామీదకు దండయాత్రకు వచ్చిందేమో ననుకున్నా. కాని అటువంటిదేమీ జరగలా. ఆవిడ సరాసరి పందిరిమంచం క్రిందనున్న ఒక పెట్టె బయటకు లాగింది. పెట్టెపై 'రాధ' అని రెండక్షరాలున్నాయి పెట్టెలోది మంచి సిల్కుచీర ఒకటి తీసుకుని పెట్టె మూతవేసి మంచంకిందకు తోసి వెళ్లిపోయింది. బ్రతుకుజీవుడా అనుకున్నాను. కాని ఆ చీర పట్టుకెళ్లడంలో, చీరమడతల్లోనుంచి ఏదో జారిపోవటం ఆవిడ చూచుకోనేలేదు. పిలిచి ఇద్దామా అని దానిని పైకి తీసేసరికి ఆవిడ వెళ్లిపోనే వెళ్లిపోయింది...తీరా చూస్తే అదొక కవరు... చూపు అప్రయత్నంగా పైవిలాసంమీద పడ్డది.—"ప్రియమైన రాధకు... ప్రేమాశీస్సులతో—రఘు" అని ఉంది. వణకుతున్న చేతులతో లోపలి ఉత్తరం తీశాను. అక్షరాలు ముత్యాలులాగ చెక్కబడిఉన్నాయి. ...ఉత్తరం చదవటం ప్రారంభించాను.

"ప్రియమైన రాధకు,

రాధా! ఎంత బాధతో నీకీ ఉత్తరం వ్రాస్తున్నానో చెప్పలేను. నీ పెండ్లికి నీ అన్న రాలేదని బాధపడకు. పెళ్లి నీకీ ఆపద తప్పించాలని ఎంతగానో ప్రయత్నించాను. ఈ రెండో పెళ్లి సంబంధం వద్దంటూ కన్నీరెట్టుకుని చూసిన నీ ముఖం నేనింక ఈజన్మలో మరిచిపోలేను. అవును. నీ యీడుకు జోడైన సంబంధం తేలేకపోయాను. నువ్వు నోరుతెరిచి అన్నందుకైనా నీకీ ఉరి తప్పించలేకపోయాను. అయినా ఒకళ్ల నవవలసిన పనేముంది? ఇద్దరు పిల్లల్ని కన్నతండ్రే కనికరించక, నీ కుత్తుక ఉత్తరించడానికి సిద్ధపడ్డాడు. చివరికి నీకు అతడి పాలపడాల్సిన గతి పట్టింది. పాత చెప్పులు పారేసి కొత్త చెప్పులు కొనుక్కున్నట్లు రెండో పెళ్లికి తయారయాడు. ఇలా జరుగుతుందని నేను కలలోనైనా తలచలేదు. అయినా నీ భర్త కఠినుడు కాడేమో! చాలామంది వల్ల విన్నాను—అతడు మంచివాడని. కాని కేవలం తన యింటి దాసిదానిగా—అంటే తన పిల్లల సంరక్షణకోసం ముసలాడి పోషణకోసం చేసుకుంటున్నాడని విని చాలా బాధపడ్డాను. కాని ఏం చేస్తాం! నిన్ను బలియివ్వడం జరిగిపోయింది. సాధ్యమయినంతవరకూ నీ భర్త ఆశయాలతో ఏకీభవించి జీవితం సుఖవంతం చేసుకోటానికి ప్రయత్నించు.

(౪౪-వ పేజీ చూడండి)

మూడుమేడలూ, నాలుగుకార్లూ

ఆరడుగుల పొడవుండి, అమెరికన్ బుష్ షర్టు వేసుకుని-ట్వేడు ఫేంటు జేబుల్లో చేతులు పెట్టుకుని గంభీరంగా నిలబడ్డాడే గాని దానికి తగిన ధైర్యం మా చిన్నబావలో ఏదీ? నుదుటను పట్టిన చెమట బిందువుల్ని తుడుచుకుంటూ - మా మాటలు వినీ విననట్టు అలా అల్లంతదూరంలో పచార్లు చేయడం మొదలెట్టేడు.

'అయితే రంగమ్మత్తా, నాకు తెలీక అడుగుతానూ, వీడి కిప్పట్లో పెళ్ళి చెయ్యదల్చుకోలేదా ఏమిటి? వాడు నాకు పెళ్ళి వద్దు మొర్రో అన్నన్నాళ్ళూ నువ్వు తెగ తొందరపడ్డావు - వాడిప్పుడు కావాలంటూంటే ఆలస్యం చేస్తున్నావు, చూడు, అరమోడ్పు కన్నులతో ఎలా చూస్తున్నాడో!' అన్నాను నేను చిన్నబావను చూపిస్తూ, మా మేనత్త నవ్వింది. వాడు కాస్త సిగ్గుపడి—

'ఏమయినా పెళ్ళి అయాక వీడికి అలంకారాలు ఎక్కువయ్యాయి!' అన్నాడు.

'అదేంమాట, అనుభవంలేని మాట? పెళ్లి కాకముందు అందరం అరగంట కోటా కొట్టినవాళ్ల మే. అదీ అయిన తరువాత అవతల దాని అలంకారాలే చూస్తాము, మనవే చూసుకుంటామా? పెళ్లికాకముందు మా మావయ్య ఎలా ఉండేవాడు? సైకిలు జోడూ, నల్లులు విశ్రమించే అల్లనాటి నల్లకోటూ - యిప్పుడెలాఉన్నాడు రంగమ్మత్తా?'

రంగమ్మత్త నుదుటి చివర చెరిగిపోని ఫేసుపౌడరూ, తలకి రాసుకున్న రంగూ యీ మాటల్ని ఒప్పుకోక తప్పలేదు.

'అయినా మునపటిలా కాదు, వీడికి పోస్టాఫ్ఫు లెక్కువైపోయాయమ్మా!' అంది ఆవిడ.

'దానికేంగాని, పిఠాపురం సంబంధం ఏమైనట్టూ? పిలవచ్చినట్టేనా?' నేను ఈ సంగతులు రంగమ్మత్తనే అడుగుతాను. మామావయ్య నడగను. ఆయనకి ఆ యింట్లో పలుకుబడి తక్కువ. పోనీ చిన్నబావనే అడుగుదామంటే - వాడిన్నాళ్ళూ నాకు పెళ్ళివద్దని మంచు ముక్కైపోయి, ఏ వేడి తగిలిందో ఓనాటి శుభముహూర్తాన నీరైపోయి పెళ్ళో పెళ్ళో అని కొన్నాళ్ళు చాటుగా, దానివల్లనా తగు ఫలితం లేక - బహిరంగంగానూ పలవరిస్తూ వచ్చాడు. ఈ పరిస్థితుల్లో వాడ్ని నేను 'పెళ్ళికూతురు చిన్నది' ఎలా ఉంది అని' అడుగుతే వచ్చే జవాబు నాకు తెలుసు. ముక్కు ఉందా, లేదా అన్నట్టు ఉన్నా వాడి కది చంపక పుష్పంలా కనపడితీరుతుంది! ఎంత గజమస్త అయినా వాడి కది సింహాకిశోరిలా గోచరిస్తుంది! మొగాడు వేష మేసుకున్నట్టు ఉన్నా ఆ పరిస్థితుల్లో వాడి కది మూర్తీభవించిన యవ్వనస్వరూపంగా తట్టితీరుతుంది! అందుకని మా రంగమ్మత్త నడుగుతేనే 'రైట్ ఇన్ఫర్మేషన్' లభిస్తుంది!— ఆవిడ పెదవి విరిచేసింది.

'తనూ ఓ మనిషే, తవుడూ ఓ కాస్టే!' అన్నట్టు అదీ ఓ సమ్మంధమే? కాకినాడ పట్టని సందులో పావురంగూడులాంటి యిల్లూ...' మా రంగమ్మత్తలాంటి వాళ్లతో పావుగంట మాటాడితే ఎప్పటికప్పుడు - మనం ఎప్పుడూ వినని తెలుగు ఫ్రేజులు దొరుకుతాయి. వాటిని ఎప్పటికప్పుడు మనస్సులో నోట్ చెయ్యడం నా కలవాటు.

'అలాగా, చెప్పు చెప్పు...' అని అందించాను నేను.

అవసరాల రామకృష్ణరావు

'ముఖ్యంగా నేను గమనించిన విషయం ఒక్కటుంది తెలుపు రంగుమీద ఆకుపచ్చ గళ్ళ పుల్లంపేటచీర, నాకు బాగా జ్ఞాపకం. పెళ్ళికూతుర్ని తీసుకొచ్చి చూపించారా, అప్పుడు ఆ అమ్మాయికి యింతో టి ఘనాపాటీ చీరా ఆచీరే కట్టబెట్టేరు. పోనీ అంతమటుకు బాగానే ఉంది, మరో గడికి ఆ అమ్మాయిని తీసుకెళ్ళిపోయారు. ఇంతల్లో ఆ అమ్మాయిఅక్కటా, అంతవరకూ నిద్దరోతోందిటా అక్కడకు వచ్చింది. ఏంచెప్పను? అదే చీరా, అదే పమిటదగ్గర చిరుగూను! పెళ్లికూతురు వదిన గారు మమ్మల్ని నేవనుకొచ్చి దిగబెట్టింది. ఆశ్చర్యం, ఆవిడ కట్టుకున్నదీ అదే చీర! ఇంత కటిక దరిద్రులకి చూసి చూసి ఎలా ఇవ్వగలం రామకృష్ణా?' నేను గట్టిగా నవ్వేను. మా చిన్నబావ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

'చూడు బాబూ, మీ అమ్మతో నే చెప్పమన్నానని చెప్పు. అన్నిటికన్నా దేనికైనా ధనం ముఖ్యం. ఆవిడ ఎరికివ ఎవరైనా సరే - పదివేలుయిస్తే చాలు, పిల్ల ఎలాఉన్నా సరే. రైటు చేసెయ్యమని చెప్పు.'

అలాగే అన్నాను నేను.

* * *

హఠాత్తుగా శుభలేఖ వస్తే ఆశ్చర్యపోయాను నేను. శెలవులకి యింటికి వచ్చినప్పుడు మా నాన్న నడిగేను.

'అదేమిటి నాన్నా అంత త్వరగా సంబంధం కుదిరిందీ? ఇంతకీ పిల్లెవరూ, మనం ఎరిగున్నట్టు లేదే?'

'బాగా దూరపు సంబంధం - వియ్యంకుడికి బెంగుళూరిలో ఏదో పనిట...' మా నాన్నమాట పూర్తవకుండానే అమ్మ అందుకుంది.

'తమ్ముడి పెత్తనం ఎప్పుడూ లేదు. చదువుకున్నవాడని మీ చిన్నబావకి పెత్త స్వతంత్రమూ లేదు. అంతా మా మరదలు పనే. ఎవరితో చెప్పాలేదు, చెయ్యాలేదు... తనే రైటు చేసేసింది.'

'పోనీ ఏదో ఒకటి... చిన్నబావకి పెళ్లంటూ అవడం కావలసింది ఇంతకీ కట్నమెంతో?'

'కట్నం లేదుట!' అన్నారు మా నాన్న. నా ఆశ్చర్యాని కంతులేకపోయింది.

'అదేమిటి?' అని అడిగేను నేను.

అమ్మ జరిగిందంతా చెప్పింది. ముందు ఓ వాడు పెళ్లికూతురి తల్లి చక్కా వచ్చిందట. వస్తూనే ఓ నూరురూపాయల పట్టుచీర తీసుకొచ్చి మా రంగమ్మత్త చేతిలో పెట్టి 'ముందుగా యిలా చెయ్యడం మా కలవాటు. మీరు పుచ్చుకోక తప్పదు' అని బలవంత పెట్టిందిట. ఆవిడ వచ్చిం దగ్గర్నుంచీ 'ఇదేమిటీ మీయింట్లో మంచి వీణా అయినా లేదూ? పట్టుమని పది గాజుగ్లాసులైనా లేవేమిటీ? ఇంకా మీ కీ పూర్వకాలపు నేతచీరలేమిటీ? మీ కారు రిపేరులో ఉండడమేమిటీ? అదేమిటి యింట్లో హాల్లో ఓ 'బార్' లైటయినా లేదూ!' ఈవిధంగా మొదలెట్టిందిట. మా అత్త ఆ రాత్రి వేళ పడకగది కురుక్షేత్రం చేసిందిట.

'మాకారా? ఘరానాగా ఆవిడమాటలెలాఉన్నాయ్, ఎంతపడితే అంత గణిస్తూ మీ బీదారుపు లెలాఉన్నాయ్? ఉన్నన్నాళ్ళూ అనుభవించాలిగాని మూటగట్టుకపోతామా?'

ఆ మరునాడు కాబోయే వియ్యపురాల్ని బజారుకి వెంటబెట్టుకుని వెళ్ళి మా అత్త

(౩౮-వ పేజీ చూడండి)

శాస్త్రజ్ఞులకు సవాలు:—

"తోడేలు బాలుడు"

హరినారాయణ్ వర్మ

ఇటీవల లక్నో ప్రాంతంలో వికలాంగుడైన ఒక బాలుణ్ణి గోనె గుడ్డలో చుట్టి ఎవరో మూడో తరగతి రైలుపెట్టెలో వదిలేశారు. ఆపిల్లవాడు, దగ్గిరకు వచ్చినవారందరినీ కరవబోవటం వగైరా కొన్ని జంతుచర్యలు చేయగా, పోలీసు అధికారులు అతణ్ణి లక్నోలోని బల్‌రామ్‌పూరు ఆస్పత్రిలో అప్పగించారు. అక్కడ వైద్యులు జరిపిన కొన్ని ప్రాథమిక పరీక్షలవల్ల, యీ కుర్రవాడు పుట్టింది మొదలు మానవ పరిసరాల్లో కాక, తోడేళ్ళను బోలిన క్రూరజంతువుల సమక్షంలో పెరిగివుంటాడనే అభిప్రాయం ఒకటి ప్రచారంలోకి వచ్చింది. ఆ కుర్రవాణ్ణి 'తోడేలు బాలుడు' అని కూడా అంటున్నారు.

రాము అనే పేరుతో యిప్పుడు పిలువబడుతున్న యీ తొమ్మిదేళ్ల బాలుడు పుట్టినది మొదలు మానవేతర పరిసరాల్లో పెరిగినందువల్లనే యీతనిలో మానవ లక్షణాలు పూర్తిగా కనిపించకుండా పోయాయని, యితణ్ణి యిప్పుడు కొంతకాలంపాటు పూర్తిగా మానవ పరిసరాల్లోనే అట్టేపెట్టి 'మచ్చిక' చేస్తే మామూలు మానవస్వభావాలు రాగలవనీ శాస్త్రజ్ఞులు ఆశిపడుతున్నారు. తదనుగుణంగా అతనిని ఆస్పత్రిలో చేర్చి వైద్యులు, మానసిక శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు జరుపుతున్నారు.

వీరి ప్రయత్నాలు ఫలించి, 'తోడేలు బాలుడు'గా బ్రతుకుతున్న రాము, మానవుడుగా తయారు అయితే, మానవజీవితానికి సంబంధించిన శాస్త్ర పరిజ్ఞానం కొన్ని మార్పులకు గురికావలసివస్తుంది. జీవికి పుట్టుకచేత వచ్చే లక్షణాలు ఏవో పరిసరాల ప్రభావంవల్లనే వచ్చే లక్షణాలు ఏవో నిర్ధారణ చేయటానికి, యీ పరిశోధనా ఫలితాలు వుత్తరోత్తరా చాలా వుపయోగపడగలవు. అంతకంటే కూడా ఎక్కువగా, మానవ నైజం అనేది మార్పుకి లొంగుతుందా అనే గడ్డు ప్రశ్నకి కొంతమటుకు సమాధానం దొరుకుతుంది.

రామూ శరీరం చాలా వికలంగా కనిపిస్తోంది. కాళ్లు, చేతులు చిన్నవి. తలా, రొమ్ము పెద్దవి. అతనంతట అతన్ని వదిలేస్తే, తొమ్మిదేళ్ల యీకుర్రాడు, మామూలుగా అందరిలా నిలబడి కాళ్లతో నడవకుండా, పసిపిల్లలు పాకినట్లు, జంతువులు కదిలినట్లూ కాళ్ళూ, చేతులు కూడా నేలకి ఆనించి పాకుతాడు. అతని శరీరంలోని కండరాలు సక్రమంగా వృద్ధిచెందని కారణంచేత, కదలలేక, యించుమించు అహర్నిశలూ వెల్లకితలా పడుకొనే వుంటాడు. ఇప్పుడిప్పుడు ఎవరైనా అతని కళ్ళముందు కాసు ఆడిస్తే గుర్తిస్తున్నాడు. గుర్తించటమంటే అది డబ్బు అనీ, దానికొక విలువ వుందనీ తెలిసి కాదు. ఏదో వస్తువు అని మాత్రం గుర్తించి, వణికిపోతున్న చేతిని చాచి దాన్ని పట్టుకోబోతాడు. ఆ వణుకుడు మూలంగా అతనంతట అతను కళ్ళ ఎదుట కనుపించే కాసుని, ఎంతగా కావాలనుకున్నా, పట్టుకోలేడు. కాసుని చూపించిన దాతలే కష్టపడి దాన్ని అతని చేతిలో పెట్టాలి. తిండి తినటం, నీళ్ళు తాగటం లాంటి శరీర ధర్మాలకు సంబంధించిన పనులుకూడా యీ కుర్రవాడు తనంతట తను చెయ్యలేడు. ఆ పనులన్నీ చేయించటానికి అతని పక్కనే ఒక నర్సు అహర్నిశలూ వుండాల్సి వచ్చింది. ఇప్పుడిప్పుడు రామూకి, తనకి అన్నం పెట్టే మనిషి ఎవరో కొద్దిగా గుర్తు తెలుస్తున్నట్లుంది; ఆమె కనిపించినప్పుడల్లా అతని ముఖంలోని కండరాలు కొన్ని అప్రయత్నంగా కదులుతున్నాయి. నర్సుకీ, రామూకి బాంధవ్యం చాలామటుకు సజావుగానే సాగిపోతున్నా అప్పుడప్పుడు ఆమెకి రామూ మూలంగా చేతిమీద గాట్లు తప్పటంలేదు! అతను తిండితినే పద్ధతికూడా మనుష్యులు తిన్నట్లుగా వుండదు. జంతువుల్లాగా ఆవురావురమని తింటాడు. పాలు తాగటంకూడా అంతే. నాలికతో కతుకుతూ తాగుతాడు. మానసికోద్రేకాలను మరోలా వ్యక్తం చేయలేక ఏమిటో అర్థంలేని అరుపులు కొన్ని అరుస్తుంటాడు. అతడి శ్రవణ ఘ్రాణేంద్రియాల శక్తికూడా జంతుస్థితిలోనే వుందో లేదో చెప్పటానికి యింకా ఆధారం చాలటంలేదు. సగటున రోజుకి ఎన్నిగంటలు నిద్రపోతాడో, సరైన లెక్కలు దొరకనందువల్ల చెప్పటం కష్టం. రామూ పరిస్థితినిగురించి ఒక్కముక్కలో చెప్పాలంటే, అవయవ లక్షణాలు ఆకారాలు మినహాగా అతనిలో మానవ లక్షణాలు ఏమిలేవని చెప్పాలి. అన్నీ జంతుచేష్టలే.

పైన పేర్కొన్న లక్షణాలనుమాత్రం ఆధారంగా తీసుకొని యీ కుర్రవాడి వయస్సు మానసికంగాగాని, శారీరకంగాగాని వూహించగలమా? మానసికంగా అతని వయస్సు పూజ్యం అని అనుకొంటే, అలాంటి వ్యక్తిని ఎప్పటికైనా మామూలు మనిషిగా తయారుచేయటమనేది సాధ్యమౌతుందా? అనువైనవాతావరణం ఏర్పాటుచేసి, అతనికి మానవులు మాట్లాడే భాష, మానవులు చేసే చేష్టలు అలవడేటట్లు చేయగలమా? అవన్నీ అతనికి నేర్పటానికి సరైన పద్ధతులు ఏమిటి? ఈడుకి తొమ్మిదేళ్ళవాడైనా, యీ కుర్రవాడు మానసికంగా పసిపిల్లడుగానే వుండిపోయాడా?

పూర్వం ఫ్రాన్సులో యిలాటిదే ఒక వుదంతం జరిగినట్లు తెలుస్తున్నది. డాక్టర్ స్టారిన్ అనే ఒకాయన తోడేలు బాలికలుగా భావించబడిన కవలపిల్లలను యిద్దరిని తెచ్చి కొంతకాలంపాటు పెంచాడు. దురదృష్టవశాత్తు ఆ యిద్దరు అమ్మాయిలూ, అకస్మాత్తుగా చచ్చిపోయినందువల్ల శాస్త్రపరిశోధనలకి అవకాశం లేకుండా పోయింది.

ఇదేమాదిరిగా యిదివరకు ఒక తోడేలు బాలుణ్ణి 1949 లో లక్నోలోనే మహాత్మాగాంధీ హాస్పిటల్‌కి తీసుకురావటం జరిగింది. లక్నో విశ్వవిద్యాలయంలో మానసికశాస్త్ర అధ్యాపకుడుగావున్న ప్రొఫెసర్ కాళీప్రసాద్ గారి పర్యవేక్షణలో, యీ వ్యాసకర్త అప్పట్లో ఆ కేసు పరిశోధనలలో కొంత పని చేసివున్నారు కూడా. ఆదిలో తోడేలు బాలుడుగా పెరిగి, తరువాత మనిషి అయి, ఇప్పుడు మోటారు డ్రైవరుగా పనిచేస్తున్న ఒకానొక వ్యక్తి జీవితగాథను యిటీవల నవభారత్ టైమ్స్ (ఢిల్లీ) పత్రిక ప్రకటించింది. ఈ వార్త సేకరించి ప్రకటించినవారి నిజాయితీని గురించి మనమేమీ శంకించనక్కరలేదు కాని, అసలా వుదంతం అంతా కూడా యిటీవలి కూర్గు ధనలక్ష్మి కథలాంటిది అయితే అయివుండవచ్చుననే అనుమానం తగులుతున్నది.

తోడేలు బాలుడి వుదంతం ఎంతవరకు నమ్మవచ్చు? తోడేలు క్రూరజంతువు. పసిపిల్లలు దాని కంటబడినప్పుడు, తోడేలు, పిల్లవాణ్ణి తినెయ్యకుండా, పట్టుకుపోయి పెంచి పోషించటమనేది సాధ్యమా అని ఎవరికైనా అనిపించవచ్చు. మామూలుగా మనుష్యుల వాతావరణంలో పెరిగే పిల్లవాడి మానసిక శారీరక పరిణామాలను

శ్రద్ధగా పరీక్షిస్తూ, ఆ పరిణామాలు యీ తోడేలు బాలుడిమీద ఎంతవరకు వున్నదీ, లేనిదీ సరిపోల్చుకొంటే కొంతలో కొంత అయినా శాస్త్రీయ ప్రయోజనం సాధించినట్లు ఔతుంది.

శిశువు పెరుగుదల సామాన్యంగా ఒక క్రమాన్ని అనుసరించి వుంటుంది. దేని తరువాత ఏఏ శక్తులు బిడ్డకు వాటంతట అవేగా వచ్చేదీ ప్రకృతి నిర్ణయించిన పద్ధతి ప్రకారం జరుగుతుంది. మానవ చేష్టలలో అతి అల్పమైనవాటితో ఆరంభమయి అంతకంతకు కష్టతరమైనవాటిని అలవరచుకొంటుంది శిశువు. తోడేలుబాలుడు 'రాము' అవయవాల అభివృద్ధి, స్థితిని మాత్రమే ఆలోచిస్తే, యితనిలో క్రమానుగతంగా మానవశరీరంలో రావలసిన మార్పులు అన్నీ యధావిధిగా వచ్చినట్లే కనిపిస్తుంది. కాని మానవచేష్టల విషయంలో మాత్రం క్రమపరిణామం లోపించింది.

ఈ కుర్రవాడి శరీరంలో కండరాల కదలికపై అతనికేమీ అధికారం లేదు. కనుపాపల కదలికల్లోనూ, నడిచేటప్పుడు కాలి కదలికల్లోనూ ప్రతి వ్యక్తికీ తన కండరాల కదలికపై కొంత అధికారం వుండటం అవసరం. ఇట్టి శక్తి ఏ బిడ్డకైతే అతిత్వరగా వస్తుందో ఆబిడ్డకు నడక వగైరా చేష్టలు అతి త్వరగా అలవడుతాయి. రాముకి మిగిలిన బిడ్డలలాగా ఏ వయస్సులో తన శరీరావయవాలపై ఎప్పుడెప్పుడు ఏఏ అధికారం సంపాదించుకోవాలో అది తెలిసివచ్చే అవకాశం లేకపోయి వుండవచ్చు. అలాంటిది సంభవం కావాలంటే రెండురకాలకారణాలు వుండి వుండాలి. ఒకటి రాము పసికుర్రుగా వున్నప్పుడే ఆ తోడేలు ఎత్తుకుపోవటం జరిగి వుండాలి; రెండు - ఆ శక్తులు ఏ కొద్దిగానో వచ్చినమీదటనే యితనిని తోడేలు ఎత్తుకుపోవటం జరిగివుంటే, తోడేళ్ళమధ్యబ్రతికే యితనికి స్వతస్సిద్ధంగానే అయినా సంపాదించుకొన్న ఆ శక్తులను వాడే అవకాశం అవసరం లేక కోల్పోయి వుండవచ్చు. ఇతను యిలా తయారుకావటానికి యింతకంటే చమత్కారమైన, మరొక కారణంకూడా వూహించుకోవచ్చు. ఆవు కడుపున మేకలు పుట్టినట్లుగా ఏతోడేలు తల్లికడుపుననో యీ నరశిశువుపుట్టితే పుట్టవచ్చుగా! అది నిజమయి వుంటుందని అనుకోవటానికి ఆస్కారం తక్కువ.

సామాన్యంగా శిశువులకు మానసికోద్రేకాలు చాలా తక్కువగా వుంటాయి కాని- అవి పైకి రావటమనేది అకస్మాత్తుగాను, ఏ అడ్డంకులూ లేకుండాను, జరుగుతుంటుంది. ఉద్రేకం ఒక్కసారి బయటకు వచ్చేస్తే శిశువు ఆ వుద్రేకం తెప్పించిన కారణాలను అవలీలగా మరచిపోతుంది. అవి నిలచివుండటం కొద్ది క్షణాలపాటే అయినా, వున్నంతసేపూ వాటి స్థాయి మాత్రం వుధృతంగా వుంటుంది. కొత్తగా భూమిమీద పడ్డ శిశువులకి మూడే మూడు రకాల వుద్రేకాలు వస్తాయని 'వాటసన్' పండితుడు అభిప్రాయపడుతున్నాడు. అవి ప్రేమ, క్రోధం, భయం. మానసికోద్రేకాల విషయంలో రాము స్థితి యింకా చంటిబిడ్డ పరిస్థితే. శిశువులో క్రమక్రమంగా వికాసం పొందవలసిన శక్తులు, మానవేతరమైన పరిసరాల్లో, విభిన్నమైన వాతావరణంలో, క్రమవికాసం పొందకుండా పోయాయి. అట్టి సహజశక్తుల వికాసమే లోపించినప్పుడు, యీ బాలుడు కొత్త విషయాలు తనకు తానై తెలుసుకొనే ప్రయత్నమే చెయ్యలేకపోవటంలో ఆశ్చర్యంలేదు.

అయితే ఒక ప్రశ్న పుట్టుతోంది— పోనీ యిప్పుడు అతనిచుట్టూ సరైన వాతావరణం ఏర్పాటుచేస్తే, అతడు మానవుడుగా ఏ శక్తులనైతే కోల్పోయాడో అవన్నీ తిరిగి పొందగలడా? ఇటీవల యితడు తనకు ఆహారం పెట్టే నర్సుని గుర్తుపట్టి మొఖంలోని కొన్ని కండరాలు కదలించటం ఆరంభించాడు కనుక, మానవ పరిసరాల్లో అట్టే పెట్టితే త్వరలోనే యితడూ మానవుడు కావచ్చునన్న ఆశ కలుగుతోంది. ఏమైనప్పటికీ వ్యక్తి వికాసానికి పరిసరాల ప్రభావానికి చాలా సంబంధం వుంది. అదిమాత్రం నిర్వివాదాంశం. కాబట్టి సరైన పరిసరాలు ఏర్పాటుచేస్తే, జంతువుల్లో కలిసిపోతున్న యీ బాలుణ్ణి వుద్ధరించటం సాధ్యపడవచ్చు.

జంతుప్రకృతిని పరిసరాల ప్రభావంలో

(౫౧-వ పేజీ చూడండి)

హాస్య నాటిక:

సంబంధం - అనుబంధం

పాత్రలు:

ఆనందం—కథానాయకుడు.
లలిత—కథానాయకి.
దాసప్ప—లలిత తండ్రి.
లింగయ్య—దాసప్పగారి శిష్యుడు, వంటవాడు.
విజయ—లలిత స్నేహితురాలు.
సోదెమ్మ—లలిత తల్లి.
విఘ్నేశం అవధాని—పురోహితుడు.
బి యన్. ఆర్. రావు—రైల్వే ఉద్యోగి.
దామోదరం—రావుగారి కుమారుడు.
కాంతమ్మ—రావుగారి అర్థాంగి.
ఇంకా కొందరు విద్యార్థులు.........

1 వ రంగం

[స్థలం: చిందర వందరగానున్న దాసప్ప మాష్టరుగారి బాక్కియిల్లు. టేబులుమీద కొన్ని పుస్తకాలు, కలం వగైరా. ప్రక్కను మూడు కుర్చీలు.

దాసప్పమాష్టారు కుర్చీమీద కూర్చుని చదువుతూ ఉంటారు. ఆయన ప్రక్కనున్న కుర్చీమీద లింగన్న కూర్చునిఉంటాడు. లలిత చాపమీద కూర్చొని యేదో అల్లుతూ ఉంటుంది.]

లలిత: నాన్నగారూ! రుక్మిణీకల్యాణం దగ్గర-ఆ వర్ణన-ఆ ఘట్టం చదివి చెప్పరూ?

లింగయ్య: అబ్బెబ్బే! అదెందుకండీ మాస్టారూ! సంబంధమా? అనుబంధమా? వాడి దుంపతెగా-అక్కడ-ఆ గొల్లాళ్ళ పిల్లల్ని అల్లరిచేసిపారేసేడూ-ఆఁ-అది చదవండీ.

ల: అబ్బా ఊరుకుందూ లింగన్నా! నువ్వెప్పుడూ అల్లరే.

లిం: పోనీలే చెల్లాయ్ ఇంక నీ యిష్టం. చిల్లర చిల్లరగా అల్లరి చెయ్యను. చదవండీ మాస్టారూ. ఏది బాగుంటే అదే చదవండి.

రళ్లమూడి సీతారామమూర్తి

దాసప్ప: ఓయ్! లింగయ్యా! నువ్వు రాగవరసతో బాగా చదువుతావట. ఏదీ. నువ్వే కాస్త చదువూ, చూదాం.

లిం: అబ్బెబ్బే! ఈ పాతరకం పద్యాల స్టైల్సు మన తలపట్టవండీ మాస్టారు. ఏ సినీమా పాంగ్సో చెప్పండి. దంచిపారేస్తా. అవైనా-మా శివయ్యవో, శేలంగివో-అయితే లింగయ్యకి పేటెంటు.

ల: నాన్నారూ! లింగన్నకు తిక్క తిరగాలి కానీ చక్కగా పాడతాడండీ.

లిం: అదుగో, అక్కడే ఉంది చిక్కు నా సంగతి నేనే చెప్పాలి. "నా కవిత్వానికి నేనే వ్యాఖ్యానం వ్రాయాలి" అని ఎవరో అన్నారట. మావాడికి వెఱ్ఱి ఎత్తనే ఎత్తదు, ఎత్తిందా, ఏడాదికి రెండుసార్లే; ఎత్తినప్పుడల్లా ఆరుమాసాలు మాత్రమే ఉంటుంది. అట్లాంటి బాపతు మనం. పాడమంటే పాడం - పాడేమా, బాబో వద్దోయ్ అన్నా ఊరుకోం - తెలుసా చెల్లాయ్. ఇంతకీ మాష్టారూ! ఎందుకీ ఊకదంపుడు? మంచివి రెండు పద్యాలు చదివి చెప్పుదురూ.

దాస: ఆ పోతన్న కవిత్వంలో మంచివనీ చెడ్డవనీ ఉన్నాయటోయ్!

లిం: అబ్బెబ్బే-మా పోతన్న పైత్యం కూడా అల్లాగేనండీ!

ల: (నవ్వుతూ) ఊరుకో లింగన్నా! చదవండి నాన్నగారూ.

దా: ఇందుగల డందులేడను సందేహము లేదు చక్రి...

(సోదెమ్మ ప్రవేశం)

సోదెమ్మ: ఉన్నాడుబాబూ! ఉన్నాడు. లేకేమి? ఏ ప్రయత్నం చెయ్యక "చేతగాకపోతే సీతారామ్" అని ధ్యానశ్లోకాలు ఏకరువు పెడుతూ-మెట్ట వేదాంతం మేస్తూ-హాయిగా నెమరువేస్తూ, తీరా కూర్చున్నవాళ్లకోసమని చేతులు చలిపట్టిపోయి, కాళ్లు గుంట్లు పట్టిపోయి, కళ్లు కాయలు కాచిపోయి ఎదురుచూస్తున్నాడు భగవంతుడు.

లిం: ఇంక వినండి. ఈకవిత్వం.

దా: అనే, అను. మరి నాలుగు పేర్చు. బుజ్జి బిరుసెక్కి, వీపు వేడెక్కి - అను. నిజంగా వున్నాడు దేవుడు. సర్వం నడిపించేవాడు వాడే. అతడే కర్త...భోక్త.

లిం: అబ్బెబ్బే. అదేమిటి మాస్టారూ! కర్తా భోక్తా ఒకడైతే రోజూ తద్దినం పెడుతుండవచ్చునన్నమాటేనా? (అందరూ నవ్వుతారు)

దా: నువ్వన్నీ ఏడా అంటే పెడా అనే అర్థాలే తీస్తావోయ్. "కర్మణ్యే వాధికా

రస్తే మా ఫలేషు కదాచన" అన్నాడు కృష్ణ భగవానుడు. అలాగునని చేతులు వేలవేసుకొని కూర్చోనూకూడదు. "అనాసక్తః కర్మఫలం కార్యం కుర్వీత" అన్నారు వాడి మీద భారం వేసి మనమూ ప్రయత్నించాలి.

సో: సరిగా ప్రయత్నిస్తే అమ్మాయికి ఏదో సంబంధం కుదిరే ఉండును. అన కూడదుగాని నేను మనవలతల్లినయివుందును. మా అన్నయ్యగారి బంగారి ఈయీడుదే కదా - చక్కా మళ్లా రెండోకాన్పట.

ల: అమ్మా! ప్రొద్దస్తమానం నీ కిదే సొదటే? నేనీయింట్లో ఉండడం బరువుగా వుందా? పెళ్ళి పెళ్ళని ప్రాణాలు కొరుకుతావు. ఎప్పుడైనా తప్పనిదేకదా. ఇప్పటి నుంచి ఏం మించిపోయింది! కొద్దిగా లోకం, - పరిస్థితులు చూడొద్దమ్మా?

సో: అలాగ చూస్తూవుండండి తండ్రీ కూతుళ్ళిద్దరూ - ఆపాటకి ఈతాళంహంగు. దొందుకు దొందూ, - సరిపోయింది.

లిం: భేష్ - బాగాఅన్నారండీ దొడ్డమ్మ గారూ. ఆ సంబంధంకంటే మీ అనుబంధం బాగుందండీ.

సో: కాదూమరీ! నా బాధ ఎవరికి కావాలి? పదిమంది ఆడవాళ్ళు నన్నుకదా అడుగుతారు! తెల్లారితే ఏ చెరువుదగ్గరో 'సోదెమ్మొదినా? ఇంకా బూరి ముక్క పెట్టవో' అని 'ఇంకా సంబంధం చూడవో' అని 'పిల్ల పెద్దదయి రెండేళ్ళయిందీ కదో' అని 'తొందరేమిటి చదువు చెప్పించి సామంతుల కిస్తుంది' అని 'కూతురు ఏ కలకటేరో అయితే సోదెమ్మ చూదామన్నా కనబడదే! కారెక్కి తిరుగుతుంది' అని నన్నుకదా అంటారు. పోనీ - చెయ్యందిన కూతురుందని నేనేం సుఖపడాలా? జ్వరం వచ్చినా జరిగే యోగ్యత లేదు. అత్తింటికి చేరే ఆడపిల్లకదా! వంటా, వార్పా? ఎప్పుడూ ఏదో పుస్తకం.

ల: ఔను. నాకు తెలుసు. అదే, నీ మనస్సులో ఉద్దేశం వేరూ. పనీ పాటు చెప్పతే చేయనన్నానా?

సోదెమ్మ: చెయ్యాలన్నవాళ్లు చెప్పకుండానే చేస్తారు. చదువుకోమని చెప్పేనా? ఒంట్లో బాగులేదు. వంట చేయకూడదూ?

లిం: అంతేనండీ దొడ్డమ్మగారు. అంతే,

ల: నాకేం తెలుసూ! అలా చెప్ప కూడదూ? ఆమాత్రం దానికి యింత రాద్ధాంత సిద్ధాంతా లెందుకూ? (అని లలిత కోపంతో పుస్తకం పడేసి వెళ్లిపోతుంది.)

లిం: అబ్బెబ్బే! దొడ్డమ్మగారు. మీ ఒంట్లో బాగులేకపోతే అసలు యింట్లోనే బాగుండదండీ. అయ్యయ్యో నాతోనైనా కాస్త ముందు చెప్పలేకపోయేరా? తలనొప్పికి భేషయినమందుందండీ. ఇంతకీ... మీ తలనొప్పి మామూలుగా తగ్గేది కాదు లెండి. రెండింటా మూడింటా వస్తూ వుంటుంది. నే చూస్తున్నాగా?

దా: మనశ్శాంతిఉంటేకదూ? ఎప్పుడూ ఒకటే ఆవేదన.

సో: అదుగో చూడు మీ మాస్టరుగారి సంగతి. మీరు మిక్కిలి ఇలాంటి మాటలు కూడాను. నీకె నా జాలి కలిగింది. ఓమందనీ మాకనీ మనసుకి తోసింది? ఎప్పుడూ ఓ దిక్కుమాలిన పుస్తకం వుంటే చాలు, మనశ్శాంతి వారికి. వారిలాగే ఆ కూతురు కూడాను. ఈ చదువు చదివి ఏంచేయాలో, కారెక్కి కలకటేరా, కుర్చీలెక్కి గుమస్తాగిరా? పిల్లకి పెళ్ళిచేయటానికి లోభించి చదువుమిష పెట్టడం. చదివిన ఆడపిల్లల బుద్ధులు చూస్తున్నాంకదూ?

దా: మొదలెట్టేవూ మళ్ళీ సోది. పుట్టగానే మీ నాన్నగారికి తెలిసిందిగామోలు, ఈ పేరు పెట్టేరు నీకు ఎంచి ఎంచి "సోదెమ్మ"అని. నీ తెలివితక్కువ నాకేమీ అర్థం కాకుండా వుంది. పిల్లకి చదువొద్దంటావు చదువుతే చెడిపోతుందా? ఉద్యోగం అంటే వొద్దుగాని, ఇల్లూ పిల్లల్ని దిద్దుకొనే తెలివుండొద్దూ? బుద్ధిచెప్పేవారికి సరియైన బుద్ధివుంటే పిల్లలబుద్ధి ఎందుకు చెడుతుంది?

లిం: దొడ్డమ్మగారూ? మా మాస్టారు గారికిమాత్రం తెలియదటండీ అబ్బెబ్బే. మీకూ తెలుసుగాని - పాత చింతకాయ పచ్చడిరకం గంగా భాగీరథీసమానులు మీ తల కెక్కించేస్తున్నారు.

సో: నా కొకరు చెప్పనక్కర్లేదు. కనిపించేదానికి గట్టెక్కి చూడడం ఎందుకూ? పెళ్ళి పేరంటం చేసుకొని మహరాజుల్లా బ్రతుకుతున్నారుకదూ మా అన్నయ్య రాజులాంటి సంబంధాలు చూసేడు.

దా: మీ అన్నయ్యసాటి మనకెందుకే. ఆయన సివిల్ సప్లయి ఆఫీసుల్లో పనిచేస్తూ రెండు చేతులా తడువుకొంటున్నాడు అంచేత అంతేసి కట్నాలు పొయ్యగలిగేడు మనది అయ్యవారి నౌఖరీ. అమాంబాపతు అరనైభరణం. ఇంతకట్నాలుపోసి ఇప్పట్లో పెళ్లిచేస్తే పకీరుల్లో కలియవలిసిందే.

లిం: ఇప్పట్నుంచీ - చూటామళ్లీ కట్టవలిసిందే. అందులో అలాంటిలాంటిసంబంధాలు కొరికితే శాశ్వతంగాను. మాస్టారు, అల్లా తిరిగొస్తానండి. రేపు శలవుగా?

(లింగన్న నిష్క్రమణ)

సో: మీబోటి చేతకానివారు చెప్పే శ్రీరంగనీతులివే. మా అన్నయ్య దోచుకున్నదో, దాచుకున్నదో! మహారాజులాంటి సంబంధాలుచూసి పిల్లలకు పెళ్లి చేసేడు. ఎవరు లంచం పుచ్చుకోలేదు? స్కూలు

ఒకడు: ఇందాకటి నుంచీ చూస్తున్నాను. ఒక సిగరెట్ తర్వాత ఒక సిగరెట్ అదే పనిగా కాలుస్తున్నారు, మంచిది కాదు.

మరొకడు: అబ్బే, అది కాదండి. అగ్గిపుల్లలు దండగ కాకుండా ఒక సిగరెట్టుతో ఇంకోసిగరెట్టు ముట్టిస్తున్నాను.

మాస్టర్లు మానీసేరా? మీరు చేతకాక మ! కట్టుకుంటే సరా?

దా: ఆ గొడవంతా యిప్పుడెందుకు పోనిస్తూ.

సో: అదే నేనూఅంటున్నాను. నాలుగు రోజులు శలవులు ఒచ్చాయి కదా? మూడు రూపాయలకు లోభిస్తే సంబంధాలేలా కుదురుతాయి? మరే మిషా పెట్టక ఓమారు వెళ్లిరండి.

దా: దూరపుకొండలు నునుపట. పెళ్లి పరుగులు తీయడానికి శక్తి ఉండొద్దూ! ఇంతా వగరకళ్ళి చూస్తే ముష్కి డొంకలూను వాళ్ళ ఆశలు తీర్చగలనా! ఒకరు చెప్తే వినవు, నీకు తోచదు. కానీ కట్నం ఇవ్వనక్కరలేదు. దగ్గరవాడు ఆనదం...

సో: అదిగో! మళ్ళా ప్రారంభించేరూ? నా కిష్టంలేదు. ముమ్మాటికీ యిష్టంలేదు.

దా: పిల్ల యిష్టపడుతూంది.

సో: దానికేం తెలుసు? ఈకాలం పిల్లల ఆకతాయితనంగాని, మా నాకు యీలా యెరుగుదుమా? మహారాజులాంటి సంబంధం. తండ్రికి రైలు ఉద్యోగం. ఎలాగైనా పిల్లణ్ణి రైలునౌఖరీలో వేయించుతారు. ఎక్కడికెళ్లినా ఖర్చుండదు. నౌకర్లు చాకరు వుంటారు. పూతికపుల్లంతపనైనా పిల్ల చేయనక్కర్లేదు. పొద్దుట మీరు లేరు. ఆ విఘ్నేశంగారొచ్చారు. వాళ్ల కబుర్లు చెప్పతూవుంటే నాకు ముచ్చటవేసింది. ఆయన మళ్ళీ ఈపూట వస్తానన్నారు.

(విఘ్నేశం అవధాని ప్రవేశం)

దా: అయ్యా, నమస్కారం. దయచేయండి. ఉదయమే వచ్చారట?

విఘ్నేశం: శీఘ్రమేవ...

సో: మాటల్లోనే వచ్చారు. నూరేళ్లు ఆయుష్షు మీకు.

వి: తథాస్తు. శుభాః శోభనాః సంపద్యంతాం (పొడుం పీలుస్తాడు.)

దా: (నవ్వుతూ) ఇంకా ఎంతమంది

★ సంబంధం - అనుబంధం ★

కక్షింతలు వేయాలో? ఎంతమందికి ముడి వేయించాలో?

వి: తథాస్తు. మనం కుదిరిస్తే తాపులు గొడ్డయినా తవ్వెడు పాలు ఇవ్వవలసిందే. మాస్టారుగారు తథాస్తు అనాలి. ఇందులో ఏముంది?

దా: గ్రంథం అంతా అప్పుడే పూర్తి అయినట్టుందే?

వి: తొందర పడవలసిందే బాబూ. పిల్ల గుమ్మంలా పెరిగింది. వందదగ్గర మరో పదికి చూడకుండాపడేస్తే ఫస్టుక్లాసు సంబంధం. చెయ్యి జారితే మరి దొరకదు. బి. యన్. ఆర్. రావుగారంటే - మరి వేరే ఎందుకు చెప్పటం? మీరూ చూస్తారు గదూ!

దా: నిజమే - కాని మా పెత్తల్లి మనుమడు తల్లిలేని పిల్లడు. మాతో సంబంధం దూరమైపోకుండా...

సో: "రెడ్డొచ్చేడు మొదలెట్టారా" అన్నట్టు, మళ్ళా మొదలెట్టేరూ? వాళ్ళ యిళ్ళు, వాళ్ళ తిళ్ళు, పడుకుందికి బల్ల మంచాలు, బయులుదేరుతే పట్టాంబళ్లు-ముద్దా? ముచ్చటా?

దా: మనకవీ లేవు కదూ. వాళ్ళకి వేవ భామల డాబు అక్కర్లేదు. సుఖంగా ఇంత తింటూ అతిథి అభ్యాగతికి ఇంత యిచ్చుకొంటున్నారు. చుట్టాన్ని చూచి, "శేవ పప్పూ, చటాకు నెయ్యి, పావుశేరు నూనె" అని బజారుకు జాబితాపంప నక్కర లేదు. అవధానులుగారు! ఆ అబ్బాయికూడ ప్రస్తుతం ఇక్కడే ట్రైబ్రేనియన్‌గా ప్రవేశించాడు. బుద్ధిమంతుడు. ఏలాగైనా యింకా చదువుతానంటాడు.

వి: మాష్టరుగారూ! నేనోమాట చెప్పుతా శాంతంగా వినండి. "దగ్గరవాళ్ళకే దగ్గు తెక్కువట" వెల తక్కువని గుడ్డి గుఱ్ఱాన్ని కొంటే వారానికి రెండుసార్లు బండి మరామత్తట." పిల్ల శాశ్వతంగా సుఖపడాలంటే ఆవిడ మాట కాదనకండి. "కలకంఠి కంట కన్నీ రొలికిన సిరియింట నుండనొల్లద"ని అంటారు పెద్దలు.

దా: ఆ. దానికేం తెలుసునండీ? ఎవరో చెప్పిన మాటపట్టుకొని "తా పట్టిన కుందేలుకి మూడే కాళ్లు" అంటుంది గాని. ఆ రావుగారి అబ్బాయి స్కూలుఫైనలైనా ప్యాసుకాలేదట. కొద్దిగా వెక్కురురకం అనికూడా విన్నాను.

సో: మీరింత చదివి ఎంత తెచ్చేస్తున్నారో? చదవకపోతే చదివిస్తారు. లేకపోయినా రెయిల్వే అంతా రావుగారి చేతిలోనే వుందట. మా మూరి అల్లుళ్ళందరికి ఏలా ఉద్యోగం ఇప్పించేరో చూడండి.

వి: తల్లికి తండ్రికి ఒక్కడు. ముద్దువల్ల పిల్లడు కొంచెం పెంకివాడుగాని వెక్కురు వాడుగాడు. జ్ఞానం వస్తే అతడే...ఆ మేనమామను చూచేరా చండశాసనుడు.

దా: ఆయన సంగతి తెలియనివారెవరు? ఏ పార్టీకి ఆ బురఖా.

సో: ఆయన కేం తెలుసునండీ? తుది మాట నే చెప్తున్నా వినండి. ఈ విషయంలో నామాటలే జరగవలసిందే. వీళ్లవాళ్లు కూచి పెట్టిన తులం బంగారంకూడ లేదు. ఇంతో అంతో మా అమ్మధర్మాన్న ఇచ్చిందే.

వి: అయ్యో, మాష్టరుగారు! రేపు నాతో బయలుదేరండి. మీ కెందుకు నచ్చదో చూస్తాను. వాళ్లసంగతి మీకు తెలియక అట్లా అంటున్నారు.

సో: తప్పకుండా వస్తారండి. ఆయనకి మాత్రం పిల్ల సిరిసంపదలతో ఉండటం యిష్టం లేదా యేమిటి? ఏదో తనవాళ్ళమీద అభిమానం చూపిస్తున్నారు. ఇంతకూ నామాట చెల్లకపోతే నా కెందుకు ఈయింట్లో? లెండి. మడి కట్టుకోండి (లోనికి వెళ్లును)

దాసప్ప: ఈ కింకపట్టు యిది విడువదు. తినక రుచి, చొరక లోతు తెలియదు. కాని ఓమారు బి.యన్.ఆర్. గారిసంగతి చూద్దాం.

వి: వస్తాను. మాష్టరుగారు, ఉదయం కలుస్తాను. నేను అధికార్లవారింట భోజనానికి వెళ్ళాలి.

(ఇద్దరు రెండువైపులా నిష్క్రమణ)

2 వ రంగం

[స్థలం - వీధి, సమయం - ఉదయం అరుస్నర. ఒకవైపునుండి విఘ్నేశంఅవధానులు, రెండోవైపునుండి లింగయ్య ప్రవేశిస్తారు]

వి: (ఎదురుగా లింగయ్యను చూచి) బయలుదేరగానే ఈవిక్కడెదురుపడ్డాడు. తిరుగుడుగంప, ప్రేలుడుకాయ. వీ డెందుకిక్కడవతరించేడో? నేనంటే అసలే పడదు. ఇక ఏదో ధూపం వేస్తాడు. శకునం బాగులేదు (రెండడుగులు మరలి) ఏం తిడతాడో, దుంపతెగా.

లిం: ఓ, హో. అవధానులుగారా! అవతారమూర్తులు. లోక సంగ్రహార్థం ఇక్కడెప్పు డవతరించేరు? శకునం బాగులేదని తిరిగి పోతున్నారా? సాకూ మేలేలెండి.

"పనసకాయబుఱ్ఱ బ్రాహ్మణుండునుబోడిముండ, పిల్లి, నూనె కుండ వక్క
ఎదురుపడిన కార్యమెగనాముమై ప్రాణహానివరకు వచ్చు గూనిలింగా!"

అన్నారు మా గురువుగారు. ఇంక నా కేవడూ ఈపూట కాఫీచుక్క నైవేద్యం పెట్టేవాడు కనిపించడు గాబోలు. సరేకానీ నేమా పూర్వ బ్రహ్మచారిని లెండి.

వి: "శతమర్కటః" అన్నారు పెద్దలు. "వజ్రం వజ్రేణ భిద్యతే"

లిం: అబ్బెబ్బే! బాగా కలవిచ్చేరు. మీకు నే నెదురు. నాకు మీ రెదురు. చెల్లుకు చెల్లు సరిపోయింది.

వి: తథాస్తు. ఒడుగేనా చేసుకో వు. బ్రహ్మచారినంటావు? ఇక్క డెప్పట్నుంచి ఉన్నావోయ్.

లిం: మీ సంగతి సెలవియ్యండి. కమీషన్ కోసానికి వచ్చారా? మూటకట్టేరా? గొడ్డు పనికట్టేసింది సుమండీ. చెప్పండి. అదేనా?

వి: (తనలో) వీడో విక్కడు. ఏమన్నా తెసుచే. అబద్ధం చెప్పేమా మరి మన పరువుండదు (ప్రకాశంగా) రామదాసు మాష్టరు గారింటికొచ్చేనోయ్.

లిం: అబ్బెబ్బే. అది నా కెందుకండీ? అక్కడసంగతీ అది - అదేనా?

వి: అఁ అదే - ఆ నారాయణరావుగారు- బి. యస్. ఆర్ అంటారు. వారబ్బాయి.

లిం: అబ్బెబ్బే! మన కెందుకండీ ఆ గొడవ.

వి: ఏ గొడవా అక్కర్లేకపోతే మరి గడబిడ చేయకు. నీ పుణ్యం ఉంటుంది. చూడు! నా మాట విను ఘష్టరకం కుదిర్చేస్తాను.

లిం: అబ్బెబ్బే! అది కుదరదండి. ఈ డఠాకోరం మన కక్కర్లేదని మీతో చెప్పాను కదూ? మనదంతా డైరెక్టు కాంట్రాక్ట్ పోనిద్దురూ. సన్నాసి గ్నాణ్ణి. నా కెందుకండీ - పచ్చగా ఉన్నచోట తినడం ఎచ్చగా వున్నచోట తిష్ఠ వెయ్యడం. అంతే. ఇంతకీ మన కంట పడిందీ చెవిని పడిందీ ఊరికేపోదు. మీకూ తెలుసిం దేగా?

వి: (తనలో) ఈ విక్కణ్ణి ఎలాగైనా మరిపించాలి. (ప్రకాశంగా) నీ తరపున మాట్లాడే పెద్దలెవరో చెప్పరాదూ. పెళ్ళి పెడాకులు లేకుండా ఎన్నాళ్ళుంటావు?

లిం: ఉభయుల తరపునా తాంబూలం పుచ్చుకొనే విఘ్నేశావధాని గారూ! కృష్ణదేవరాయల ఖుశామత్తుల్లో, హంపీ విజయనగరవీధుల్లో, రొంపపట్టిపోయి, కుడిచేత్తో పొడుం చిట్కా పీల్చేస్తూ, ఎవడైనా కనిపిస్తేచాలు ఎగతాళి చేస్తూ, తిరిగేవాడు మా ముత్తాత రామలింగడు. అతని పేరే నాకు పెటుకున్నారులెండి. ఆ మధ్య జనాభా లెక్కల్లో కెక్కి "వెక్కిరింతల వీరభద్రయ్య" అని బిరుదు సంపాదించేడు మాకో వరస తాత జంఘాలశాస్త్రి. అన్నట్టు- తల్లి వంశం - మా వేలువిడిచిన మేనమామ "గిరీశం పంతులు బహద్దరుగారు" లోకం మరమ్మత్తు చెయ్యటానికి ప్రతిజ్ఞపట్టి శంఖం పూరించి, బొంకుల దిబ్బమీద తిరిగేవాడు. మల్లి వాధు ఊరగరూ! ఊరుకున్న వారికి ఉల్లి మిరియం పెట్టి సాతాళిస్తాడు. పాపం! పిల్లవాడు. వాడూ మావాడే. ఇంతమంది మావాళ్లు అంటూవుంటే - మీరు చేసే పెళ్లి నాకొద్దు బాబూ! పెడాకులో, విడాకులో మీరే పుచ్చుకోండి. సకాలంలో కాఫీ దేవతార్చన తప్పించేరు. అపశకునం అగుపించింది. ఈ లింగడు మీకు లొంగడు. ఇక లంగరెత్తండి. (తనలో) అదుగో! దాసప్ప మాస్టారుగారు ఎక్కడికో ఊరి ప్రయాణం సజ్జుతో బయలుదేరారు. ఇంక అర్థం అయింది సంగతి. (అంటూ నిష్క్రమణ.)

వి: అపశకునం! మరి ఏ పనీ ఈవాళ జరగదు. వీడి సిగ తరగ! నా నోటే మాటంతా చెప్పించేశాడు. వీడీ సంబంధంలో దూరడుకదా! కోతిగాడు. మూర్ఖో క్షణానికే మర్చిపోతాడు. కానీ! పీడా పోయె. రైలుకు వేళవుతూంది. వేగం

★ సంబంధం - అనుబంధం ★

పోవాలి. స్టేషన్‌లో దాసప్పగారితో కలుస్తాను. (నిష్క్రమించును)

౩ వ రంగము.

[స్థలం - దాసప్పగారిల్లు. ఎదురుగా కొన్ని ఫొటోలు. సమయం - మధ్యాహ్నం ౩ గం॥ లలిత పువ్వులు కూర్చుతూ పాడుతూ ఉంటుంది. ఒక్కసారి ఇటూ అటూ చూసి ఆనందమూర్తి ఫోటో పైటలోనుండి బయటకు తీసి నిదానించి చూస్తూంది.]

ల: అందగాడని పేరుపొందనక్కరలేదు. ఆనందం కలిగించే వాడైతే చాలు. ఆ చూపులో, ఆ నగుమొగంలో ఆకర్షణ ఉంది. పెద్ద చదువులు చదివేవారి సంబంధాలు ఘడీమంటే ఘడీమనేవి ఎన్ని లేవు? చదువుకు సహృదయతకు, సంతృప్తికి, ధనార్జనకి సంబంధమేముంది? సామాన్య సంసారానికి, ధనార్జనకి సంబంధమేముంది? సామాన్య సంసారికి కావలిసినది సంతృప్తి, సహృదయత, అనురాగం, అనుకూలత.

(ప్రక్కనుండి నిశ్శబ్దముగా చూచుచు విజయ ప్రవేశం)

ల: చదువు, డబ్బు, పెద్దకులము, ఈ మూడు, యోగ్యతలు, సరసత లేకపోతే అనర్థానికి హేతువుట. నాన్నగారంటూ ఉంటారు. సంతృప్తిపడి జీవితం ఆనందమయం చేసుకోవాలని ఉంది.

(విజయ ఓ చిన్నపాట పాడును)

(లలిత గాబరాగా ఫొటో దాచివేసి విజయతో) అబ్బా! ఉలుక్కుపడ్డానే! పరధ్యానంగా ఉన్నానూ...

వి: ఆ, అదే! పరధ్యానమో, వరధ్యానమో ఉండటంబట్టి ఉలికి పడుతున్నావు. నాలాంటిదానికేముంది? బకధ్యానం తప్ప. అమ్మ ఇంట్లో లేకపోగానే నీకన్ని ఆలోచనలూ ఎక్కువవుతాయి. నే నెంతసేపై వచ్చేనో తెలుసా? మీఅమ్మ పురాణం వినడానికి సోమప్పగారింటికెళ్తూ నీకు సాయంగా నన్నిక్కడకు పంపింది. నే రాకపోతే నాటకకర్త బ్రాకెట్లు దిద్ది ఎంతవరకు స్వగతం నడిపించవలసి వచ్చేదో?

ల: ఔనే! నువ్వొచ్చేవరకే నా కాలోచనలు. నీవేదాపు వేరేదాపేముంది విజయా? మా అమ్మ కొరుపట్టు, మా ఇంటిగుట్టు అంతా అందరికీ తెలిసిందేగా? మా నాన్నగారి తత్వం పోతనకవిత్వం. ఎవరినీ ఏమీ అనలేరు మా అమ్మ ఏమన్నా వీధిని పడవలసిందే. పెళ్లి, పెళ్లని ఒకటే గోల. రోజూ రాద్ధాంతసిద్ధాంతాలే. ఇంటిలోనైనా నా చదువిక సాగదు. దూరట్టురవ్వా పడ్డంకంటే కాస్త సహృదయుణ్ని కట్టుకొని, అతనికి నచ్చచెప్పి చదువుకున్నా మేలే, సంసారం చేసినా మేలే అనిపిస్తోంది.

విజ: ఈ అవివేకపు అమ్మల బాధ నాకనుభవమేనమ్మా! చచ్చి స్వర్గంలో ఉంది మాఅమ్మ. అవిడగారి మూర్ఖత్వంచేతే నా బ్రతుకు బ్రద్దలైంది మహర్షి - మానాన్న నెత్తి మొత్తుకున్నారు. విన్నాదీ? త్రాగుబోతుకిచ్చి కట్టబెట్టింది. తలుచుకొంటే వళ్ళు ఝల్లుమంటుంది. తరువాత అదీ, ఏడ్చి, ఏడ్చి కుమిలిపోయింది. ఏం లాభం? తల్లిప్రేమవంటి ప్రేమ లేదు నిజమేకాని తెలివితక్కువ తల్లులపై వేషాలు, బడాయిలు చూచి, ముక్కు మొగం ఎరుగని దద్దమ్మలకిచ్చి పిల్లల బ్రతుకు పాడుచేసి, తరువాత "అలో లక్ష్మణ" అని ఏడ్వడంవల్ల లాభమేముంది? నా సరదా, హాస్యం ఉత్సాహం నీకు తెలిసినవేకదూ?

ల: తెలియకేమే? ఆ విజయవే కావేమో అనిపిస్తోంది.

విజయ: ఇంకా ఏడుస్తూ కూర్చుంటే ఏమౌతుందని? మొండితనంచేసి లేని ఉత్సాహం తెచ్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నాను. పాపం! నాన్నగార్కి అహర్నిశం అదే వేదన. అతని ఉద్దేశం నీతో చెప్పేనుకదూ? ఇప్పుడా ఊసు ఎందుకులే! మీనాన్న యివాళ వెళ్ళారు కాబోలు. మరెందుకు దిగులు. ఏదో కుదిరిపోతుంది.

ల: అందుకే యీ గోల. నీదగ్గర దాపెందుకు విజయా!

విజ: "దాపెందుకు విజయా?" అంటూనే కాలం గడిపేస్తున్నావు. ఇందాకేది దాచావో చూపించావు కాదు.


ల: ఉండు మరి. గేలిచేస్తావని భయం-చెప్తా విను.

విజ: ఏం వగలమారి మొగలిపువ్వవే! నాదగ్గర భయమెందుకే! ఇలాతే. (పైట లాగబోగా లలిత పైటనుండి ఫొటో క్రిందపడును.)

విజ: (ఫోటోతీసి, ప్రక్కకుపోయి, నిదానంగా చూసి) అదిగదీ సంగతి. స్వయంవరమే అయింది. ఎంత గ్రంథకర్తవే? బడబడమని ప్రబంధ కవిత్వం బాగుండదని, బయటపడని భావకవిత్వమే ప్రారంభించేవా? (ఫోటో చూపిస్తూ) ఈ పంతులు గారు, ఈ కవిగారూ, ఈ ఏక్టర్ గారు అనో జొచ్చినప్పుడే అనుకున్నాను - కథానాయకుడని. మరి నువ్వు చెప్పనక్కర్లేదు.

లలి: అసలుసంగతి వినే మరి. నాన్న సంపాదనా, పరిస్థితీ నీకు తెలుసుకదా! అమ్మ నా చదువు ఎలాగా సాగనివ్వదు. ఏ బొజ్జయ్యకో కట్టపెడతానంటుంది (ఫొటో చూపించి) ఈయన సంగతి నీకు తెలిసిందే కదూ? నేడు కాకపోతే రేపైనా అభివృద్ధికి వచ్చే మంచిగుణాలున్నాయి. పెద్ద ఆస్తిపాస్తులు లేకపోయినా అడుక్కుతినక్కరలేదు. ఈయనకు కట్నంపోసి నాన్న ఘోరవక్కర్లేదు. అన్ని విధాలా......

విజ: ఒక్కమాటతో "కన్ను కలిపేను" అనకూడదూ? ఎందుకీ బెడద? ఇంక నాన్న ఎక్కడికి వెళ్ళితే నీకేం భయం? సహాయం చేసేవారు దొరకనే దొరికారు. వద్దించేవారు మనవారమయితే కడబంక్తిని కూర్చో



మన్నారుట. అమ్మ ఏం చేస్తుంది.? ఏ సినీమా ప్లాటో, ఏ నవలప్లాటో వెయ్యి.

లలి: ఛ - ఛా! మర్యాదగా ఉపాయం ఆలోచించాలి. అందుకే నీ సలహా...

విజ: హాసలు వారితో అన్నీ అయే ఉంటాయి. అన్నట్టూ...ఆయనా... ఆయనే...ఆయన మీ ఇంటికి వస్తూ ఉంటారు. చెల్లాయీ అని, నిన్ను పిలుస్తూ ఉంటారు...అబ్బా! అందరితోనూ ఒకటే హాస్యం. ఆయనకీ సంగతి కొద్దిగా తెలిసిందా! ఆమాత్రం సహాయం నీకు చెయ్యలేకపోతారా? ఆయన మాటలు వింటూ ఉంటే నాకు చాలా సరదాగా ఉంటుంది.

ల: ఆయనా! పాపం! పేరు తెలియనట్టు చెపుతున్నావు ఔనౌను పేరుపెట్టి చెప్పకూడదుకదూ! మరచిపోయేను. ఆయనమాట మీద సరదా పుట్టిందమ్మా నీకు?

విజ: (కొంచెం కోపంతో) ఔనమ్మా! నేనసెగసెం తప్పే. ఆయనగారి మాటలు సరదాగా ఉంటాయి కదా అని అన్నాను గాని నా కెందు కాయన సంగతి? ఆయనెవరో... నే నెవరో?

ల: సరదాకు అంటే అంత కోపం ఎందుకే. ఆయనసంగతి నీవు నీ సంగతాయన తెలిసికోవచ్చు. ఇందులో తప్పేముంది.

ఆయన పేరు నీకు తెలుసుగదా? ఆయన తల్లి చనిపోతే శ్రీరంగారపు కోటలో తాతగారింటుండే వారు. నా చిన్నతనంలో మా నాన్న గారా ఊళ్లో ఉద్యోగం చేసినప్పుడు వాళ్ళ ఇంట్లో నే ఉండేవాళ్ళం. ఆ చనువు, పరిచయం ఉంది. అంచేత వస్తూ పోతూ వుంటాడు. డ్రాయింగ్ మాష్టరుగా ట్రెయినింగ్ అవుతాడట. బలే పెంకివాడుగా కనిపించినా, లింగన్న మహా మంచివాడు సుమీ! మీ నాన్నకూ బాగా తెలుసులే. మా నాన్న బయలుదేరే ముందొకమారు కలియమని మీ నాన్నెందుకో పిల్చేరట.

విజ: అయితే!

ల: అయితే! కాబోయేదే - ఇవాళ ఆదివారం కదూ?

విజ: వస్తారా? మీవారా? అందుకే ముస్తాబయ్యేవు వాసవసజ్జికలాగు

ల: మీవారో! మావారో! అది వేరే సంగతి. ఆదివారం ఔనా? కాదా? ఆ సంగతి చేవు.

[ఆనందం ప్రవేశం]

ఆనందం: మామయ్యా లేరూ?

(లలిత ముఖంలో సిగ్గు, గాబరా, సంకోచం, సరదా కనపడతాయి)

విజ: (ఇద్దరివైపూ చూచి నవ్వుతూ) మామయ్యగారు లేరు. అత్తయ్యగారూ లేరు! ఒక రూరలేరు, మరొకరు పేరరారు! కణ్వాశ్రమంలో శకుంతలలా ఈవిడే అతిథి సత్కారం చేయడానికి.

ఆ: రేపు ఊరికి వెళతాను. ఏమైనా కబురు చెబుతారేమోనని.

విజ: అందుకే...అందుకేలే...కూర్చోవయ్యా - ఆదివారం కదూ.

ఆ: (తనలో) శకునం బాగుంది. వాళ్ళింటిలో లేనప్పుడొచ్చేను.

విజ: సమయానికొచ్చేవు. ముందు మా తగువు తీర్చు! ఈవాళ ఈమె బాగా ముస్తాబైనట్టుంది కదూ!

ఆ: బాగుంది! మీ తగవూ - నా తీర్పూ!

ల: వచ్చినవారిని విసుగెత్తించుతావే విజయా! నా ముస్తాబులో విశేష మేముందీ?

విజ: రోజూకంటె ఆదివారం విశేషం కదా? ముస్తాబులో మాత్రం విశేష ముండకూడదూ? ఇంతలో సరిగా మీరు దయచేశారు. "ఊరక రారు మహాత్ములు" అన్నారు

ఆ: ఇది మరీ బాగుంది. ఆవిడ ముస్తాబైతే నే నొస్తాననుకున్నారా! నే నొస్తానని ఆవిడ ముస్తాబైందా? ఏమిటి మీ ఉద్దేశం?

విజ: నా ఉద్దేశం, మీ ఉద్దేశం తెలుసుకోడమే?

ల: మా ఉద్దేశాలకు నీ ఆదేశం బాగుంది. మా అమ్మ యింట్లో లేదు కాబట్టి నీ ఆటలు సాగుతున్నాయి. అదే వుంటే గూబలు సాగును.

విజ: అమ్మ యింట్లో లేదు కాబట్టే, నా ఆటలు, మీ వేటలు సాగుతున్నాయి. ఏమోయ్ ఊరుకున్నావు. ఊరుకున్నవారికి ఊరంతా చాలరట.

ఆ: ఊరుకోక ఏం చెయ్యమన్నారో మీరే చెప్పండి.

విజ: ఏమే! లలితా! నే చెబితే చేస్తారా! చెబితే చేసినవా రేమాత్రం చేస్తారు?

ల: ఎంత చనువున్నా గాని మగాళ్ళే కదా? ఆడాళ్లు చెప్పినట్టుచేస్తే చిన్నతనం కాదటే?

ఆ: లలిత మరో ఆకు అధికం చదువుకున్నట్టుందిగ్రంథంలో. మీ రిద్దరు ఒకే బడిలో చదువుతున్నారు. ఇక నేనే.

విజ: మేమిద్దరం ఒకటే అయితే నీకు భయంగా ఉంది కాబోలు పోనీ అది నీవైపే అవుతుంది. ఇక మీరిద్దరు ఒకటవండి. ఇక నయమేనా? ఇంకా భయమేనా?

ల. (నవ్వుతూ) విజయా! నీమాటలు శృతిమించి రాగాన్ని పడుతున్నాయి. బాగున్నాయిలే!

విజ: ఆ రాగాన్నిపట్టి నీవు జావిళీ అంగుకోకూడదూ?

ఆ: ఈ హాస్యానికేం? అటు అత్తయ్యని చూచుకోండి.

విజ: ఆ జాగ్రత్తపడకుండా తెనుమనుష్యులిల్లాగ తయారవుతారా? ఏమే మాట్లాడవు? (అని లలిత బుజములు పట్టుకొని ఊపును ఫోటో క్రిందకు జారును) చూచేవా ఎవరి జాగ్రత్తలో వారున్నారు.

ఆ: (చూచి తడబడగా) యువలో పడిన నా ఫోటో...

ల: (సిగ్గుతో వెనకకి తప్పుకొనును)

సంబంధం - అనుబంధం

విజ : "యువతి"కి కూడా పంపారు కాబోలు. అడగవే లలితా. ఆఁ అడిగిందనుకోవోయ్. నీభావాలు నచ్చేయి కాబోలు నీకథను ప్రచురించడానికి గృహలక్ష్మి కూడా అంగీకరించింది. నీకు తెలీకుండానే కథంతా జరుగుతూంది పాపం.

ల : ఇంకా. ఇంకా ఏఁ తందనాలాడతావోఆడు. అంతా బయటపడింతరవాత సిగ్గుపడేకంటే సెబాసంటే మేలు. అయితే అయింది ఇంకేం చేస్తావు?

విజ : ఇంక తెలిసిందా పంతులుగారూ? మీమాట శెలవివ్వండి. మళ్లా వర్జ్యం వస్తుంది. ముహూర్తం మించిపోతుంది. వేగం శెలవు పుచ్చుకోవాలి.

ఆ : మీరిద్దరూ తోటిదొంగలు. మనస్సును కూడ దోచుకొని తీసుకుపోగలరు. లలిత చదువుకున్నది. చక్కనిది. నాకింతకంటే ఏం కావాలి? కానీ...

విజ: కానీ - అర్ధణా - మరేం లేదు. ఇప్పుడే చెప్పేస్తున్నా.

ల : అబ్బా - విజయా - అన్నిటికీ హాస్యమేనా?

విజ: బుద్ధి. బుద్ధి. అమ్మగారి ఆజ్ఞ అయింది. బాబుగారు ఉపక్రమించవచ్చు.

ఆ: పరిస్థితుల్నిబట్టి యిప్పుడీ ఉద్యోగంలో ప్రవేశించాను. ఎలాగైనా బి. యే. పూర్తి చేస్తానని నిశ్చయించుకున్నాను. మరి అంతవరకూ...

విజ: ఆ భయం నీకొద్దు.

ఆ : ఇంతకూ అత్తయ్య...

విజ: అత్తయ్యా, అమ్మయ్యా, పూచీపేచీ లేకుండా అమ్మాయిగారి స్వయంవరం. అక్కరైనవారు దక్కితే తక్కినవాళ్ళని తప్పించుకొనే ఉపాయాలే ఉండవా?

ల : (నవ్వుతూ) విజయా! నువ్వే ఓ ఉపాయం చూడు.

విజ: మధ్య యీ పిచ్చి విజయసాక్ష్యం నీ కెందుకూ? అన్ని ఉపాయాలూ తెలియబట్టే... ఈ రోజు ముహూర్తం బెట్టి మీ అమ్మ నాన్నను పంపుతే, అదే ముహూర్తానికి అమ్మాయిగారు - ఈ అయ్యగారిని రప్పించుకున్నారు. తక్కిన ఉపాయాలు ముందు కథను బట్టి ఆలోచిద్దాం. ఇదే ఖాయమని మీ రిద్దరూ మనస్సాక్షిగా చెప్పండి.

[లలితా-ఆనందం ప్రమాణం చేస్తారు]

విజ: పూలదండలుంటే బాగుండును. మీ అమ్మ వస్తోందేమో చూసివస్తాను. (అంటూ విజయ నిష్క్రమణ)

ఆ: ప్రమాణంకూడా చేసేం. ఇంక ఎలా నడుస్తుందో కథ.

ల: అదేమో బాబు! ఆ దేముడికి తెలుసు, మా విజయకు తెలుసు. ప్రాణాలనైనా త్యజిస్తానుగాని నే నన్నమాట తప్పను. మీరు తప్పించుతే... నా కొత్మ... హత్య. మీకు అప్రతిష్ఠ తప్పవు.

ఆ: ఆలాంటి అపృచ్ఛం మాటలాడకు. నే నెన్నడూ మాటతప్పను. నేను స్వతంత్రుణ్ణి - నా విషయంలో ఆలోచనే లేదు. నీ విషయమే చూచుకోవాలి. అవసరమైతే సంగతులు విజయద్వారానో - లింగయ్యద్వారానో అందించుకోవాలి.

విజ : (ప్రవేశించి) ఆఁ...ఆఁ...... అప్పుడే అందించుకోడాలు ప్రారంభమయ్యాయీ?

ఆ : తరువాత అత్తయ్య వచ్చాక మళ్ళీ

వస్తాను. విజయా! నీకు నా ధన్యవాదాలు.

(ఆనందం మెల్లగా పోవును)

ల: అబ్బా నివ్వెంత నేర్పరివే. నీకు సిగ్గు, బిడియమూ లేదే.

విజ: లలితా! ఎవరిదగ్గర సిగ్గు చెప్పూ. మీరిద్దరూ నాకంటె చిన్న. ఆనందం నా కేమాతాడో తెలుసా? నీవూనూ. అది కాకా నీ నేర్పుకంటే నా నేర్పేమీ గొప్పది కాదు.

[తెర]

4-వ రంగం

[సమయం:- సాయంత్రం నాలుగు గంటలు.

కాంతమ్మ సినీమా పత్రిక చదువుతూంటుంది. టేబులుమీద పాట బి యన్.ఆర్. రావు ప్రవేశం - హాట్ తీసి కాంతం తలపై పెట్టి సగం కోటువిప్పి, కాంతం దగ్గరగా వచ్చును.]

బి. యన్. ఆర్: హాలోఁ ... మహిళా మండలి జాయింట్ సెక్రటరీగారు! అరే... ఇవాళ బలే ధుమాగా తయారయారే!

కాంతం: అబ్బా! ఉండండీ! వినండి మరి. అందరూ మొగమొగాలు చూచుకొని గాబరా ఎత్తిపోయేరు. అంతలాగుంది మన లెక్చరు.

బి. యన్. ఆర్: అయితే దంచి విసిరేశావన్నమాటే! ఏం చెప్పేవు?

కాం: ఏవిఁటంటే ఏవిటి, అదేమిటి, ఇదేమిటి, అన్నీనూ. ఆ హిందీ మాస్టారు రాసిచ్చినవన్నీనూ. రుక్కుపెట్టి తూచా తప్పకుండా చెప్పేనండీ.

బి. యన్. ఆర్: అప్ప చెప్పినట్టు చెప్పేవా? కొద్దిగా లెక్చరు స్టైలులో చెప్పలేక పోయావా? పోనీ ఏం చెప్పావ్ కొద్దిగా చెప్పు.

కాం: మీ రాలాగంటారుగాని లెక్చరయాక కొంతమంది తప్పట్లు కొట్టారు. నేను అక్కడ చెప్పినట్లే ఆ పోజులో నే ఆ స్టైలులో నే చెప్పనా? ఎందుకులెండి. మా సెక్రటరీ పత్రికలకి పంపారులెండి. పడితే చూస్తారుగా!

బి.యన్.ఆర్: చూచావా! అందుకే నే చెప్పేను; నాలిగింటిలో చొరబడి తిరుగుతూవుంటే" అని.

కాం: అడగడం మరచాను. రేపు వర్తకసంఘంవాళ్లు మిమ్మలిని టీకి పిల్చారట.

బి. యన్. ఆర్: ఔను! మనవేఁ ఆ మీటింగ్‌కి ప్రిసైడ్ చెయ్యాలి. నా కేదో ప్రజంటు కూడా చేయదల్చుకున్నారుట, అది మనలో మన మాటలే.

కాం: ఐతే మీరేమని చెబుతారండీ?

బి.యన్.ఆర్: ఏం చెప్పటమో? అదే ఆలోచించుతున్నా. ఒకటి చేయాలని ఉంది. నిన్న ఆ మాస్టరు నీకు రాసిచ్చినది ఉందిగా! అదే కొద్దిగా మార్చి - కట్నాలకి బదులు కంట్రోళ్లు అనేసి నాలుగు ముక్కలు పుక్కలించేస్తాను. అంతేనా?

కాం: ఔను కానీ ఏవండి? కట్నాలు, లంచాలు పుచ్చుకోకూడదని ఉపన్యాసాలకేంగాని పోలిసెట్టి పంపిన చీరలేవీ? ఇంకా మన దామోదరానికి "పిల్లనిస్తాం" అని చెప్పవస్తే...ఓ నాలుగు వేలైనా అడగం అంటారా?

బి. యన్. ఆర్. ఎవరు మాత్రం చెప్పేనట్టు చేస్తున్నారు? మన మేమి రిజిష్టరీ బాండు రాసిచ్చామా?

కాం: అన్నట్టు ఆ రామిసెట్టి వెండి కంచం పంపాడు. వాడి సరు కేదో బుక్ చెయ్యాలట. కొంచం మీతో చెప్పమని నన్ను ప్రార్థించేడు. ఆ పని చూడండి. మొన్నను ఫేక్టరీలో కోయంబత్తూరు చీరెల మాట పైకి రాలేదుకదా?

బి. యన్. ఆర్: ఆ. వచ్చినా భయం లేదులే. అంతగా మీదకొస్తే, ఆ పోర్టరు వెధవ నారాయణగాడు - మహాపోత్రంగా వున్నాడు, వాడిని తగిలించేస్తా.

కాం: అలాగుండాలి తెలివి తేటలు. ఇంకా మన దామోదరానికిలాంటి తెలివి లేదండీ పోనీ ఈ సంవత్సరమైనా పూర్తి చేస్తే బాగుణ్ణు...

బి. యన్. ఆర్: పోనిద్దూ - వెధవ చదువు. నే నెంతచదివేను. ఎవడైనా అడిగేడా? డబ్బు సంపాదించలా? మనం వెళితే సినిమా ఫ్రీ, సోడా ఫ్రీ, టీ ఫ్రీ. ఒక మాస్టరుగానికైనా యిలా జరిగిందీ? ఆ పెళ్ళి అవుతే చదువుకే స్వస్తి చెప్పించి, వాడికి ట్రెయినింగ్ యిస్తా. సంబంధాని కొచ్చిన వాళ్ళతోమాత్రం హెల్త్ చెడ్డాది కాబట్టి పరిక్షకే వెళ్లలేదని చెప్పు.

(దామోదరం ప్రవేశం)

దా: అమ్మా, అమ్మా. ఎవ్వళ్లో ఆవిగ్నేషంగారితో వస్తున్నారే.

కాం: ఒరే దామోదరం నువ్వెళ్లి కాస్త సూటు బూటు వేసికొనిరారా? మరేం మాట్లాడకు.

[దామోదరం వెళ్లిపోవును]

కాం: వాళ్లేనండీ. విఘ్నేశంగారు చెప్పేరే ఆ మాస్టరుగారు గాబోసు.

బి. యన్. ఆర్: ఇదిగో ఎంత బాగా వాణ్ణి తయారుచేస్తావో? నువ్వు వెళ్లు. ఇప్పుడు చూడాలి నీ నేక్.

[కాంతం నిష్క్రమించును]

బి.యన్.ఆర్: దాసప్ప మాస్టారు గొప్ప అమాయకుడని విఘ్నేశం అవధానులు నాతో అన్నారు. ఇల్లాంటి వాళ్ళదగ్గిర పాచిక పారుతుంది. అంతగా అయితే అవధాని మూతి కట్టుదాం.

[తెర జారును]

5 వ రంగం.

[దాసప్పగారి యింట్లో...లలిత మంచం మీద పరుండియుండును. అనారోగ్యంగా ఉన్నట్లు నటించుచుండును. మధ్య మధ్య వికారపు చూపు - నవ్వు—

విజయ మంచంమీద కూర్చొని విసరుచుండును. కొంచెం దూరంలో లింగయ్య నిల్చొనియుండును. సోదెమ్మ వేడినీళ్లు చల్లారబోస్తూఉండును.]

సోదెమ్మ: ఏమోయి! లింగయ్యా! మళ్లా ఒక్కడవే వచ్చావేమి?

లింగయ్య: ఒక్కడినే వెళ్ళాను, ఒక్కడినే వచ్చాను. జీవాత్మలాంటివాణ్ణి.

సో: అబ్బ! (విసుగుతో) డాక్టరుగారేమన్నారు?

లిం: ఆయనేమన్నా, మీరు నమ్మరు కదా! ఆయన మీ మాటెందుకు నమ్ముతారు? మొత్తంమీద యిద్దరూ నా మాట నమ్మరు. ఆయన రారు. మీరు ఊరుకోరు. అయినా నే తిరగడం మునుమ్మరు.

లలి: (వెకిలిగా నవ్వును) మధ్య నాకెందుకీ పోరు.

విజ: మందు మారుస్తారా?

లిం: మందు మార్చక్కరలేదు. అసలివ్వ నక్కరలేదట. మనసు మార్చాలంటున్నారు. ఇది "హిష్టీరియా" అంటున్నారు. ఈ జబ్బువస్తే - వాళ్ల యిష్టానుసారం జరగాలట. ఇష్టానుసారం జరగవలసిన జబ్బు కాబట్టి ఇష్టీరియా అని వచ్చింది పేరు.

ల: నా యిష్టం - అంతా నా యిష్టం - అంతా సరదాగానే ఉంది (అంటూ వికారంగా నవ్వుతూ లేస్తుంది)

విజ: (మెల్లగా లలితతో) మీ లింగన్నంటే కావలిసినంత సరదాగా ఉంటుందిలే.

సో: అదేమి సాధనమోగాని ఈ డాక్టర్లు దూరంనుంచే కబుర్లు చెప్తారు. జబ్బుకు మందిచ్చి కుదర్చాలిగాని మనస్సు కుదర్చట మేమిటో! విడ్డూరంపేర్లు చెబుతారు. ఇష్టీరియా - అట ఇద్దరీ - జాగ్రఫీ లాగ!

లిం: మీరు చెప్పిందీ నిజమేనండీ! అందుకే ఏవి చదవడమన్నా నాకు భయం.

సో: లింగయ్యా మరి నంగిరి మాట్లాడక ఓ ఘడియ కూర్చుందూ. ఇంట్లో మంచి నీళ్లు లేవు. త్రోవలో డాక్టరుగారు ఇంట్లో ఉంటే తీసుకొస్తాను. నా కాయనదగ్గర భయమా? సిగ్గా?

లిం: అబ్బేబ్బే! నాకుమాత్రం ఇక్క

సంబంధం - అనుబంధం

ఉండడానికి ఏం భయమండీ? సిగ్గా—అది చిన్నప్పుడే బొగ్గులయింది.

సో: విజయా! నే నొచ్చేవరకూ జాగ్రత్తగా ఉంటావు కదూ.

[సోదెమ్మ నిష్క్రమించును.]

విజ: లలితా! మీ లింగన్న వేసిన ఎత్తు గొప్పదే! దీనితో మీఅమ్మ ఆట కట్టు.

ల: లింగన్నా! ఊసు పోడానికో కథ చెప్పదూ. ఈ రోగంమితో విసుకెత్తుతూంది.

విజ: చిన్నపిల్లలాగ కథ చెప్పమంటూ వేమిటే? ఆయన కథ నడిపించగలరు. చెప్పటమేం గొప్ప?

లిం: ప్రస్తుతం ఏ కథ చెప్పినా నాయకీ నాయకులు ముఖ్యం.

ల: ప్రస్తుతం నువ్వు నడిపించే కథకు నాయకురాలు విజయ. నీకేం అభ్యంతరం ఉంటే చెప్పు.

లిం: అబ్బెబ్బే! నాకేం అభ్యంతరంలేదు.

ల: లింగన్నా! నీదగ్గర నాకూ అభ్యంతరం లేదు కొబట్టే చెబుతున్నా, ఘల్లయ్య తాత మా నాన్నతో మాట్లాడుతూ ఉంటే విన్నాను. నాకోసం, నువ్వు విజయ ఇంత శ్రమపడుతున్నారు. పాపం విజయ సంగతి నీకు తెలిసిందేగా?

లిం: మరొద్దు చెల్లాయ్. అర్థం అయింది నాకు నీ ఉపోద్ఘాతం అప్పుడే. మీ నాన్న వల్ల సూచా వాచాగా ఈ లింగయ్యకు తెలిసింది. నీ సంబంధం చక్కబడనీ, దానికి అనుబంధంగా ఇదీ జరుగుతుంది.

విజ: (సిగ్గు సంతోషాలను చూపుతూ) లలితా! నీకు నామీద ఏం అభిమానమే! రైలొచ్చింది. మీనాన్న యిప్పుడొస్తారు కదూ?

లిం: నాన్న రానీ, అమ్మరానీ, ఏంకానీ, నువ్వుమాత్రం నే చెప్పినట్టు చెయ్యి. మీ అమ్మగారినోటనే నీయిష్టమమ్మా అనిపిస్తాను చూడు.

సో: (ప్రవేశించి) రైలు వచ్చేసింది కదోయ్-లింగయ్యా!

దా: (రెండవ వైపునుండి ప్రవేశించి) ఎలాగుందమ్మా లలితా! మరేం భయపడకు.

సో: మీ కెక్కడ తెలిసింది?

దా: నే వస్తూవుంటే డాక్టర్ గారు కనిపించేరు. ఆయన అన్ని సంగతులూ చెప్పేరు. అందుకే ఇంత ఆలస్యమయింది.

సో: ఇంకా కేపటికి వస్తారనుకున్నా. వేగమే వచ్చేసేరు. ఏం అయిందా సంబంధం? కుదిరిందా?

దా: నాగుండె అదిరింది.

(లలిత వెఱ్ఱిగా నవ్వును)

సో: అబ్బా! చెప్పదురూ. కాయా? పండా?

దా: కాయ పండబోయింది కానిపాడింది. కుళ్లుమాపుతున్నా దేమో?

(లలిత, విజయ నవ్వుదురు)

సో: మీ కవిత్వం, పాండిత్యం నా దగ్గరేనా? అన్నట్టు, మరచేను. విజయా! మీ నాన్న ఒక్కమారు రమ్మన్నారమ్మా. పాపం. మాకోసం ఎంత శ్రమపడుతున్నావు తల్లీ. ఇల్లిరా అమ్మా.

విజ: లలితా! నే వెళ్లొస్తానే.

(విజయ లింగయ్యను చూస్తూ చిన్న నవ్వుతో వెళ్లును)

లిం: నేనూ అలా వెళ్లొస్తాను లలితా.

ల: నువ్వుండు లింగన్నా. చెప్పండి నాన్నగారూ! నేనూ వినొచ్చుగా.

దా: ఆ బి. యస్. ఆర్ గారికిగాని, ఆవిడగారికిగాని కట్నం పూచీ లేదట.

లిం: (మెల్లగా లలితతో) పెళ్లిపూచీ కూడా ఉండదు.

దా: పెళ్ళికొడుకు పెత్తల్లి పిల్లలు ఆక్షేపించకుండా వాళ్ళకిచ్చినదానికంటే కొద్దిగానో, గొప్పగానో జాస్తీ ఇస్తేగాని బాగుండదట.

లిం: అని ఆవిడే ఉవాచా?

దా: అత్తగారిలాంఛనాలు అలా అట్టేపెట్టు. ఆడబోట్టె లాంఛనాలు ఉసురు పెట్టకుండా అరువేండలు, ఇటుపైని పెళ్లికొడుకు కోరకపోయినా, సైకిలు, రిష్టువాచీ, ఉంగరాలు, సిల్కుసూటు......

ల: (గభీమని లేచి) రేజరుసెట్టు, సిగరెట్టుకేసు, సినీమా పాసు...ఇంకా

సో: మనం ఒక్కరమే ఆడపిల్లకు పెళ్ళి చేస్తున్నామా? కొద్దో గొప్పో తగ్గించమన్నారు కదూ? నే మళ్లా కబురంపుతా?

దా: మొత్తం చెయ్యిదాటిపోయింది. ఏం తగ్గినా అల్లరి తగ్గదు.

సో: అయిదువే లయితే ఏమయింది. ఒక్క పిల్లడు తల్లికి ఒంటి ఒంపెడు బంగారం. ఆయన పేర పదివేలున్నాయట బ్యాంకులో—లివవలిసినదీ, కట్టవలసినదీ మన పిల్లేగా?

దా: ఇంకా విను. కుఱ్ఱవాడిని యీవూళ్లోనే చదివించుతారట. మనం జాగ్రత్తగా చూడాలట.

సో: తరువాత మాట చూదాం! ఖాయం చెయ్యమని ఉత్తరం వ్రాయించి విఘ్నేశం గారిని పంపుతాం.

దా: అన్నీ బాగున్నాయి. అమ్మాయి కిష్టంలేదు. మనకి డబ్బులేదు. అంతే.

సో: మావాళ్లిచ్చిన భూమి అమ్మేయండి. చిన్నపిల్లలకు కష్టసుఖాలు ఏం తెలుస్తాయి? తరువాత దానికే బుద్ధివస్తుంది.

ల: మీవాళ్లిచ్చిన భూమి చెల్లదు. దుగ్ధ భూమి.

సో: (కోపంతో - గభీమని లేచి) ఈ చదు వెందుకు పనికొచ్చింది. చెంపమీద ఒక్కటి వేస్తే నోరు మూసుకువింటావు. (కొట్టబోవును) (లలిత గజగజ వణికి పడిపోవును)

లిం: అయ్యో!

దా: అయ్యో నీళ్ళు తెండి - నీళ్ళు తెండి.

(తెర జారును)

6 వ రంగం.

[తెర లేవగానే - గదిలో లింగయ్య, ఆనందం-కుర్చీలమీద కూర్చొని మాట్లాడుతూ ఉంటారు.]

లిం: ఒరే ఆనందం! ఆ సోదెమ్మవంటి వారు దొరికితే దాసప్ప మాస్టారుగారే కాదు, ఎవరైనా దద్దమ్మలే ఔతారు. అవకపోయినా లోకానికి చేతకానివాళ్ళలా కనబడుతారు. ఆ అమాయకుడు ఎంతకాలం నుంచి ఆవిడతో వేగుతున్నాడో!

ఆ: పోనిద్దూ! చెప్పే విధంగా బుద్ధి చెప్పితే ఏం చేస్తుంది? ఆయన ఊరుకుంటారు. ఆ ఉపేక్ష యిప్పుడు పీకమీదకు తెచ్చింది.

లిం: ఇవేనోయ్! నీలాంటి బాబుల మాటలూ, ఆలోచనలూ. మనం ఆ పరిస్థితులలోనే ఉంటే ఆమాత్రం పరువుగానూ డా బ్రతకలేమేమో? ఆ పిల్ల పెళ్లి విషయంలో ఆవిడ ఉరితాడు, విషంవరకు తెచ్చింది. ఎలాగైనా ఉపాయంచేత ఆవిడను సాధించాలి.

ఆ: ఆవిడను సాధించినట్టే ఉంది ఆయన? (నవ్వును)

లిం: ఆయన కాకపోతే మనం సాధించలేమూ? ఇందులో మనం కొంతసంబంధం కలిగించుకున్నాంకదూ.

ఆ: అయితే, ఏం చెయ్యమన్నావు?

లిం: అందుకు మన ఫ్రెండ్సుని ఎరేంజి చేసేను. నేర్పుగా ఇప్పుడు ఓ నాటకం ఆడాలి. ఆ దౌర్భాగ్య దామోదరుడు ఈ ఊళ్లోనే ఆంధ్రా మెట్రిక్ చదువుతున్నాడు. మాటాడితే నంగిరి. ఈడుపు కాళ్లు ఏడుపు మొగం. ఆ అభాజనప్పుటప్పయ్య గొప్ప సినిమా యాక్టర్ అయిపోదామని గాలిలో మేడలు కడుతున్నాడు. అందుకని ఆ సినీమాజ్వరం పేషెంటుకి ఆ

హాతా దెబ్బ వేసి లలిత సంబంధం ఒదిలించాలి.

ఆ. అత్తయ్యకు వాడిమీద అసహ్యం కలగనన్నాళ్ళు లలితమాట సాగదు. ఆవిడ చెవులు పొగతీసి చేస్తుందా పెళ్లి

లిం. దానికే యీ పన్నాగం అంతా - నే చేస్తామాడు ఈ దెబ్బతో "ఆ సంబంధం మళీ వొద్దోయ్ బాబూ" అనవలసిందే లలితతో కూడా చెప్పి తగు బందోబస్తు చేస్తాను

ఆ. విజయ నీకు తెలుసా!

లిం ఆహా! బాగా అడిగేవు నా అర్ధాంగి అవిషేనని ఎన్నిసార్లు చెప్పేనోయ్ నీకు పరాకు కూడా ఈ చికాకుల్లో వచ్చినట్టుంది ఆవిడె మన అసిస్టెంటు.

అదుగో! మన నేస్తులు ఆ దామోదరుణ్ణి బుట్టలో పెట్టినట్టున్నారు జగ్గారావు హుషారుగా వస్తున్నాడు నువ్వుమాత్రం సినిమా ప్రొడ్యూసర్ లాగ ఓ రెండు సినిమా బొమ్మలతోను, కెమేరాతోను తయారవు జగ్గారావు లాడ్జికి సుమా! చలో...

[తెర జారును]

7 వ రంగం

[తెర ఎత్తగా దామోదరం లాడ్జి ఒక పక్క నుండి లింగయ్య. రెండో పక్క నుండి యిద్దరు మిత్రులతో దామోదరం ప్రవేశం మిత్రులు - అప్పారావు - హనుమంతరావు]

అప్పా: (లింగయ్యతో) ఓరి లింగయ్యా! నీకోసం మేం నిన్నటినుంచి చూస్తున్నాంరా! ఈయన్నెరుగుదువు కదూ? పోనీ మనిషెవరైతే నేం. పాటవింటే మాత్రం పర్వతంలాగ అలాగే కదలకుండా మెదలకుండా అయిపోతావు. ఏమండి దామోదరం గారు! ఓ పాట విసరండి!

లిం అబ్బెబ్బే! మనిషి సెరక్కేకింటోయ్ అలా కనబడుతూంటే ఆయన్ని నే నెరుగుదును. ఇంతకీ ఆయన్ని ఎరగని వారున్నారా? పాడండీ సార్


దా. పాట కేమిటండీ - రోజా మన కలవాటే (పాడును తక్కినవారు నవ్వనీగా, నవ్వ దాచుకొందురు)

హ ఆ పాండవులు అజ్ఞాత వాసంలో ఉన్నట్లు ఈయనీ మూలపడిపోయేరు. యన్ టీ కైనా ఘంటసాల అవసరం కానీ ఈయన కదీ అక్కర లేదు

దా (నత్తితో) నావ్వళ్లు ముందు బుక్కయిపోకూడదు గాని లేకపోతే వాళ్ళ పని చెబుదునండీ ఒక్క గంట నాలా పాడే వాడేడీ అసలు మావాళ్లు వదలరుకదా! ఆ యాక్టర్లకు రైవలుగా వెళ్ళాలని ఉంది నాకు

హ ఒదలట మేమిటయ్యా వాళ్లంతా ఏం చేశారు? పారిపోలా? ఇప్పుడు మిమ్మల్ని పట్టుకొచ్చున్నారా?

లిం. ఈ పండు బుఱ్ఱలకి దద్దాళ్ళ అభి



సారచేప

(రాయపురం బీచ్‌లో తీయబడిన ఫొటో. ఈ సారచేపపొడుగు 13 అడుగుల 4 అంగుళాలు.

వి. కుటుంబరావు—మద్రాసు.

★ అనుబంధం - సంబంధం ★

రుచి తెలుస్తుందా? బెటరు ఘ్యాచరున్న వాళ్ళని పాడుచేస్తారు. ఒరే హనూ, మన దాసప్ప మేస్టారి వెఱ్ఱికూతుర్ని అంటకట్టి గొప్ప ఏక్టర్‌ని, భ్రష్టుచేస్తున్నారు. ఇప్పుడైనా ప్రయత్నిస్తేనా—

అ: అవును. ఈజీగా బుక్కవొచ్చు.

హ: ఓ అమ్మాయిని చూచి మంచి పోజుల్లో ఫోటోలు తీయించి పంపేమా, వెంటనే అతనికి సెలక్షన్, మనకు టీ తప్పదోయ్.

దా: ఏఅమ్మాయి మనకొస్తుందండీ?

లిం: ఓ పది పారేయవయ్యా. అలాంటి వాళ్లను నూర్గురిని తెస్తాను. ఇంకా ఖర్చు లేకుండా కావాలంటే మన సోడాబుడ్డీ గాడిని ఆడవేషం వేయమంటే నిమ్మి అమ్మమ్మలాగ, నర్గీస్ నాయనమ్మలాగ తయారవుతాడు. దామోదరంగారూ!

దా: మరి డబ్బుమాటో?

లిం: దీనికీ ఆలోచనేనా? మనప్రాంతం వాడు. మావాడు డబ్బున్నవాడు, బాగు పడాలని మేం కోరతాం. అంచేత, మీకు స్టుడియోకి వెళ్ళడం మూడు నిమిషాలు. ఏరా - అప్పారావ్.

అ: అంతే! కాదన్న మొగాడు ఆడగాడిద.

దా: మిమ్మల్ని నమ్మకపోవడంఏంటండీ. ఇంతకీ నా మేలుకోరేగా మీరు చెబుతున్నారు. చెప్పండేలా చెయ్యాలో.

లిం: ఐతే షేవింగయి రడీఅవండి. నేను వెళ్లి ఆ సోడాబుడ్డీగాణ్ణి మేకప్ చేయించి తీసుగొస్తా. మరిచేను. మిమ్మల్ని మోసం చేయదల్చిన దాసప్పగారికి ఓ ఉత్తరంరాసి మనం తీయించుకున్న ఫోటో నిదర్శనంగా పంపండి. ఆ వెఱ్ఱిదాన్ని కట్టబెట్టాలని చూస్తున్నవాళ్లకదే శిక్ష. ఇంతకీ పెళ్లాడితే స్వేచ్ఛ ఉండదు. ఇంటికి పోయి ఆసంగతి జాగర్తగా చూసుకోండి. వెళతా.

(లింగయ్య నిష్క్రమించును)

దా: అరే - ఫ్రెండ్స్ మరిచేను. టీ తీసుకొనివద్దాం పదండి.

(తెర జారును)

8 వ రంగం.

[దాసప్పగారింటిలో దాసప్ప; సోదెమ్మ; లలిత; విజయ, లింగయ్య ప్రవేశం.]

లిం: ఉత్తరం చదవండి మాస్టారూ. సోదెమ్మగారు వింటారు.

సో: నేనే ముందు చదివించేను. కాని అబ్బాయికి పుట్టిన బుద్ధి కాదు. ఎవళ్ళో పద్ధ్యగాఉంటే చూడలేనివాళ్లు అతడి తల కెక్కించారు.

లిం: అబ్బెబ్బే - అది కాదండీ. ఈ కాలంవాళ్ళ సంగతి మీకు తెలీదు. ఆ రకం అంతే. ఆ కవరులో ఉన్న వుత్తరంతోపాటు, ఫోటోలు కూడా చూడండి. (అని ఫోటోలు చూపించును)

సో: (చూచి తెల్లబోయి - కోపంతో) ఛీ, ఛీ. వీడి ముఖం తగలెయ్య. ఇంత సిగ్గూ లజ్జా లేని వెధవ అని నాకు తెలియదు. దానికితోడు మనకి కూడ తన ప్రతాపం తెలియజేయడానికి పంపేడు. నా కూతురి గొంతుక కోసేతునమ్మా. వెధవ లోకులూ - వెధవ సినీమాలూనూ!

దా: (ఫోటో అందుకొని చూచి) ఐతే మరేమిటనుకున్నావు. ఇది వాడికి వారసత్వమే. ఆ కాంతమ్మను చూస్తే నీకు తెలుస్తుంది. నేనెందుకు ఆదినుంచి మొరపెడుతున్నా ననుకున్నావు? భ్రష్టు సాంప్రదాయం అంటే విన్నావా?

లిం: ఆ ఫోటోలు లలితకియ్యండి?

సో: ఆ సిగ్గుమాలిన వెధవ - ఆ ముండవర్తో - ఆ ఫోటో నాకూతురు చూడొద్దు.

విజ: బావయ్య చెబుతునే ఉన్నారు.

ల: దాని కళ్ళతో చూచేవరకూ అమ్మకి బోధపడలేదు.

సో: అందుకే సినీమాలు వాటికీ నిన్ను వెళ్ళొద్దంటాను.

లిం: సినీమాలంటే అన్ని రకాలూనా?

దాస: చాలు. ఇకనైనా బుద్ధివచ్చిందా? నామాట వింటావా? నీకు లోకం ఏం తెలుసు? ఇదుగో చూడు-ఆ బి.యస్.ఆర్. గారి ఉత్తరం మరొకటి. మనం ఏదో చెప్పి ఉంటామనీ - అబ్బాయి బంగారం పట్టుకు పారిపోయాడనీ.

సో: ఇంత భ్రష్టువాళ్లని నాకేం తెలుసు? ఆ విఘ్నేశంగారి మాటలు నిజమనుకున్నాను. ఏమో వేదాలు చదివిన బ్రాహ్మడు కదా! ఇంక మీ యిష్టం లలిత పెళ్లితో నేను సంబంధం పెట్టుకోను.

దా: అమ్మయ్యా! ఇంక మీ యిష్టం అన్న మాట ఇప్పటికి నీ నోటంట విన్నాం. వాళ్లని చూస్తే...

సో: మరి చూడనక్కరలేదు. పరువు ప్రతిష్ఠఉన్న ఆడది అల్లాంటివి కళ్లతో చూడకూడదు. నా మనస్సు విరిగిపోయింది. ఆనందాన్ని పిలిపించండి. నే బతిమాలి చెప్పుకుంటాను. ఇవన్నీ చూస్తే ఆనందం సంగతి సందర్భాలు నాకు తెలుస్తున్నాయి.

లిం: అబ్బెబ్బే. అంతేనండి. చెడ్డ చూస్తేగాని మంచి తెలుపుకి రాదట. మన లలితకు ఆనందం తగినవాడు.

దా: లింగయ్యా! ఆనందాన్ని తీసుకు రావయ్యా!

[లింగయ్య నిష్క్రమణ]

దా: విజయా! మీ నాన్న ఊరిలో లేరు కాబోలు. పాపం లలిత సంబంధానికి మీది అనుబంధం అనేవాడు లింగన్న.

[విజయ సిగ్గుతో తలదించుకొని మాట్లాడకుండా లలిత దగ్గరగా చేరును]

ల: ఏమే! విజయా. పుట్టిననాడే వదలిన ఈ సిగ్గు మళ్ళా ఎప్పుడొచ్చిందే? ఊ - మాట్లాడు.

[తెర పడుతుంది] ★

దర్యాప్తు

రంగారాజుపురం వొక మేజరు పంచాయితీబోర్డు గల వొక చిన్న పట్నం. అది తాలూకా హెడ్ క్వార్టర్సు. అక్కడున్న పెద్దాఫీసరు డిప్యూటీ తాసీల్దారు. అతగాడిని నిజంగా డీటి (Deity=దేవత) లాగే ముఖ్యంగా భయంతోనూ, కొంత భక్తితోనూ చూస్తారు. ఆతరవాత పోలీసు సబినస్పెక్టరు. అతడిచేతులో వజ్రాయుధం వుంటుంది కాబట్టి భయంతోనే చూస్తారు. ఆతరవాత పంచాయితీ బోర్డు యెగ్జిక్యూటివ్ ఆఫీసరు. అతణ్ణి ముఖ్యంగా వర్తకులు భయభక్తులతో చూస్తారు హైస్కూలుంది హెడ్మాస్టరుకి పైని చెప్పిన ఆఫసర్లందరికంటే యెక్కువ జీతం వొస్తుంది. కాని అతణ్ణి ఆ వూరివారు ఆఫీసర్ల లెక్కలో చేర్చలేదు. ఇతర మేష్టర్ల సంగతి చెప్పనక్కర్లేదు.

వొకనాడు సాయంకాలం నాలుగ్గంటలకి సబినస్పెక్టరుగారు టీ, టిఫినూ సేవించి సిగరెట్టు కాలుస్తూ స్టేషనులో కూచున్నారు. అప్పుడు వో పాత్తి పంచలపండా, నీలమణి పాణిగ్రాహి అనేవాడు యేడుస్తూవొచ్చి, 'బాబూ! యినస్పెట్రో బాబూ! మాది నూరూ రూపయా దొంగ సేసేరుబాబూ' అంటూ ఆయనకాళ్లమీద పడ్డాడు. సబినస్పెక్టరు, 'ఏయ్! ఏమిటి గోలా? నిల్చుని చెప్పూ' అంటే 'నూరూ రూపయా పోయిందీ, మహాప్రో (మహాప్రభో)! 'అయితే నన్నేం జెయ్యమంటావ్?! 'అది కాదూ కాబూ. దొంగసేసేరూ.' 'దొంగతనమా? ఏయ్! నాలుగొందల తొంభై! నా డైరీ తీసుకురా.' డైరీ తెచ్చేక ఎస్సైనీలమణితో, 'నీ పేరూ?' 'నీలమొణిపాణిగ్రాహి' 'సాకీనూ - ఏవూరు?' 'పాదంపురో.' 'ఎక్కడుంది?' 'బ్రొమ్మపూరు దగ్గా వుంది.' 'నీవృత్తి?' 'పాత్తీ, పట్టా పంచా వొర్తకం.' 'ఈవూరెప్పుడొచ్చావు?' 'రెండు నెలా అయింది.' "నీబసయెక్కడ?" "ఆదెయ్యసెట్టి యింటికాడా." "ఇంటికాడేమిటి? వాళ్లింట్లోనా?" 'లేదూ బాబూ. ఆడియాది అరుగులో కొట్టువుంది. దానీలో వున్నాం." "నువ్వొక్కడివేనా, యింకెవళ్లేనా వున్నారా?" "వొక్కడే బాబూ." "అయితే యేం జరిగిందో చెప్పు." "సిత్తం. నిన్న వుదయం స్నానో సేసి మాటా పట్నాని యెదురుపాడూ, అప్పలపేంటా యెల్లినాం. అక్కడ మాకు డబ్బుయియ్యాల. అది వొసూలుసేసి గంటకిముందు యిక్కడికొచ్చేం. కొట్టులోని కెల్లిసూస్తే మాదీ పెట్టె పగిలివుందీ. అదీలో నూరురూపయాలూ లేదూ మహాప్రో"అని యేడుపారంభించేడు. "ఏయ్ షటప్. గాడిదలాగ వోండ్రపెడతావేమిటే? నేనడిగిందానికి జవాబు చెప్పు. నీ కెవళ్ళమీదేనా అనుమానం వుందా?" "వుంది బాబూ. అదెయ్యసెట్టికొడుకూ వరాలుసెట్టి దొంగసేసేడుబాబూ" "జాగ్రత్తగా మాట్లాడు. ఆదెయ్యసెటి లక్షాధికారి. అతడికొడుకు నీడబ్బు దొంగిలించేడంటావు. నిదర్శనాలేమిటి?"

పి. జి. స్వామి

"ఆడికీ ఆదెయ్యసెట్టి పైసా కూడా యియ్యడు బాబూ. ఆడుకల్లు తింతాడు (తాగతాడు), సిగ్రేటు తాగుతాడు, అయ్యరు కబ్బులో తింతాడు ఆడికి బాకీ పడినాడు. వూర్లో అందర్కి బాకీ"

"అయితే?"

"యా బైరూపయా బదుల్ యిస్తావా అని మాకు అడిగినాడు.' యియ్యాల మా సావుకారుకి రెండునూర్లు పంపాలా. యింకొ నూరూపయా తేవాలా. మేం యివ్వలేమని చెప్పేం."

"నీ పెట్టెలో నూరురూపాలున్నా యని అతడి కెలాగ తెలిసిందీ?"

"మేం సెప్పేం కాదు బాబూ. వొక నూరు వుందీ, మరొక నూరు వొసూలు సేసి తేవాలా అని."

"నువ్వు గ్రామాలకి వెళ్ళినప్పుడు ఆ డబ్బు నీతో యెందుకు తీసుకుపోలేదూ?"

"దొంగా బయం బాబూ."

"కొట్టుకి కప్పతాళం వేసేవా?"

"యేసేం"

"పెట్టెకి?"

"అదీకి యేసేం బాబూ."

"నువ్వు తిరిగి వొచ్చేసరికి కొట్టికి వేసిన తాళం బద్దలుగొట్టివుందా, తీసివుందా, వేసివుందా?"

"యేసివుందీ. తాళం తిప్పితే కష్టంగా తిరిగింది."

"లోపలి కెళ్లి చూస్తే నీ పెట్టె తీసివుందీ?"

"అవును బాబూ."

"అందులో రూపాయిలు కాక యింకేమైనా వున్నాయా?"

"మాదీ పాణీగావంచా మూడూ. మా తంబుడూగొదాధొరోవి నాలుగూ. చొయితోన్యా గిత్తో (చైతన్య స్వామి కీర్తనల పుస్తకం) వొకటి. మాదీ రొంధాతబలా (వంటగిన్నెలు) రెండూ వున్నాయి."

"మీ తమ్ముడెక్కడున్నాడు?"

"బ్రొమ్మపురో యెల్లినాడు"

"ఎప్పుడెళ్లేడు? ఎందు కెళ్లేడు?"

"నాలుగురోజు ముందు. ఆడికి కొంతుర్ధా (కూతురు) జొన్మొ (జన్మ) అయిందీ. సూసీవొస్తాని కెలినాడు."

"ఏయ్ పండా! నువ్వు గొప్పవాళ్లమీద రిపోర్టిచ్చేవు. అది అబద్ధమైతే కేసంతా నీమీద తిరిగి నీకే శిక్షవుతుంది. సరే నువ్వు వెళ్ళి నీ కొట్టుదగ్గిరుండు. మేం దర్యాప్తుకు వొస్తాం" అని అతణ్ణి పంపించి, "నాలుగొందల తొంభై! మూడూ వరాలు సెట్టి మన పి. సి. (Potential Criminals) రోలులో వున్నాడేమో. మూడు వొంటులు ఆ పేరుంటుందిలే వాడు తాగుబోతు కాబట్టి ఎప్పటికేనా మన చేతులో చిక్కుతాడని యెక్కించేవుంటాను" P.C.490, ఆ రోలు చూసి "వుంది సార్" అన్నాడు. "అయితే మరింకేం. హెచ్. సీ. అరస్టై నాలుగూ ముప్పావు (చేతివాచీ చూసి), యిప్పుడు ఫోర్టర్టీ అయింది. సిక్సుకల్లా తయారుగా వుండండి. సెట్టి యింటికి వెళ్దాం. ఇది నేను జీ. డీ.లో నోటు చేస్తాను. ఎఫ్. ఐ. ఆర్. తయారుచెయ్యి. హెచ్. సీ.తో చెప్పు" అని జి. డి. లో వ్రాసుకున్నాడు.

సర్కారు జిల్లాలలో, ముఖ్యంగా శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో, బరంపురమూ, ఆ చుట్టుపక్కల వున్న గ్రామాలనుంచీ వొరియా బ్రాహ్మణులు, పాత్తి పంచలూ, పట్టు బట్టలూ, తెచ్చి రొక్కానికీ, అరువుకీ అమ్మటం మామూలు. వాళ్లు సాధారణంగా, వొకవూళ్లో స్థిరంగా వుండేవాళ్ళకే అరువులిచ్చి మరుచటి సంవత్సరం వొచ్చి బాకీలు వసూలు చేసుకుంటూ వుంటారు. వుద్యోగస్తులకూడా యిస్తారు.

★ దర్యాప్తు ★

ఒకవేళ బదిలీ అయితే, కాబూలీవాళ్ళ లాగ, వాళ్ళ యెడ్రసులు కనుక్కొని హాజరవుతారు. నీలమణి పాణిగ్రాహి అటివాడే. వాళ్ళ సాధారణ నామధేయం 'పాత్తి పందల పండాలు.'

సాయంకాలం ఆరున్నరగంట లవుతుంది. ఎస్సై, హెచ్. సీ (సింగు), పీ సీ నాలుగొందల తొంభై, ఆదెయ్యసెట్టి ఇంటి ముందు సైకిళ్లుదిగి, సెట్టిని కేకేశారు. అతను బయటికొచ్చి 'దండాలు, దండాలు దొరసెయ్యాలి,' అని గసగస కొట్టుకుంటున్న గుండెల్తో, లోపలికి తీసుకెళ్లి, హాలులో కూచోబెట్టేడు. 'యిన్నాళ్ల మామీ దింత కటాచ్చం వొచ్చిం దదికొర్లకి' అన్నాడు.

ఎస్సై: ఏయ్, నాలుగొందల తొంభై! ఏదీ నా డైరీ, ఫిర్యాదీ యిచ్చిన స్టేటు మెంటున్నా?

సెట్టి: ఏరియా దేటి బాబూ?

ఎ: ఏమీ లేదు. మీవీధి కొట్లో వున్న నీలమణి పాణిగ్రాహి అనే ఆసామి తన పెట్టెలో నూరురూపాయలు పెట్టి వుంచి న్నాన్నా, అందులో యాభై రూపాయలు బాకీలిమ్మని మీ కుమారుడు వరాలుసెట్టి అడిగినట్టున్నా, అతను యివ్వ నిరాకరించి, కొట్టుకీ, పెట్టెకీ, తాళాలు వేసి నిన్న పుదయం దగ్గర గ్రామాలకు బాకీలు వసూలు కోరకు వెళ్ళి, తిరిగీ యీ సాయంకాలం మూడుగంటలకి వొచ్చి చూడగా తన పెట్టె పగులగొట్టబడినట్టున్నా, అందులోని నూరు రూపాయీలు (కొన్ని నోటు, కొన్ని రూపాయీలు), చోరీ కాబడ్డట్టున్నా, ఆపని మీ కుమారుడే చేసివుంటాడనిన్నీ, మాకు రిపోర్టు యిచ్చేడు.

సె: అబద్దాలు! పచ్చి అబద్దాలు! మా సిగుగోడు దొంగోడా? నమ్మకండి బాబూ. ఆడిముందు లచ్చ రూపాయి లెడితే నూకొనా నూడ్డు. ఆడు పండాగోరి నూరు రూపాయిలు తీస్తాడా?

ఎ: సరే. దర్యాప్తుమీద అంతా తేల్తుంది. సింగూ! పద. నేరం జరిగినస్థలం చూదాం.

సిం: ఫింగర్ ప్రింట యాపరేటసుకూడా తెచ్చేను సార్.

ఎ: వెరీగుడ్. అదీ వుపయోగించుదాం.

వాళ్ళిద్దరూ కలిసి ముందుగా వీధి వరండాలో వున్న కొట్టుదగ్గిర కెళ్లేరు. వెనక నించి పీ. సీ. వెళ్తున్నాడు. అప్పుడు సెట్టి 'కనిస్టేబు గారూ! అదేటి? పింగరిపింటన్నాడు?' 'అదా? ఎవరైనా, ఏ వొస్తువైనా ముట్టుకుంటే వాళ్ల వేలు ముద్రలా వొస్తువుమీద పడతాయి వాటిని సరిగ్గా ఫొటోగ్రాపు తీస్తుందా యంత్రం.' 'సచ్చాంరా గురుడా! మా సిగుగోడు రోజూ పండాగారితో మాట్లాట్టాని కెల్తాడు.' 'వెళ్ళినంత మాత్రాన భయంలేదు. తీస్తే కదూ. ఎస్సైగారు పిలుస్తున్నారు' అని వెళ్లేడు. పండావున్న కొట్టు తాలూకు ప్లాను తయారుచేసి అందులో పెట్టెవున్న స్థలం మార్కు చేసి, కొట్టుకీ, పెట్టెకీ, వేసిన కప్పతాళాలు కాయితాలలో పొట్లాలుకట్టి పోలీసుపార్టీ వెళ్ళింతరవాత పండాకూడా తన పెట్టె పట్టుకుని మరో పండావున్న బసకి పోయేడు. స్టేషను కెళ్ళింతరవాత పీ. సీ. 'సార్! సెట్టి గాభరాగా వున్నాడు. పింగర్ ప్రింటంటే యేమిటని అడిగితే చెప్పేను. మరీ గాభరాపడ్డాడు.' హెచ్.సీ. "మనదగ్గర నిజంగా ఆ యాపరేటసుండి యేడిసిందా యేమిటి. అదో కిస్తా వేసేను. బాగా పారింది." ఎస్సై: "సింగూ! నువ్వు వరాలుసెట్టి మూమెంట్సు వాచ్చెయ్యి కాఫీహోటలు అయ్యరుకీ, సిగరెట్టుషాపువాళ్ళకీ బాకీలు తీరుస్తాడో లేదో రేపటినుండీ కనిపెట్టు" అని చెప్పేడు.

నాలుగు రోజులైనతరవాత సింగువొచ్చి వరాలుసెట్టి తనకు పూళ్ళోవున్న బాకీలు చాలావరకూ తీర్చేడనీ, బ్లాక్ లిక్కరు షాపుకి రోజూ చీకటిపడగానే చంద్రశేఖరం అనే రౌడీతో హాజరవుతున్నాడనీ రిపోర్టిచ్చేడు. ఎస్సై: "ఇక దొరికేడు ఆదెయ్య. బ్లాకుమార్కెట్టులో దోచుకున్న కిలం కొంత వూడగొట్టాలి. రేపు వుదయం పదకొండు గంటలకి స్టేషనుకి హాజరవమని వరాలుసెట్టికి కబురంపు. అలా రాకపోతే యెరస్టు చేస్తామను." సింగు, "సరే. మరి ఆదెయ్యమాటో?" ఎస్సై, "దూస్తా వుండవోయ్."

మర్నాడు పదకొండు గంటలకి వరాలు సెట్టి, పట్టుడెస్సు వేసుకుని స్టేషను కొచ్చేడు. అతణ్ణి చూడగానే ఎస్సై "రండి సెట్టిగారూ. వోయ్ నూట ముప్పై యారూ! సెట్టిగారి కుర్చీ వెయ్యి." సెట్టి కూచున్న తరవాత,

ఎస్సై: ఏమిటండీ ఆ పండావాడు మీమీద రిపోర్టు చేసేడూ?

సెట్టి: అంతా అబద్ధం బాబూ. మా కొట్టుకి రెండు నెల్లద్దె బాకీవుంటే యిమ్మని అడిగితే ఆడి కోపమొచ్చింది. ఇదంతా అల్లినాడు.

ఎ: సరి దానికేమిలెండి. (జేబు తడుముతూ), సిగరెట్టుకేసు యింటిదగ్గిర మర్చిపోయేను. వోరి రాములూ!

సె: (తన సిగరెట్టుకేసు తీసియిచ్చి) ఇప్పుడింటి కెందుకు బాబూ? యిందులో వున్నాయి. కాల్చండి.

ఎ: (వొకటి తీసి) అబ్బో! హైక్లాసే అలవాటు చేసేరే. మీ రెంతవరకూ చదువు కున్నారు?

సె: పస్టు పారం సదివేను. పెద్దిజబ్బు చేస్తే మాయమ్మ నాకు సదు వచ్చిరాదని యిస్కూలు మానిపించింది.

ఎ: చదువు లేకపోతే మీకు లోప మేమిటండీ. మీకు పెళ్ళైందా?

సె: అయింది.

ఎ: భార్య వొచ్చిందా?

సె: ఏటి రావడం. యింకా మూడేళ్ళ మాట.

ఎ: అయితేమాత్రం. మీ రూరుకున్నారా యేమిటి. నాకు తెలిసిందిలెండి.

సె: (కుషీగా చిరునవ్వుతో) తమలాటోరు అలాటివి యినకూడదు సినోళ్ళు సినోళ్ళేగదా బాబూ.

ఎ: అయితే మీకు డబ్బెలాగ వొస్తుంది వీటన్నిటికీని?

సె: మా నాయ నిస్తాడు. మా యమ్మ కూడా యిస్తుంది.

ఎ: సరే మీరు వెళ్ళండి. ఎక్కడి కెళ్తారిప్పుడు?

సె: మా నేస్తం, చంద్రసేకరం కాడికి.

(సెట్టి వెళ్ళేడు)

ఎ: సింగూ! చంద్రశేఖరమంటే, ఆ డ్రంకర్డూ, రౌడీనీ కదూ?

సి: అవును సార్. కాని వీణ్ణి సుళువుగా విడిచీసేరే.

ఎ: వీ డెందుకోయ్. ఆడెయ్యని అర్జంటుగా రమ్మన్నానని నిల్చున్నపాటుని లావు్కరా.

సి: యెస్సార్.

ఆదెయ్య సెట్టి రాగానే మర్యాదా చేసి కూచో బెట్టి.

ఎ: వొరే రాములూ! సెట్టిగారికి వో సోడాబుడ్డీ, కిల్లీ తీసుకునిరా. (అర్ధం తరవాత) సెట్టిగారూ! సిగరెట్టు కాలుస్తారా? (అని తన సిగరెట్టుకేసు తీస్తూవుంటే)

సెట్టి: వొద్దు బాబూ. అలవాటు లేదు.

ఎ: అయితే సెటిగారూ! మీవాడికి అంత డబ్బు కర్చుకెందుకిస్తారూ? చిన్నవాళ్ళకి చేతులో డబ్బుంటే చెడిపోరూ?

సె: రామా! రామా! మా వరాలుకే యలవాట్లూ లేవు బాబూ నాకుమాత్రం తెల్దా. ఆడికి వో పైసాయయినా యియ్యను. ఆళ్ళమ్మకూడా అంతే.

ఎ: ఆలాగన్నారు నాకు సంతోషం. అల్లా వుంచితేనేగాని మీరు కష్టపడి పోగుచేసిన డబ్బంతా మూడురోజుల్లో యెగిరిపోతుంది.

సె: అవును బాబూ. అంచేతే అడిక్కొవల్సిన టిపే నింటికాడే, యేవో, సక్కిడేలూ, సెవుడేలూ, జంచుట్లూ, ఆళ్ళమ్మ యిస్తుంది.

ఎ: సరే. ఆ పండావాణ్ణింకా మీ యింట్లో వుంచేరా యేమిటి?

సె: ఆ డప్పుడే యెల్లేడు.

ఎ: సరే. మీరు వెళ్ళండి. వాడి రిపోర్టేదో ఫైసల్చెయ్యాలి. మళ్ళీ కబురుచేస్తే రండి.

సె: సిత్తం. తమరి దయ. యేదో తమకి సంతోషం సేస్తాను.

ఎ: ఆ! నాకేమీ వొద్దండీ. నా డ్యూటీ నేను చేసుకుపోతాను.

సె: తమరు దరమరాజులు, (అంటూ వెళ్లేడు.)

సింగు: సార్! సెట్టితో యీ హస్తంతా యెందుకూ?

ఎ: మనకొక్కవలసిన పాయింటు లాగేం కదోయ్.

సి: ఏమిటా పాయింటు?

ఎ: వాడు తన కొడుక్కి, తనుగానీ, తన పెళ్ళాంగానీ, వొక దమ్మిడీయైనా యివ్వడం మామూలు లేదని చెప్పేడా? మరి వరాలుకి తాగుడుకీ, కాఫీక్లబ్బుకీ, సిగరెట్లకీ, వుంపుడుకత్తెకీ డబ్బెలాగొస్తున్నాది. వాణ్ణి పీ. సీ. రోలులో మనం వుత్తినే వెయ్యలేదు. అవునుగాని, ఆ పండావాణ్ణి పిలిపించూ. మనింట్లో రేపు కార్యంవుంది. రెండు పట్టుచాపులూ, రెండు చీరలూ, వో పట్టు షర్టింగు తానూ కావాలి.

సి: డబ్బుపోయి వాడేడుస్తూవుంటే యివన్నీ పైపెచ్చు వాడికి పైనా?

ఎ: ఇదొక లెక్కటోయ్. త్రీ యియర్సు కిందట, అయితంపూడిలో వో లక్షాధికారింట్లో హావుసు బ్రేకింగ్ ఎండ్ తెఫ్టు కేసులో చోరీ ఆస్తి అంతా వో కేడీ దగ్గర దొరికిపోతే యేమైందో తెలుసా. పెద్దపులికి డబుల్ కాసుల పేరూ, చిరుతపులికి వొడ్డాణమూ, వరదుకి నాలుగు పేటల గొలుసూ, గుంటవక్కలన్నిటికీ తలోచిన్న వొస్తువా, కేడీ గాడికి రెండు జతల గాజులూ సర్దిసి, ఆ వెధవని ఓ. వీ. (Out of view) అయిపోమన్నారు. పైపెచ్చు చోరీపోయిన వాడి కొడుకు ముండలముఠాకోరనీ, తాగుబోతనీ, వాడే చోరీ చేసేడనీ, అంచేత వాణ్ణి ముందు యరస్టుచేసి లాకప్‌లో వుంచాలంటే, అది తప్పించడానికి మరైదు వేలు రాలేయి. దాని ముందిదెంతోయ్.

నీలమణివొచ్చి ముందు ఎస్సై, పీ. సీ. 490 ని పిలిచి యిన్‌స్ట్రక్షన్లు యిచ్చేడు. నీలమణి వొచ్చేడు. రాగానే ఎస్సై "ఏయ్ నాలుగొందల తొంభై! యీ ఆసామీని లాకప్పులో వెయ్యి. ముందు బేడీ తగిలించూ." అనీసరికి నీలమణి తెల్లబోయి, "మహాప్రభో! మా డబ్బూపోయిందీ మాకూ జెయిలా?" అంటే, "నీడబ్బు పోయిందా? దొంగమాటలు. నీడబ్బంతా నీ తమ్ముడిచేతికిచ్చి మీవూరు పంపించి, మీదు మిక్కిలి వూళ్లో ఘరానా మనిషిమీద ఫాల్సు రిపోర్టిస్తావా? దీనికి శిక్షేమిటో తెలుసా? ఆర్నెల్లు జెయిలు. చూస్తా వేమిటోయ్. బేడీలు వేసి లాకప్పులో వెయ్యి." అప్పుడు, పీ. సీ. పండాని వెనక వరాండాలోకి తీసుకెళ్లి, "పండాగారూ! మీ మంచికోసం చెబుతున్నాను వినండి. ఆఫీసరుగారింట్లో రేపు కార్యం. వారికి రెండు పట్టుచాపులూ, రెండుచీరలూ జరీవి, వొక పట్టు షర్టింగు తానూ అవసరం. అవితీసుకొచ్చి ప్రెజంటు చెయ్యండి. వాటికి తగిన ప్రతిఫలం ముట్టజెపుతారు. మీకు జెయిలుప్రాప్తి వుండదు. లేకపోతే యిబ్బంది తప్పదు."

పండా: యెంత గహచ్చారంరా బాబూ! తమరు చెప్పింది అంతా మూడు వొందలవుతాది. నూరురూపాయీ పోయిందీ. యిదీ మూడూ. అంతా నాలుగొందలా, బాబూ?

పీ. సీ: మీ రింకా వెనకపాటే పాడుతున్నారు. నేం జెప్పినమాట వినండి. యిదుగో కాయితం. దీనిమీద వేలుముద్ర వెయ్యండి.

పం: అదీ యెందుకూ బాబూ?

పీ. సీ: మీరు యెవరిమీదా యెట్టి నేరమూ మోపలేదని. అదియిస్తే మీ రిచ్చిన కంప్లేంటు మీయెదటే చింపేస్తాం.

పండా అకేరాధేగోబిందో, అంటూ వేలుముద్ర వేసేడు.

నిజంగా ఆ కాగితం నీలమణి ఎస్సైగారి కిచ్చిన పట్టుబట్టల ఖరీదు రెండువొందల యిరవైరూపాయిలు ముట్టినట్టు రశీదు అది తీసుకుని పీ. సీ. "మీరా బట్టలు రాత్రి తొమ్మిదిగంటలకి బాబుగారి బసలో యిచ్చియండి. రేపు వారింటి కార్యానికి రండి. అలా చెయ్యకపోతే రేపు మీరెక్కడున్నా బేడీల ప్రాప్తి తప్పదు." "చిత్తం, చిత్తం" అని పండా వెళ్లేడు.

ఆరాత్రి యేడుగంటలకి ఆదెయ్య సెట్టి యింట్లో సెట్టి, అతని భార్య, కొడుకూ, కూచున్నారు. అప్పుడు సెట్టిభార్య, "మనింటికాడికి పోలీసోళ్లెందుకొచ్చినారు" "ఆ పండావోడి డబ్బు పోయింది గాదూ. అది మన సిగురోడే తీసేడని ఆడు పోలీసోళ్లకి రిపోటిచ్చేడు అది దరియాప్తు సెయ్యటానికొచ్చేరు." "ఓరి జిమ్మడా! ఆ సితల పేలిపోనూ! సిగురోడు తీసేడని సెప్పేడా? గాల్లిపోయేడుగాని ఆడిమీద నిప్పులోసీద్దును. అయితే యేటయిందది? పోలీసోళ్ళేటన్నారు?" "ఆ! యేటంటారూ. సిగురోణ్ణి పిలిచేరు. ఆ తరవాత నన్ను పిలిచేరు. మరేద సేసేరు. ఆ పండావోడు సెప్పిందంతా అబద్ధం బాబూ అంటే అవునన్నారు. యెల్లండన్నారు. యింకేటి సేత్తారు. ఆదెయ్య సెట్టంటే యేటనుకున్నావ్.'

ఆ విధంగా సెట్టి చెబుతూవుండగా ఎస్సై, హెడ్. సీ, మరి యిద్దరు పీ. సీ లు వొచ్చేరు. వొక కానిస్టేబులు వొచ్చి 'సెట్టిగారున్నారా? యినస్పెక్టరుగారొచ్చారు' అన్నాడు. సెట్టి కుటుంబమంతా తెల్లబోయేరు. సెట్టిలేచి వీధిలోకొచ్చి 'దండాలు, దండాలు దైసెయ్యాల' అని లోపలికి తీసుకెళ్ళి ముందు హాలులో కుర్చీలమీద కూచోబెట్టేడు. తనూ కొడుకూ చేతులు కట్టుకుని నిలబడివున్నారు. సెట్టి భార్య, లోపలి గుమ్మంలో నిలుచుంది. అప్పుడు,

ఎ: సింగూ! ఆ నేరమూ, దాని కయ్యే శిక్షా, ఆ రెండింటి గురించీ చెప్పూ.

సిం: యెస్సార్! హావుస్ బ్రేకింగ్ అండ్ తెఫ్టు. అనగా మరియొకరి ఆధీనంలో వున్న యింటియొక్కగాని, కొట్టుయొక్కగాని తాళం బద్దలుగొట్టియైనా సరే, గోడకు కన్నం తవ్వియైనాసరే లోపలికి ప్రవేసించి, అందులోవున్న ఆస్తి చోరీ చేయడం. ఇది సెషన్సు కేసు. అనగా యీకేసు జిల్లా జడ్జీయే విచారణచేసి తీర్పు

★ దర్యాప్తు ★

చెప్పాలి. కిందవాళ్లకి పవరు లేదు. ఇందుకు శిక్షు, మూడు మొదలు, పది సంవత్సరముల వరకూ కఠినశిక్షా, వేయి రూపాయీల వరకూ జుల్మానా.

సె: ఇదంతా యెందుకు బాబూ, సద వడం?

ఎ: ఎందుకా? నీ కొడుకు వరాలుసెట్టి, నీలమణి పాణిగ్రాహీ ఆధీనంలో వున్న కొట్టుతాళం బలవంతంగా తీసి, లోపల ప్రవేసించి, అతని పెట్టె పగలగొట్టి, అందులో వున్న నూరు రూపాయీలు చోరీ చేసేడు గనక.

లోపల్నించి సెట్టి భార్యా పెద్ద గోల చేస్తూ 'వో రయ్యల్లో! యెవుడు సెప్పేడు బాబూ అడి బుర్ర పేలిపోనూ, అణ్ణి అమ్మోరు మింగేనూ' అని అరవడ మారంభించేసరికి

ఎ: ఎవరా గోల?

సె: మా యింటిదాయి బాబూ.

ఎ: వూరుకోమనూ-లేకపోతే లాకప్పులో వేస్తాం.

సె: వొల్లకోయే! బాబుగారి కోప్పం వొస్తాది. బాబూ మావోడేటి యెరగడు. సెప్పుకోరా బాబుగారితోనూ.

వరాలు: నాకేటీ తెలీదు. నా నింట్లో లేను.

ఎ: నువ్వు బలే దర్జాగా ఖర్చుచేస్తున్నావే ఆ డబ్బెక్కడిది?

సె: ఆడు కర్చేటి బాబూ? చేతులో పైసాయైనా వుండదు.

ఎ: అదే నే ననేమాట. మీ వాడు హైక్లాసు సిగరెట్లు, పెట్టె పద్నాలుగణాలది, కాలుస్తాడు. రోజూ రెండుపూటలూ అయ్యరు హోటలుకెళ్ళి టిఫిను తింటాడు. ఇంకా నీకు తెలియకపోవచ్చునూ, తాగుతాడు, వొక అమ్మినికూడా వుంచేడు. వీటన్నిటికీ డబ్బెలా గొస్తున్నాదీ? ఏ దొంగతనమూ చెయ్యకపోతేనూ?"

ఈమాటలు వింటున్నంతసేపూ వరాలు సెట్టి వొణికిపోతున్నాడు. వొంటినిండా చెమట కమ్మింది. మొహమ్మాడిపోయింది. ఆదెయ్యకూడా వెర్రిమూపులతో కొడుకు వేపు చూస్తూ నిలబడ్డాడు. అయినా లేని ధైర్యమూ, భీకరం తెచ్చుకుని, 'బాబూ! అంతా అబద్దం బాబూ గిట్టనోళ్లెవళ్లో సెప్పుంటారు. మావోడలాటోడు కాడు బాబూ నమ్మకండీ?

ఎ: వూరుకోవయ్యా (అని హెచ్. సీ తో) సింగూ! ఇన్వెస్టిగేషను రిపోర్టు చదువూ.

సి: యెస్సార్. ఆగస్టు యిరవైనాలుగో తేదీ సాయంకాలం, అనగా చోరీ జరిగిన మర్నాటి సాయంకాలం వరాలు సెట్టి అనే ఆసామీ, నేతాజీకేఫ్ ప్రొప్రయిటరు గణపతి అయ్యరుకు బాకీవున్న నలభై యెనిమిది రూపాయీల మింజుమలె నలభై రూపాయీలు చెల్లించెను. సిగరెట్టు, కిల్లీ, సోడాషాపు వోనరు వెంకటస్వామికి బాకీ యిరవైయారు రూపాయీలు మింజుమలె యిరవై రూపాయీలు జమకట్టెను. తరవాత చంద్రశేఖరం అనే రౌడీతో జాయింటుగా తమ ఆడాలో వుంచుకున్న నీలి అనే వ్యభిచారస్త్రీ యింటివద్ద సదరు

చంద్రశేఖరం, నీలీ, వరాలుసెట్టీ, వెరసి ముగ్గురు ఆసామీలూ, మరియిద్దరు రౌడీలతో కలిసి తాగి, జూదమూడినట్టు రిపోర్టు అంశేములు.

ఇదంతా లోపల్నించి వింటున్న సెట్టి భార్యా, బుజమ్మీద బట్ట జారిపోడమైనా చూసుకోకుండా, మహాకాళీ స్వరూపం లాగ హాలులోకొచ్చి, సింగుని అనేక తిట్లు తిడుతూ, "యిదంతా పోలీసోళ్ళ మాయ. మన సిగురోడిమీ దన్యాయంగా సెప్పుతున్నారు. నువ్వు మొద్దులాగ సూత్తావొల్లకున్నావు. అళ్ళని బైటికి గెంటూ" అంటూ గోలచేస్తూవుంటే, ఎసై్స "ఏయ్ సింగూ! ముందుగా ఆ మనిషికి బేడీలు వెయ్యి. Obstrnctiug a public servant in the discharge of duty (ప్రభుత్వోద్యోగి తన కర్తవ్యం నిర్వహిస్తోంటే నిరోధించిన నేరం) కింద డైరీలో నోటు చెయ్యి." అనీసరికి ఆదెయ్య సెట్టి ముందుకొచ్చి "బాబూ తమ పాదాలొట్టుకుంటాం. శెమించాలి" అని బతిమాలి తన భార్యతో "వొల్లకోయే వొకటే గోలా. ఆరి కోపమొస్తే అందర్నీ కొట్లో యేస్తారూ." కొడుకుని చూసి "యేట్రా సచ్చేదవా! ఇంత పని సేస్తున్నావురా? అందుకే యీడికి డాకటేరుకాడ యింజీసాలూ" అంటే వరాలు, "మరంత సిన్నగుంటొద్దంటే యినకుండా శాక్కట్టబెట్టేవు. మరేటవుతదీ." అంతటితో సెట్టి భార్యకూడా, "వోరి యెదవపీనుగా! మా పాణాలమీదికి తెచ్చేవురా"అంటూ లోపలికెళ్ళింది.

ఎసై్స లేస్తూ "సింగూ! నువ్వూ, ఆ యిద్దరు పీసీలూ కలిసి వరాలుసెట్టికీ, ఆదెయ్యసెట్టి భార్యకీ బేడీలు వేసి లాకప్పులో వుంచండి. నేను సారిపిల్లి మర్డరు కేసులో యిన్వెస్టిగేషను ఫినిషు చేసుకురావాలి. రేపు మేస్ట్రీటు కోర్టులో వీళ్ళిద్దరిమీదా కంప్లెయింటు దాఖల్చేద్దాం." ఆ మాటలు వినీసరికి సెట్టి ప్రాణా లెగిరిపోయినంతపనైంది."ఇంటిదాయేటి సేసింది బాబూ" సింగు "పబ్లీకుఆఫీసర్లను తిట్టి,డ్యూటీ చెయ్యకుండా ఆటంకపరిచినందుకు. దీనికి శిక్ష ఆర్నెల్లఖైదూ, అయిదువొందలుజుల్మానా" అన్నాడు. ఎసై్స, "ఏమిటాలశ్యం? నేను పోవాలి" అని లేచి రెండడుగులు వేసేసరికి సెట్టివొచ్చి అతని చేతులుపట్టుకుని,"బాబూ! యివి సేతులు కావు. తమలాంటి ప్రెభువులు కోప్పడితే మాలాటోళ్లం బతగ్గలమా? తమరే యేలాగో వోలాగ, దమించి రచ్చించాల. సింగుబాబుగారూ తమరు సెప్పండ"

సింగు : యేం జెప్పడమయ్యా. నేరం బాగా రుజువైంది. కేసుపెట్టగానే మేస్ట్రీటు చార్జీచేసి కమ్మింటు కట్టేస్తాడు. వీళ్లని రిమేండులో పెట్టేసియాలి. తరవాత యే ఆర్నెల్లకో జిల్లా జడ్జీకోర్టుకి యీ ముద్దాయీలని తీసుకెళ్లాలి. అక్కడ శిక్ష తప్పదు. డిల్లీకి వెళ్ళినా తిరుగుండదు. మా డూటీ ప్రకారం వీళ్ళిద్దర్నీ కొట్లో వెయ్యాలి. మీరుచేసే పనేదో చేసేస్తారు. మేం మా డూటీచేస్తే మమ్మల్ని తిడతారు. అంతా బాబుగారి కటాక్షం. (ఎసై్సతో) బాబూ! వీళ్లు ప్రాధేయపడుతున్నారు. తమ రాలోచించాలి.

ఎ : ఏమి టాలోచించడమోయ్ ? యీ కేసుతో నాకు సర్కిల్ పదవికి ప్రమోషను వొస్తుంది. నీకు ఎసై్స తప్పదు. యావజ్జీవితం వొచ్చే లాభం వొదులుకుంటావా? నువ్వే చెప్పూ.

సిం : తమరు శెలవిచ్చిందీ నిజమే. కాని పట్టూ విడుపూ వుండాలి. ఒకానొకప్పుడు మనకొచ్చీ లాభంకూడా గడ్డిపరకలాగ విడిచి పెట్టి వుపకారం చెయ్యాలి. సెట్టిగారు అమాయకులూ, యిప్పటికి గౌరవంగా కాలక్షేపం చేస్తున్నారు. ఆయన్ని వీధిని పెట్టవొద్దని నామనవి.

ఎ : (నవ్వుతూ) సెట్టి అమాయకుడా? మా గొప్ప అమాయకుడు! బ్లాకు మార్కెట్టులో యెంతమంది నెత్తురు పీల్చో లక్షలార్జించి, యింత మేడ కట్టించి, మిల్లు నడిపిస్తున్నాడు.

సె : బాబూ! తమ రలాగ సెలవిస్తే యెలాగ? లాబాలొస్తే కోమిటోణ్ణిగదా, వొగ్గిడమెలాగ?

ఎ : అదే మేమనీ మాటాను. యెవడు మాత్రం తనకొచ్చీ లాభం వొదులుకుంటాడోయ్,

సిం : ఇంతకీ తమ శెలవుకోసం సెట్టిగారు నిరీక్షిస్తున్నారు.

ఎ : నా శెలవేమిటీ. మూడుచేతుల్లు కలిస్తేనేగాని యీ చిక్కు విడదియ్యడానికి వీల్లేదు. పైగా సెట్టిభార్యా నేరంకూడా డైరీలో నోటు చేసీసేం.

సె : (భయంతో) మూడుసేతు లేటి బాబూ?

ఎ : ఏమిటా?. నాపైవాడిచెయ్యీ, నా చెయ్యీ, మా స్టాఫ్ చెయ్యీ, యీ మూడూ కలిస్తేనేగాని యేమీ సర్దుబాటుకాదు.

సి : బాబుగారు న్యాయంగా శెలవిచ్చేరు.

సె : యేటిబాబూ! సింగుగారూ?

సింగు, "నేనుచెప్తానురండీ సెట్టిగారూ" అని లోపలికి తీసుకుపోయి కొంతసేపు మాట్లాడేడు. పైకి వొచ్చి ఎసై్సగార్ని కూడా లోపలికి తీసుకెళ్లేడు. వొక పావుగంటైంతరవాత సెట్టి "వో యింటిదానా! యినప్పెట్టి తాళాలేయే" అని కేకేస్తే ఆమెకూడా లోపలికి వెళ్లింది. మరి కొంతసేటికి సెట్టీ, సింగూ, ఎసై్స, హాలులో కొచ్చేరు. లోపల, "వోరయ్యల్లో! గోరం, గోరం" అని యేడుపు వినిపిస్తే సెట్టి అదమాయించేడు. సెట్టికి కళా కాంతిపోయింది. అసలే నల్లటివాడు. ఇప్పుడు మరీ బొగ్గులాగ మాడిపోయేడు. పోలీసాఫీసర్లిద్దరూ ఖుషీగా వున్నారు. వెళ్ళబోతూ ఎసై్స, సింగుతో, "మర్చిపోయేనూ. సెట్టిభార్యామాటో?" "నేను మరిచిపోలేదు బాబూ. రేపు తమ యింటిలో కార్యానికి సెట్టిగార్నీ, భార్యాగార్నీ, వరాలుసెట్టిగార్నీ దయచేయమని తమ తరఫున నేనే యిన్వైటు చేసేను. సెట్టిగారూ తప్పకుండా దైచెయ్యాలండీ," అంటేసెట్టి, "చిత్తం, చిత్తం. మర్చిపోతానా?" ఎసై్స, "సరే. సింగూ,! రేపు జ్ఞాపకంచెయ్యి, సెట్టిభార్యామీది నేరం నాడైరీలోంచి రద్దు చేసీదాం." అంటే యిద్దరూ నవ్వుకున్నారు. ఎసై్స "సెట్టిగారూ! గుడ్‌నైట్. మిస్టరు వరాలూ, రేపు కలుద్దాం." అని తన ట్రూపుతో కూడా వెళ్లేరు. వాళ్లు వెళ్ళగానే సెట్టి, "వోరి సచ్చేదవా! నీమూలాన్ని యినప్పెట్టిలోంచి మూ చేతుల్లెగిరిపోయినారా. గోరం, గోరం" అంటూ బావురుమని యేడ్చేడు. అందులో సెట్టి భార్యాకూడా కలిసింది.

స్టేషనుకి వెళ్ళిం తరవాత యీ కేసు యిన్వెస్టిగేషనులో వొచ్చిన క్రెడిట్‌లో ఎసై్సకి రెండువొంతులూ, మిగిలిన వొంతు స్టాఫ్‌దీ అని నిర్ణయించుకున్నారు. అప్పుడు సింగు, "బాబూ! యీ కేసు క్లోజు చేసేదామా?" "ఉండవోయ్. ఆ పండాతమ్ముడు గదాధరుణ్ణి యెగ్జామిను చెయ్యడానికి బరంపురం వెళ్లొద్దూ. ఈ సందట్లో నే రెండేళ్ళ చూడలేదు. మా చెల్లెల్నీ, బావమరిదినీ చూస్తాను. నువ్వూ, నూట ముప్ఫయారూ రండి." "సరే బాబూ. మా అత్తవారు కళ్ళికోటలో వున్నారుట. అలాగ వెళ్ళి చూడొచ్చు."'ఆ పీ.సీ. తల్లీ, అన్నా,బరంపురంలో వున్నారుట. శెలవు పెట్టే బదులు అందరం డూటీమీదే వెళదాం." "అయితే బాబూ. కేసెలాగ డిస్పోజుచేస్తాం?" "ఏముందీ! స్టోలెన్ ప్రాపర్టీ కాయిన్సూ, కరన్సీ నోట్లూను. నాట్ ట్రేసబుల్ అని రిమార్కు రాసి క్లోజుచేస్తాం."

మర్నాడు ఎసై్సగారింట్లో కార్యానికి ఆదెయ్య సెట్టీ, కుటుంబం వొచ్చేరు. పెద్ద పళ్లెంనిండా కొబ్బరికాయలూ, పళ్ళూ, పసుపూ, కుంకుమా, జరీచీరా, చాపూ, తెచ్చేరు. తలో నూటపదహార్లూ కట్నం చదివించేరు (ఏడుస్తూనే). పండానికూడా పిలిచేరు. అతడూ వొచ్చేడు. వాళ్లందరికీ, స్టాఫ్‌కీ, పెద్ద విందు జరిగింది. ★




భక్షాటన



ఊరిశివారు





పూరియిళ్లు

ంక్కపాటి
మూర్తిగారి
టిరంగు
త్రాలు



వసంతం

బొమ్మరిల్లు

కొంటె కిష్టయ్య

★

కాసుఖేల సోమేశ్వరరావు

అలివేలనే ఒక అతి చక్కనమ్మాయి
అల్లారుముద్దుగా ఎదుగుతున్నాది.
ఎగతాళి మాటలకు ఉడుక్కుంటుంది,
ఎవరేమి అన్నాను ఎగిరి పడుతుంది.

అమ్మాయికో చిలిపి బావ ఉన్నాడు,
కొంటెకిష్టాయని పేరు మోసిన వాడు,
అల్లరిలో వాడు ఆరితేరిన ఘటము
ఎవరికీ లోకంలో లేదంత హఠము.

"అమ్మాయి కెవరికో తొఱ్ఱిపన్నున్నాది,
మెల్లకన్నున్నాది అమ్మాయి కెవరికో,
అమ్మాయి కెవరికో చట్టిముక్కున్నాది,"
అని కొంటె కిష్టాయి వెక్కిరించాడు.

"తొఱ్ఱి పన్నూనీకె, మెల్లకన్నూనీకె,
చట్టిముక్కూనీకె చప్పిదవడలునీకె"
అమ్మాయి కిష్టాయి నెగతాళి చేసింది.
మరి నాలుగూతిట్టి కసి తీర్చుకుంది.

కొంటె కిష్టడు వా డూరు కుంటాడా ?
"కొండముచ్చన్నాడు, గుడ్డికొంగన్నాడు"
"కొండముచ్చూ నీవె, గుడ్డికొంగా నీవె
కోతిమొహమూ నీవె కొంటె కిష్టాయంది".

"శనిలాగ దొరికావు నువ్వునా"కన్నాడు.
"నువ్వె శనిలాగ దొరికా"వన్న దలివేలు
"చూడబోతే నాకు మొగుడి లాగున్నావె"
"నేను కానే కాదు, నువ్వె నా మొగుడివి ?

పకపకా నవ్వాడు కొంటె కిష్టయ్య,
తప్పు తెలినమ్మాయి రోషమెక్కొచ్చి,
బావనూ కొట్టొచ్చి బావురన్నాది;
కిష్టాయి వీధిలో దౌడుదీశాడు.

రాజుగారి గాడిద చెవులు

సాపుగానం సరస్వతీదేవి

పూర్వం ఒకరాజుగారుండేవారు. ఆయనకి కొన్ని వేల ఎకరాలభూమి, పెద్దకోట, బొక్కసం నిండా బోలెడు ధనం, కావలసినంత పలుకుబడి, కీర్తి ప్రతిష్ఠలు అన్నీ వున్నాయి. చక్కని చుక్క అయిన భార్య, రత్నాల్లాంటిపిల్లలు ఉన్నారు. ఇంత ఉన్నా, ఆయనకి పాపం ఒకటే విచారం. అది ఏమిటంటే ఆయన చెవులు అచ్చుగాడిద చెవులే. వాటివల్ల ఆయనకి అహోరాత్రాలు మనశ్శాంతి లేకుండా పోయింది. పగలూ, రాత్రీ ఎప్పుడూ పెద్ద తలపాగా బిగించి చుట్టుకుని చెవులు ఎవరికీ కనిపించకుండా దాచుకునేవాడు. దాసదాసీజనాలకి, మంత్రులకి, ప్రజలకి, ఆఖరికి రాణీగారికి కూడా ఆయనకి గాడిద చెవులున్నాయని తెలియదు.

కాని ఒక్కడిదగ్గిరమాత్రం ఈ రహస్యం బయటపడక తప్పలేదు. రాజుగారికి నెలకొకసారి క్షురకర్మ చేయడానికి వచ్చే మంగలికి ఈ రహస్యం తెలియకుండా ఎలా దాగుతుంది? అందుచేత రాజుగారు మంగలికి పుష్కలంగా డబ్బిచ్చి, ఈ సంగతి ఎవ్వరికీ చెప్పవద్దన్నాడు. చెబితే తలతీసేస్తానన్నాడు.

అయినా మంగలి ఎవరితో నన్నా చెప్పేస్తాడేమోనని రాజుగారికి అహర్నిశలూ బెంగపట్టుకుంది. ఎవరూ లేనప్పుడు ఆయన అద్దంలో తన ముఖం చూసుకునేవాడు. గాడిద చెవులు తమంతట తామే ఊగిసలాడి ఆయన్ని వెక్కిరించేవి. దీంతో ఆయన ముఖంలో ఎప్పుడూ విచారముద్ర కనిపించుతూ వుండేది.

కాని రాజుగారికంటే మంగలి పడే బాధ వర్ణనాతీతం. ప్రపంచంలో ఇంకెవ్వడికీ తెలియని రహస్యం తనకొక్కడికే తెలుసు. ఎలా ఈ రహస్యం దాచడం? రోజు రోజుకీ మంగలికి రహస్యం దాచడం కష్టమైపోతోంది. ఎవడన్నా అతనితో మాట్లాడుతున్నప్పుడు ఆ మాటలు వినిపించుకునేవాడు కాదు. రహస్యం చెప్పేద్దామా, వద్దా అని మాత్రమే ఆలోచించేవాడు కాని ప్రాణభయంవల్ల చెప్పలేక పోయేవాడు.

మంగలి మనోవ్యాధితో చిక్కిపోసాగాడు. పెళ్లాం మొత్తుకునేది, "ఏమిటయ్యా నీ బాధ" అని.

"ఏమీ లేదులే, నీ పని నువ్వు చూసుకో" అనేవాడు మంగలి. ఇది కాదనుకుని భార్య ఒక వైద్యుణ్ణి పిలిపించి భర్తని చూపించింది. అతగాడు నాడీ అవీ పరీక్షించి ఒంట్లో జబ్బేమీ లేదని, మనస్సులో ఏదో బాధ ఉందని తేల్చాడు. ఆవైద్యుడు క్షణం తీరికలేని మనిషి గనుక ఈ మాట చెప్పి వేరే పనిమీద వెంటనే వెళ్ళిపోయాడు.

ఈ బాధ పోయేందుకు పోనీ భార్యతో చెప్పేద్దామా అనుకున్నాడు. కాని ఆడవారి నోట్లో నువ్వుగింజ నానదే. ఈ ముక్క కాస్తా ఆమె ఇంకోరితో చెబితే, ఆనోటాఆనోటాపడి అది వ్యాపిస్తుందని భయపడ్డాడు. చివరికి వైద్యుడితోనే చెప్పేద్దాం అనుకున్నాడు. అనుకుని ఆయనదగ్గిరికి వెళ్లాడు.

"ఏం పని?" అని అడిగాడు వైద్యుడు.

"నా మనస్సులోని బాధ మీకు చెప్పేస్తాను," అన్నాడు మంగలి.

"నీ బాధలు వింటూ కూర్చోడానికి నాకు తీరికలేదు. పోయి భూదేవితో మొరబెట్టుకో," అన్నాడు వైద్యుడు.

చేసేదిలేక మంగలి యింటికి వచ్చేశాడు. వైద్యుడు యాథాలాభంగా అన్నమాట అతనికి నచ్చింది. భూదేవితో చెపుదామనుకున్నాడు. ఆ రోజురాత్రి పదిగంటలప్పుడు బయలుదేరి ఊరవతల అడవిలోకి వెళ్లాడు. చీకటిగా ఉంది. ఎక్కడా జనసంచారం లేదు. పక్షులుకూడా నిద్రపోతున్నాయి. అడవి నిశ్శబ్దంగా ఉంది. మంగలి ఒంటరిగా ఒకచోట కూర్చుని, జాగ్రత్తగా, నెమ్మదిగా రహస్యం కాస్తా బయటపెట్టాడు: "రాజుగారివి గాడిద చెవులు" అని. ఇక చాలనుకున్నాడు. కాని ఇన్ని సంవత్స



రాజుగారివి గాడిదచెవులు

కాలనుంచీ రహస్యాన్ని మోసిన బరువు తీరిపోయిందా? పోలేదు. మళ్లీ ఇంకోసారి "రాజుగారివి గాడిదచెవు"లన్నాడు. ఇక ఆపుకోలేక అదేపనిగా "రాజుగారివి గాడిదచెవులు" అని జపంచేసినట్టు అనసాగాడు. ఒకగంటసేపు అనగా అనగా అప్పటికతని బాధ తీరింది.

ఆ రోజునుంచీ అతడు పూర్వపు ఆరోగ్యం కోలుకొని దుండుముక్కలాగ తయారయ్యాడు.

కాని అతడు ఆ రాత్రి అన్న మాటలు వృథాగా పోలేదు. అతని దగ్గర్లో కొన్ని వెదురు చెట్లు ఉన్నాయి. అవి ఈ మాటలు విన్నాయి. వాటికూడా ఈ రహస్యం బరువైపోయింది. ఎప్పుడు ఎవరికి చెప్పేద్దామా అని తహతహలాడసాగాయి.

ఇట్లా ఉండగా రాజుగారి పెద్ద కొడుక్కి వివాహ మహోత్సవం ఏర్పాటు చేయబడింది. అనేకమంది రాజులు వివాహానికి వచ్చారు. పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. హరికథా కాలక్షేపాలు, పాటకచ్చేరీలు ఏర్పాటయ్యాయి. అంతా ఆనందంలో మునిగివున్నారు.

ఆ పట్నానికి దూరంగా మరొక ఊళ్ళో ఒక గొప్ప పిల్లనగ్రోవి వాద్యగాడున్నాడు. అతడు తన విద్య రాజుగారికి చూపించి మెప్పు, డబ్బు సంపాదించాలనుకున్నాడు. బయలుదేరి వస్తుండగా ఈ ఊరి దగ్గిర వేణువనం తగిలింది. ఏపుగా నవనవలాడుతూ పెరిగిన వెదురు చెట్లు చూశాడు. పాత పిల్లనగ్రోవితో కంటె కొత్తదాంతో అయితే నాదం చాలా బాగుంటుందనుకున్నాడు. ఒక కొమ్మ విరిచి చక్కగా చెక్కి మంచి పిల్లనగ్రోవి తయారుచేశాడు. ఇది మొదటిసారిగా రాజసభలోనే వాయిద్దాం అనుకుని సంచీలో వేసుకుని, ఊళ్లోకి వెళ్లాడు.

మంత్రిగారి అనుమతి సంపాదించి వాద్యగాడు వేదికమీద కూర్చుని పిల్లనగ్రోవి మొదలు పెట్టాడు. ఊదీ ఊదగానే సంగీతానికి బదులు "రాజుగారివి గాడిద చెవులు" అని మాటలు స్పష్టంగా వినబడ్డాయి. ఇదేమిటా అనుకుని మళ్లీ ఊదాడు. ఎన్నిసార్లు ఊదినా ఇవే మాటలు బయటికొస్తున్నాయి. సభికులందరూ పొట్టలు చేత్తో పట్టు

కుని నవ్వసాగారు. అతిథులుగా వచ్చిన రాజులు, సామంతులు, మంత్రులు ప్రజలు, ఆఖరికి రాణీగారు, పెళ్లికొడుకు, పెళ్లికూతురు అంతా విరగబడి నవ్వేస్తున్నారు. రాజుగారిముఖం కందగడ్డలా జేవురించింది. సిగ్గు, అవమానం, కోపం ముంచుకొచ్చాయి వాద్యగాణ్ణి పిలిచి "ఏమిటీ ఈ దుండగం" అని గద్దించారు.

అతడు వణికిపోతూ "మహా ప్రభూ! నాతప్పేమీ లేదు. ఈ పిల్లనగ్రోవి తనంతట తనే ఈ మాటలు అనేస్తోంది. ఇది మీ పట్నం దగ్గర్లో ఉన్న వేణువనంలోని చెట్టుకొమ్మతాలూకుది. ఏం మాయవల్లనో ఇది ఇలా పలుకుతోంది," అని విన్నవించాడు.

నిజమో కాదో చూద్దామని రాజుగారి ఆ వేణువు తీసుకుని ఊదాడు. మళ్ళీ అవే మాటలు వచ్చాయి.

ఇంతలో ఇదంతా గమనిస్తూ ఉన్న మంగలి గజగజలాడుతూ రాజుగారికి చేతులు జోడించి ఇలా అన్నాడు: "ప్రభూ! ఈ తప్పంతా నాది. నేను మీ చెవుల రహస్యం దాచలేకపోయాను. అర్థరాత్రి వేళ ఊరిబయట అడవిలో ఎవరూ లేకుండా చూసి ఈ రహస్యం బైటపెట్టాను. అక్కడి వెదురుచెట్లు అది వింటాయనీ, ఇలా చెప్పేస్తాయని నాకేం తెలుసు? ప్రభువులు నన్ను కరుణించాలి."

సభికులంతా నిశ్శబ్దంగా విన్నారు. ఎవ్వరికీ నవ్వు రాలేదు. మంగలికి ఏ కఠినశిక్ష విధిస్తాడో రాజుగారు అని ప్రాణాలు ఉగ్గబట్టుకుని ఉన్నారు. అప్పుడు రాజుగారు గంభీర కంఠంతో ఇలా అన్నారు: "నువ్వు రహస్యం దాచనందుకు నిన్ను ఉరితీయవలసిందే కాని యువరాజుగారి వివాహ శుభసమయాన్ని ఇలా పాడుచెయ్యటం నాకిష్టం లేదు. అందుచేత నిన్ను క్షమించి వదిలేస్తున్నాను."

మంగలి సాష్టాంగ నమస్కారం చేసి బ్రతుకుజీవుడా అని తప్పుకున్నాడు. రాజుగారి క్షమాగుణాన్ని సభాసదులు ఏకగ్రీవంగా కీర్తించారు. ఈ గొడవలో తము కీర్తిస్తున్న రాజుగారికి గాడిదచెవులున్నాయని ఎవడికీ మనస్సులో హేళనభావం లేనేలేదు.

ఆ రాజుగారి చెవులు గాడిద చెవులైతేనేంగాక, మనస్సుమాత్రం వెన్నపూసలాంటిది కాదా?

(వేల్సు దేశపు కథ ఆధారం) ★

ఎందుకు...ఏమిటి!

2. నవ్వుల పువ్వులు



నవ్వుల పువ్వుల

ఫొటో : ఎమ్ ఫణిభూషణరావు—విజయవాడ

నవ్వు సంతోషానికి సూచన.

పాపాయి నవ్వినప్పుడు పెదవులనే ఎర్రని చిగురుటాకుల మధ్య నవ్వులనే పువ్వులు వికసించినట్లు ఉంటుంది బాగా నవ్వినప్పుడు కళ్లు చిన్నవౌతాయి, పెదవులు విచ్చుకుని పళ్లు బైటపడతాయి; కొందరిబుగ్గలు సొట్టలుపడుతాయి సెలఏటిజాలు రాళ్లకి కొట్టుకున్నప్పుడు వినవచ్చే గలగల శబ్దంలాగ "హాహాహా!" అనే శబ్దాలు వెలువడతాయి ఒళ్ళంతా కదిలిపోతుంది కొందరు నవ్వు ఆపుకోలేక కళ్లవెంట నీళ్లు రాల్చడమే కాదు, కిందపడి దొర్లుతారు. ఇదంతా మనస్సులో కలిగే సంతోషానికి సూచన.

కల్లా కపటంలేని నిర్మలహృదయం కలవాడు నవ్వినప్పుడు పెదవులేకాదు, కళ్ళూ, ముఖమూ, ఒళ్ళూ అన్నీ నవ్వుతాయి. లోపల ఏదో కుచ్చితం పెట్టుకుని నవ్వేవాడు పెదవులతో మాత్రమే నవ్వుతాడు, కళ్లల్లోకి కాంతిరాదు, కాపట్యమే కనిపిస్తుంది.

మరీ పసిపాపాయి లైనవాళ్లు కారణంలేకుండానే తమలో తాము నవ్వుకుంటారు. ఉయ్యాలలో పసి

పాటా లేకుండా పడుకునే పాపలకి, కడుపునిండా పాలు పడినప్పుడు ఏం తోస్తుంది? లోపల ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యేశక్తి ఎలా ఖర్చవుతుంది? అందుకే అలా ఊరికే నవ్వుతారు.

(ఆ మాటకొస్తే ఏడుస్తారు కూడాను. ఈ ఏడుపు సంగతి తరవాత చూద్దాం.)

సంతోషం కలిగించే విషయాలు కాకపోయినా ఒక్కొక్కసారి నవ్వుతాం. చూడండి, బజార్లో అరటి తొక్కమీద కాలు వేసి జర్రున జారినవాణ్ణిచూస్తే వెంటనే నవ్వొస్తుంది. అవతలవాడికి చచ్చేటట్టు దెబ్బ తగిలితే మనకి నవ్వు రావడమేమిటి? దీనికి కారణం ఇది: అవతల వాడు కళ్లుమూసుకు నడుస్తూ, చూసుకోకుండా, తెలివితక్కువగా అరటి తొక్కమీద కాలువేశాడు. అంత చూసుకోకుండా, ఎందుకు నడవాలి? అంటే ఏమిటన్నమాట? ఎదటివాడు తెలివితక్కువగా ప్రవర్తించినప్పుడు మనకి నవ్వొస్తుంది. ఇవ్వాళ వాడయ్యాడు. రేపుమనమే అలా పడవచ్చు. కాని, ఇవాళ మనం పడలేదుగా. అందుకని నవ్వుతాం. మనము పడినప్పుడు ఇతరులు నవ్వుతారు. ఇది లోకసహజం. అయితే మనిషి పెద్దవాడై, అనుభవశాలి అవుతున్న కొద్దీ ఇలా నవ్వడం తగ్గిపోతుంది. అంతేకాదు, ఒకవేళ నవ్వినా, వెంటనే "అయ్యో" అని జాలిపడతాం కూడా.

ఇతరుల తెలివితక్కువ చూస్తే మనకి నవ్వొస్తుంది అని చెప్పాను. హాస్య కథలు రాసేవాడు మనుషులలోని తెలివితక్కువతనాన్ని బయట పెట్టి మన్ని నవ్విస్తాడు. సర్కస్‌లో బఫూన్లు ఉంటారు. వీళ్లు తమకేమీ చేతకానట్లు, వట్టి తెలివితక్కువ దద్దమ్మలైనట్లు నటించి నవ్వు పుట్టిస్తారు. సినీమాల్లో రేలంగి, శివరావు మొదలైనవాళ్లని మీరు చూసివుంటారు. వీళ్లు తెలివితక్కువ వాళ్లపాత్రలు ధరించి, వాళ్లభావాలెల్లా వుంటాయో చేష్టలద్వారా చూపించి నవ్వు పుట్టిస్తారు. ఇది నటనేగాని, నిజంగా రేలంగి, శివరావు తెలివితక్కువ వాళ్లు అనా దీని అర్థం? కాదు.

అయితే మనలోని తెలివితక్కువతనాన్ని కూడా ఇతరులు చూపించి నవ్వేను మనం ఏడవకుండా నిర్మలంగా నవ్వుకోగలిగితే మనం మహాజ్ఞానుల మన్నమాటే.

ఏమైనా నవ్వు చాలా ఆరోగ్యమైన సంగతి. జబ్బుగా ఉన్నవాడి ముఖాన నవ్వు కనిపించదు. అయితే ఒకటి గుర్తుంచుకోండి. మోతాదు మించి అస్తమానం నవ్వుతుంటే మనల్నే పిచ్చివాళ్లకిందకట్టి నవ్వుకుంటారు జనం! జాగ్రత్త!

* * *

"రాజూ-పేదా" మొదలైన నవలలు రాసిన మార్క్-ట్వేన్ ఒకసారి చాలా ఆర్థికకష్టాల్లో పడ్డాడు. ఒకరోజున చుట్టలుపెట్టుకునే చిన్న కేస్ ఒకటి అరచేతులో గట్టిగాపట్టుకుని ఎక్కడికో హడావుడిగా పోతున్నాడు. ఇంతలో అతనికి బాగా పరిచితురాలైన ఒకావిడ ఎదురుపడి ఇలా అంది:

"అరె. మళ్లీ చుట్టలు కాలుస్తున్నావా? మానేస్తానని ప్రమాణం చెయ్యలేదూ?"

మార్క్-ట్వేన్ నవ్వుతూ సమాధానం ఇచ్చాడు: "మదాం! ఈ కేస్‌లో ఉన్నవి చుట్టలు కాదు. నాసామానంతా సర్దుకుని ఇవ్వాళే ఇల్లు మారుతున్నాను." ★

(సచిత్ర సీరియల్)

కర్పూరద్వీపయాత్ర

నోరి నరసింహశాస్త్రి

1

మీ రెన్నడన్నా కర్పూరద్వీపము చూశారా? పోనీ దాని సంగతన్నా విన్నారా?

మీరు నీతిచంద్రికలో చదివిన కర్పూరద్వీపం వంటి నేతి బీరకాయ ద్వీపం కాదిది నిజమైన కర్పూరద్వీపము!

ఆ ద్వీపంలో మన్ను లేదు. అంతా కర్పూరమే అందులో వస్తువులన్నీ కర్పూరపువే చెట్లు కర్పూరము. అక్కడి మనుష్యులే కర్పూరము ఐతే గాలికి హారించిపోయే కర్పూరం కాదుసుమా! ఎక్కడ చూచినా అందులో కర్పూరపు సువాసనే.

అక్కడుండేవాళ్లంతా పన్నెండేళ్లు దాటని బాలాకుమారులూ కుమార్తెలే వాళ్ల ఒళ్లు కర్పూరంవలె ఘుమఘుమ లాడుతుంది చెమటపోయదు. ఆకలి అంటే ఏమో ఎరగరు ఐతే తినేందుకు వస్తువులేమన్నా కొదవ అనుకొన్నారా? తినదలుచుకుంటే చాలు, తెల్లని పాలమీగడలు పంచదారలు వెన్నపూసలు, కావలసినవన్నీ ప్రత్యక్షమౌతవి. అన్నీ చూశారా, కర్పూరపు రంగే!

అక్కడి వెలుతురంతా వెన్నెలే. అది కర్పూరం మల్లెనే తెల్లగా చల్లగా ఉంటుంది. ఐతే విశేష మొకటి మన మెరిగిన వెన్నెలకువలె దానికి నీడ ఉండదు. అక్కడి వస్తువులూ మనుష్యులూ మలినం లేని అద్దాలవలె స్వచ్ఛంగా ఉండి వెలుగు ఈవైపు నుంచి ఆవైపుకు ప్రసరించడానికి అడ్డు కలగదు. అందుచేత అక్కడిపిల్లలు వెన్నెలకుప్పలు ఆడుకునే అవకాశమే లేదు. వాళ్లకా ఆట తెలియనే తెలియదు.

అది ద్వీపము అన్నాముకాదూ? ద్వీపమంటే చుట్టూ సముద్రం ఉండవద్దూ? దానికీ ఉన్నది చుట్టూతా పాలమీద మీగడ తెట్టె కట్టదూ,— సరిగ్గా అట్లాగే ఉంటుంది పాలసముద్రంలో కర్పూర ద్వీపము!

ఆ సముద్రపు కెరటాలు లేచి పడుతూ ఎప్పుడూ ఆద్వీపాన్ని ముద్దుపెట్టుకొంటూ ఉంటవి,— సరిగ్గా అమ్మ పాపాయిని ముద్దుపెట్టుకొనేట్లే! మధ్య మధ్య పెద్దకెరట మొకటి కొండవలెలేచి ఆ ద్వీపాన్ని కౌగిలించుకొంటుంది,—సరిగ్గా అమ్మ చిన్నవాణ్ణి కౌగిలించుకున్నట్లే!

ఆ ద్వీపాన్ని సరిగ్గా ఏమని వర్ణించేది!

నిద్రపోయే పసిపాపల పెదవులమీద నాట్యమాడే చిరునవ్వువలె ఉంటుందది

ఇద్దరు పిల్లలు వేరే కూచుని హాయిగా చెప్పుకునే పిట్టకథవలె ఉంటుంది.

కష్టంలో ఉన్నవారికి సహాయము చేస్తారే పుణ్యాత్ములు,—వాళ్ళ పుణ్యంవలెనే ఉంటుంది

మహాత్కార్యాలు చేస్తారే, అట్టి మహాను భావుల కీర్తివలె ఉంటుంది.

ఆనందం కలిగించే సుఖమైన సంగీతంవలె ఉంటుంది.

మంచికవి చెప్పిన సత్కావ్యంవలె ఉంటుంది.

మంచి మాటవలె ఉంటుంది.

ప్రేమ చూపువలె ఉంటుంది.

2

ఇవ్వాళ కర్పూరద్వీప మంతా అడావుడిగా ఉంది. ఆ ద్వీపానికి దక్షిణంగా దూరాన ఏదో నలుసు వలె ముందు కనిపించింది. పిల్లలంతా ఏమిటి ఏమిటి అని విడ్డూరంగా చూస్తున్నారు.


ముందు చిన్న నలుసుగా కనపడ్డది అంతకంతకు పెద్దదవుతున్నది. దూరాన ఉన్నది దగ్గరకు వస్తున్నది. చివరి కది ఆ ద్వీపము ఒడ్డు తాకిన పెద్ద నావఐ పాల సముద్రంలో తేలియాడుతున్నది. ఏమిటది? ఏమిటది?

అందులో ఒకశంఖము ఎత్తారు. దాంట్లోనుంచి భోం భోం అని వింతనాద మొకటి వినిపించింది.

పిల్లలు కొందరు ఉలిక్కిపడ్డారు. ఏమిటా ఇది అని కొంతమంది పిల్లలు సినీమా షెళం వచ్చిన బండిని చూసినట్లు దగ్గరకు పరుగెత్తారు.

ఎన్నడూ లేనిది కర్పూరద్వీపము మీద సన్నటి మబ్బు పొరవంటి పొగ ఏదో ఆవరించినట్లయింది. స్వచ్ఛమైన కర్పూరవాసన వేసే తేలిక గాలి వీల్చే అక్కడ పిల్లలకు గాలి పీల్చడం బరువైంది. కొందరికి ఉడ్డుకుడుచుకున్నట్లయింది.

ఆకాశంమీద కప్పిన పొగ సినిమా తెరవల్లె మాయగా కనిపించింది. దానిమీద పడి స్వచ్ఛమైన వెన్నెల చిట్లిపోయి ఏడు రంగులు కనిపించినై. ఆ



★ కర్పూర ద్వీప యాత్ర ★

రంగులు వచ్చిన నావచుట్టూ ముఖ్యంగా, మిలమిల లాడుతూ మెరిసినై.

అంతలో పడవమీద శంఖంలోనుంచి వచ్చే నాదంకూడా ఏడు స్థాయులుగా మారి, సా రీ గా మా పా దా నీ—అనే స్వరాలుగా వినవచ్చి ఒకటితో ఒకటి కలుస్తూ విడిపోతూ మళ్లీ రకరకాలుగా కలుస్తూ పిల్లలవలె ఆడుకుంటూ కలకలమని వినవస్తున్నది.

ఆ కొత్త రంగులు చూసీ, ఆ కొత్త స్వరాలు వినీ కొంతమంది పిల్లలు విభ్రాంతులయినారు. కొందరు కళ్లు మూసుకున్నారు. కొందరు చెవులు మూసుకున్నారు. ఐతే చాలామంది మాత్రము ఏదో తెలుసుకుందామనే ఉబలాటం కొద్దీ నావ దగ్గరకు పరుగెత్తారు.

ఆ నావమీదినుంచి ఒడ్డు కెన్నో చెక్కలు బారులుగా వేసి ఉన్నవి. అవి నున్నగా వెడల్పుగా మెరుస్తున్న రంగురంగుల చెక్కలు. కర్పూరద్వీపంలో పిల్లలు కొంతమంది వాటిమీదుగా నావ ఎక్కుతున్నారు.

అంతలో ఆ ద్వీపమంతా దద్దరిల్లిపోయే టట్లు పెద్ద చప్పుడయింది.

3

అది ముసలి తాత మాట్లాడబోయే ముందు గొంతు సవరించుకోడానికి చేసే సకిలింత! సరే ఆ ద్వీపంలో మరి ముసలితాత ఎవరంటారా?

ఆ ద్వీపంలో అంతా పిల్లలే కాని ఒక్కడే ఒక్క తాత ఉన్నాడు. ఆయనతోపాటు ఒక్కగాని ఒక్క అవ్వకూడా ఉన్నది. అక్కడి పిల్లల కందరికీ అమ్మా నాన్నా వాళ్లే, తాతా అవ్వకూడా వాళ్ళే. ఆయన ఎప్పుడు పుట్టాడో కూడా ఎవ్వరికీ తెలియదు. అవ్వా అటువంటిదే.

తాత ఎప్పుడూ పడుకొని వుంటాడు. అవ్వ ఆయనను ఒక్క క్షణంకూడా వదిలిపెట్టదు. ఎప్పుడూ పక్కనే కూచుంటుంది. ఆ పాన్పు ఏమిపాన్పో ఎరుగుదురా? కర్పూరం వలె తెల్లగా ఉండే వెయ్యి తలకాయలున్న పాపపాన్పు!

వాళ్ళను చూస్తే ఆ ద్వీపంలో అందరికీ చెప్పలేనంత ఆపేక్ష. ఎంతో భయము, ఎంతో భక్తి. వాళ్ళదగ్గర ఉంటేనే కడుపు నిండినట్లుగా అక్కడి పిల్లలకు అమితానందం. చాలామంది వాళ్ల చుట్టూ అదే పనిగా ప్రదక్షిణాలు చేస్తూ ఉంటారు. అదే వాళ్ళకొక ఆటగా ఉంటుంది. మరి కొంతమంది వాళ్లను చూస్తూ రకరకాలుగా వర్ణిస్తూ ఉంటారు. అదేవాళ్లకు తియ్యని పాటగా ఉంటుంది.

ఆయన సామాన్యంగా మాట్లాడనే మాట్లాడడు. ఎప్పుడైనా మాట్లాడితే ఆయన గొంతు మేఘము ఉరిమినట్లు గంభీరంగా ఉంటుంది. ఆయన మాటంటే అక్కడి ప్రతి వాళ్ళూ పువ్వువలె నెత్తిన పెట్టుకుంటారు.

ఉరుమువంటి ఆ సకిలింత వినగానే ఎక్కడ పిల్లలక్కడ ఆగిపోయినారు.

నాయనలారా, నాయనలారా, - అని వినబడ్డది.

పిల్లవాళ్ళంతా తలఎత్తి కళ్ళు నిలిపి చెవులొగ్గి ఆలకిస్తూ నిలబడిపోయినారు.

అమ్మాయిల్లారా, అమ్మాయిల్లారా,—అని ఆ గొంతు వినిపించింది.

ఆడపిల్లలందరూ అట్లాగే నిలబడి పోయినారు.

'ఆ పడవ ఎక్కబోకండి!'

తర్వాత పిడుగువంటి ధ్వని అయింది. అది ఆయన కోపంతో హుంకారం చేసిన ధ్వని.

కాగితపు పడవలు మీరు నీళ్ళల్లో వేసి ఊదుతుంటారే, అప్పుడవి ఎట్లా ముందుకు పోతవి? సరిగ్గా అట్లాగే, అంత బ్రహ్మాండమైన నావ కూస్తా ఆ హుంకారానికి అదిరిపోయి దూరానికి కొట్టుకు పోయింది. ఆ పడవలో వాళ్లువేసిన చెక్కలు వెనక్కు లాక్కునే వ్యవధానం కూడా లేక పోయింది. ఆ తొందరలో ఎక్కే చెక్కల మీద ఉన్న పిల్లలుకొందరు పడవలో పడ్డారు. కొందరా విసురుకు ఒడ్డున పడ్డారు. నలుగురు పిల్లవాళ్లు పాలల్లో పడ్డారు.

అయితే ఏమి? అప్పటికే కొంతమంది పిల్లలు మురిపముకొద్దీ పడవలోకి ఎక్కిపోయినారు. పడవసాగి కొట్టుకుపోతూ ఉంటే అందులో ఎక్కిన పిల్లలు కొందరు పడవ టాపుమీదికి వచ్చి కటకటాలు పట్టు

కొని నిలువబడి దీనంగా ఒడ్డున ఉన్న పిల్లల వంకా కర్పూరద్వీపం వంకా చూస్తున్నారు.

వారిలో మరీ నలుగురు ఆడపిల్లలు దిగులు అచ్చుగుద్దినట్లున్న ముఖాలతో పాలల్లోపడ్డ మిత్రులు నలుగురు అబ్బాయిలను రమ్మని సంజ్ఞలు చేస్తున్నారు. తాము మాత్రము పాల సముద్రంలోకి దూకి వచ్చే ధైర్యంగాని వీలుగాని ఉన్నట్లు లేదు.

అయ్యో, పాపము! చూస్తూచూస్తూ ఉండగానే పడవ దూరమై పోతున్నది. అందులో ఎక్కిన పిల్లలు కూడా కొంచెము కొంచెము మారిపోతున్నట్లు కూడా దూరానికి వీలుగా కనిపిస్తున్నది. పసివాళ్లల్లా ముందు క్షణానికి ఒక్క ఏడు చొప్పున వయస్సు వచ్చి పెద్దవాళ్లై ముసలి వగ్గులుగా మారిపోతున్నారు. కొందరు పశువులుగాకూడా మారుతున్నారు. కొందరు పక్షులౌతున్నారు. ఎవరో కొద్దిమంది రకరకాల మనుష్యులవుతున్నారు.

4

పాలల్లో పడ్డ నలుగురూ ఎటుపోవలెనో తోచక మథన పడుతున్నారు. ఇటు కర్పూర ద్వీపానికి వస్తే హాయిగా ఉండవచ్చునని రావలెననీ ఉన్నది. అయితే వాళ్ళ కింకొక వైపున ఆ పడవలో వింతలు చూడవలెననే మోహము తీర లేదు. అదీకాక వాళ్ళకు ముఖ్య స్నేహితులైన ఆడపిల్లలు నలుగురూ పడవలో చిక్కుకొని పిలుస్తున్నారు. పాపము వీళ్ళుఏమిచేసేట్లు?

వారిలోకల్లా చిన్నవాడు ఇందాక పడవలో నుంచి వినిపించిన సంగీతము మనస్సులో ఇంకా మనసము చేసుకుంటూ పాలసముద్రపు తరంగాలతోపాటు తల తిప్పుతూనే ఉన్నాడు. కాక గాలిలో అణిగిపోయిన పడవపాట లీలగా సూక్ష్మంగా ఇంకా అతనికి వినిపిస్తున్న దేమో— అతను చెవులు పడవకేసి ఓరగా చేసి రిక్కించి ఒగ్గి ఆలకిస్తున్నాడు. ఒడ్డు చేరుదామనే ఆలోచనే లే దతనికి.

వాడికంటె పెద్దవాడు కళ్లు రెండూ అప్పగించి ఆపడవవైపుకు చూస్తున్నాడు. పడవలో అతనికి ఇంద్రధనుస్సు రంగులకంటె అద్భుతమైన రంగురంగుల వస్తువు లెన్నో కనిపించినై. వాటిని చూడాలనీ తీసుకురావా లనీ వ్యామోహా మతనికి పోలేదు.

అందరికంటె పెద్దవా డొక్కడు మాత్రము తిరిగి ఒడ్డుకు పోదామని దారి తీస్తున్నాడు. కాని రెండోవాడు అడ్డంకొట్టాడు.

"ఉండు. మన సావాసగత్తెలను పడవలోపోనిచ్చి మన మిక్కడ హాయిగా తింటూ ఆడుకొంటూ పడి ఉంటామా? మన మాపడవను ఎట్లాగైనా పట్టుకొని మనవాళ్ళను లాక్కువద్దాము!"

ఇట్లా రెండోవాడు అంటూ ఉంటే పెద్దవాడు, "దేనికి వచ్చింది బాబూ, పోయి ఈసంగతి అమ్మకూ నాన్నకూ చెబుదాముురా నాయనా," అంటున్నాడు.

ఐతే రెండోవాడు ఊరుకున్నాడా! "మనము వాళ్లను వదలి ఒంటరిగా తిరిగివెళ్లితే అమ్మానాన్నా కోపపడరూ! సంతోషిస్తారా?—భయపడతావేం?"

కర్పూరద్వీపంలో పిల్లలకు భయమనేది లేదు. భయపడ్డాడంటే అక్కడ నామర్దా ఇంతా అంతా కాదు. తనకు భయం కలిగిందని రెండోవాడు ఆరోపించగానే పెద్దవాడు, 'నాకాభయం?' అంటూ వెనక్కు బయలుదేరాడు.

ఆ ద్వీపంలో పిల్లలు చేపలల్లే పాలల్లో నీళ్ళల్లో ఈదగలరు; పక్షులవలె ఆకాశంలో రివ్వున ఎగిరిపోగలరు; మనుష్యులవలే నేలమీద నడవనూ నడవగలరు.

ఇప్పుడు వాళ్లు చేపలవలె ఆమహాసముద్రంలో ఈదుకు పోతున్నారు. కర్పూరద్వీపము వైపుకుకాదు, పడవవైపుకు.

వా రందరిలో బలంగలవాడు రెండోవాడు. అతనే దారి తీస్తున్నాడు. అభిమానానికి పోయి పెద్దవాడుకూడా వెంట సాగినాడు. పడవలో వస్తువులు మళ్లీమళ్లీ చూడవలెనని ఉబలాటపడుతున్న మూడోవాడూ, అక్కడిసంగీతంలో తేలిపోవలెనని కలలు కంటున్న చిన్నవాడూ సరదాగా వారివెంట వెళుతున్నారు. నలుగురూ నాలుగు తిమింగలాలవలె నిర్భయంగా ఆ సముద్రపు పాల తరగలు కోసుకొంటూ ముందుకు వేగంతో సాగిపోతున్నారు. ఎక్కువ బలశాలి ఐన రెండోవాడే ముందు దారితీస్తున్నది వాళ్లకు.

ఆదారి తీస్తున్నవాడి నెత్తిమీద సముద్రపు నురుగులు ఎత్తుగా పేరుకొన్నవి. ఆ నురుగు తెట్టె అందులోని చిరుబుడగలతో అతని నెత్తి మీద

★ కర్పూర ద్వీపయాత్ర ★

రత్నాలుపొదిగిన కిరీటము పెట్టినట్లు ధగధగ లాడుతున్నది. అతని ఒంటినిండా కూడా పాలతరక కట్టి తెల్లటి పట్టుదుకూలం కట్టుకున్నట్లుండి మెరిసి పోతున్నాడు.

అట్లా వాళ్లు పోయిపోయి పడవను కలుసుకున్నారు. అయితేనేం! వాళ్ళ సావాసగత్తెలా పడవ మీద కనపడలేదు. అసలందులో పిల్లలెవరూ ఉన్న జాడే కనిపించలేదు. వాళ్ళకేమీ తోచలా. పడవ చుట్టూ గిరగిర తిరిగిచూశారు. అసలు పడవలోకి పోవడానికి దారీ తెన్నూ కనపడలా. ఆ పడవలో ఎవరూ ఉన్న జాడే లేదు. వస్తువులూ లేవు. సంగీతము వినిపించడము లేదు. అంతా ఏదో మాయగా ఉన్నది. మరి వాళ్లిప్పుడేమి చేయాలి?

"పోని తిరిగి కర్పూరద్వీపానికి పోదాం. అమ్మా నాన్నకి చెబుదాం. ఇకనైనా రారాదటయ్యా!" అన్నాడు పెద్దవాడు.

రెండవవాడు ససేమిరా ఒప్పలేదు. పోనీ తానొక్కడూ తిరిగి పోదామని తోచనైనా తోచలేదు పెద్దవాడికి.

అంతలో రెండవవాడికొక ఉపాయం తోచింది. పడవపైకి ఎగిరిచూస్తే? అట్లా అనుకోగానే అతనికి రెక్కలు వచ్చినై. ఆహా, ఏమి రెక్కలు! నున్నగా రంగురంగులతో నిగనిగలాడే రెక్కలు. పడవలో తన సావాసగత్తెను చూడవలెనని ఉన్నది కాదూ, అతనికి అందుకే కాబోలు,—అతని రెక్కలంతా కళ్లే, తోకలంతా కళ్లే. మెరిసిపోయే రంగురంగుల కళ్లు. అతని శిరస్సుమీద కిరీటంవలె ధగధగలాడే కుచ్చు కూడా తయారయింది. అతని మెడఅంతా పట్టుకంటె మెత్తగా నున్నగా నీలంగా మారింది. ఎన్నడైనా వర్షాకాలంలో నెమలిని చూచారా? అట్లాంటి నెమలి ఐ అతను క్రేంకారం చేసుకొంటూ పడవపైకి ఒక్క ఎగురు ఎగిరాడు.

పెద్దవాడు రాజహంసగా మారి మందయానంతో పడవపైకి ఎగిరాడు. మూడవవాడు చక్కని రామచిలకగానూ, అందరిలో చిన్నవాడు కుహూ కుహూ మనే కోకిలగానూ మారి పడవపైకి ఎగిరారు.

పడవపైకి ఎగిరి చూతురుగదా,— వాళ్లకు దానిరూపమే పూర్తిగా మారిపోయినట్లు కనిపించింది. అయ్యో! ఏమిటది?—ఇది ఇందాక చూపిన అందాల పడవేనా? ఇప్పుడది నోరు తెరుచుకున్న పెనుభూతంగా, భయంకరమైన రాక్షసిగా, క్రూర నక్రంగా కనిపిస్తున్నది చీకటిగహ్వరంవలె ఉన్న దాని నోట్లో మెరుస్తూ కోరఎళ్ళవరసలే కనిపిస్తున్నవి.

ఏమి చేసేట్లు? నెమలిగా ఉన్న రెండో వాడికి కూడా కాస్త జంకు వేసింది.

"ఇకనైనా అమ్మా నాన్నా దగ్గిరికి పోదాంగా నాయనా!" అని హంసగా ఉన్న పెద్దవాడు పిలిచాడు. కాని ఆ రెండోవాడు వింటేనా? విందామన్నా అతని బరువైన రూపాన్ని ఆ సొగసైన రెక్కలు ఎగర నిచ్చేట్లు లేదు.

సుడిగుండంలోకి బలవంతంగా లాగబడే జంతువులాగే, సురస నోట్లోకి లాగబడ్డ హనుమంతుడిలాగే ఆ రెండవవాడు భూతం కోరల్లోకి దూకాడు. హంసా చిలకా కోకిలా కూడా వాడి వెంటనే కోరల మధ్య పడ్డారు.

వాళ్లు పడ్డదే వ్యవధానంగా మహా యంత్రపు పళ్లవలె ఉన్న ఆ భూతం నోరు వాళ్ళ నలుగురినీ నమలడానికి భయంకరంగా కలయ నొక్కుకుంటున్నది.

అంతా ఒక్కసారిగా కెవ్వున కేక వేశారు. అంతే! (ఇంకావుంది)

వంటయింట్లో వస్తుసంగ్రామం

ఆయింటివాళ్ళు ముసలమ్మకు ఇల్లు వప్పగించి అంతా కలిసి సినీమాకి పోయారు. వాళ్లు వెళ్లిన కాసేపటికి ఇంటితలుపులన్నీ బిగించేసి, తనూ పెత్తనాలకు బయలుదేరింది ముసలమ్మ.

వంటయింటి సామాను ఒక్కసారిగా మేలుకొంది. వస్తుసంచారం ప్రారంభమైంది. బరువు [illegible]ట్లేలేని వుల్లిపాయ ఒకటి, బోనులో తీగమీదనుంచీ తప్పించుకొని గబగబా బయటకు వచ్చి, వీపుమీది గాయాన్ని చూసుకుని ఏడుస్తూ ఒక్కదూకులో వచ్చి, ఉల్లిపాయల బుట్టలో తనవాళ్లను కలుసుకొంది.

ఈ వింతను కళ్లారచూసిన కంచు బిందెకి వుడుకుమోతుతనం వచ్చింది పక్కనున్న రేకుబిందెను మోచేత్తో పొడుస్తూ "చూశావటే, ఉల్లిముండసాహసం"—అని నోరు నొక్కుకుంది. మోచేతిపోటుకు సొట్టపడిన రేకుబిందె జవాబు చెప్పకుండ మూతి ముడుచుకుంది.

కంచుబిందెకు వళ్ళు సలసలా కాగిపోయింది. "మాట్లాడవేం?" అని మరోపోటు పొడిచింది.

"ఛీ పో! సిగ్గులేనిదానా"—అని రేకుబిందె యిటు మూతి అటుకి తిప్పుకుంది.

వెంటనే కంచుబిందెమీది గ్లాసు ఎగిరిదూకి సైమంటా "ఓసి బక్కపీనుగా! నీకెంత పొగరే—" అంటూ రేకుబిందె నెత్తినెక్కి నాలుగుపోట్లు పొడిచింది. కంచుబిందే, కంచు గ్లాసూ కలిసి రేకుబిందెతో యుద్ధానికి దిగినై.

స్వతహాగా ఏదీ చూస్తూ ఊరుకోలేని మట్టికడవ మధ్యన ఓపోజు పెట్టి "పోట్లాడతారేమ్రా-" అంటూ తీర్పు తీర్చడానికి వచ్చింది అక్కడికి తానోపెద్ద ఆరిందాలాగ.

"పోవే ఓటిముఖందానా, నీకెందుకు మాగొడవ-" అంటూ అమాంతంగా మట్టికడవ పొట్టపగలకొట్టి మళ్ళీ తన యధాకార్యక్రమానికి వెళ్లిపోయింది - కంచుబిందె.

రామడుగు వెంకటేశ్వరరావు

ఈ దౌర్జన్యాన్ని చూసి సహించలేక, మూలనున్న రోలూ రోకలీ, అలమారకున్న తలుపు చెక్కలూ యుద్ధరంగంలోకి దిగినై; రేకుబిందె పక్షాన. బిందెలూ చెంబులూ ఒక పక్షమూ, రోలు రోకలీ తలుపు చెక్కలూ ఒక పక్షమూ. ఇంట్లో హోరాహోరీగా యుద్ధం జరుగుతోంది.

ఇంతలో పచ్చళ్ళ గూట్లో అప్పుడే నిద్రలేచిన ఆవకాయజాడీ గోంగూరజాడీని అడిగింది "ఏమిటా గోల-" అని. ఎన్నాళ్లనుంచో పగబట్టిన గోంగూరజాడీ- "నన్నడక్కపోతే పోయి చూడరాదూ!-" అంటూ ఒక్కతోపు తోసింది ఆవకాయ జాడీని.

ఆవకాయ జాడీ బద్దలైంది. గూట్లో మరోయుద్ధం ప్రారంభమయింది. అమాంతంగా అన్ని రాచ్చిప్పలూ, జాడీలూ ఒక్కసారిగా క్రిందపడి మరణించినవై వీరస్వర్గాన్ని అలంకరించ వెళ్లాయి. జాడీలు అనే బందిఖానాల్లోంచి పచ్చళ్లు స్వాతంత్రం పొందినవై, యిల్లంతా వ్యాపించినై. ఆ ధరువుల్లేకుండ బ్రతుకలేని అన్నం, యిదే సమయమని, గబగబా గిన్నెలోనుంచి బయటకు వచ్చేసి పచ్చళ్ళలో పొర్లాడి మళ్లీ ముక్తసరిగా వచ్చి అన్నపుగిన్నెలో ముడుచుకు కూర్చుంది. కుస్తీలతో అలసిపోయిన యిరుపక్షాలవారూ యుద్ధాన్ని ఆపి, సిద్ధంగా తయారై వున్న భోజనాన్ని ఆరగించి మళ్లీ సంగ్రామం మొదలుపెట్టారు.

వంటయింట్లో వస్తుసంగ్రామం

వీధిలో పెత్తనాలు చేస్తున్న చెవిటి ముసలమ్మకు ఈ రణగొణ ధ్వని కొద్దిగా వినిపించింది. ఆమె జాగ్రత్తగా చెవియొగ్గి వినేలోగా ఆ ధ్వని ఆగిపోయింది. మనస్సుకి కలిగిన అనుమానం నివృత్తి కాగా ఆమె మళ్లీ వెళ్ళిపోయింది.

సరిగ్గా అదే సమయంలో దొంగ పిల్లి ఒకటి కిటికీ ఊచల్లోంచీ లోపలికి దూకి ఉట్టిమీది పాలు తాగుదామని ఉట్టి ఎక్కింది. యుద్ధాన్ని వింతగా చూస్తూ వొళ్లు మరచివున్న వుట్టి, పిల్లి మీదకు దూకగానే వులిక్కిపడి పిల్లినీ, పాలకుండనూ కూడా క్రిందకు తోసేసింది. పాలకుండ బద్దలైంది. నేలపాలయినా సరే ఆ పాలను తాగుదామని పిల్లి ఆశతో వచ్చేలోపుగా ఇరుపక్షాలవారూ ఆ పిల్లిపిల్లను నాలుగు తన్ని వెళ్ళగొట్టి, క్షీరపానం చేసి మళ్ళీ యుద్ధం మొదలు పెట్టారు.

మళ్ళీ వంటయింట్లో ఓటిబిందెల మోత ప్రారంభమయింది. ఆ ధ్వని, ఊసుబోక వీధిలో కబుర్లాడుకొంటూన్న ముసలమ్మకు యీసారి స్వచ్ఛంగా వినిపించింది. "ఏమిటి చప్పుడు"-అంటూ ఆమె యింట్లోకి వస్తూంటే గుమ్మంలో చావ సిద్ధంగా వున్న పిల్లి పిల్ల ఎదురైంది. ఇంట్లో చప్పుడు యీ పిల్లి మూలంగానే ఐవుంటుందని భావించి, దాని బుర్ర కాస్తా తనదుడ్డుకర్రతో రామకీర్తన పాడించింది ముసలమ్మ. సామాను సర్ది పెట్టటానికి యింట్లోకి వెళ్ళి వంటగది తలుపు తెరచింది. ఇంతకు మున్నెన్నడూ కనీవినీ ఎరుగని సామాను సంగ్రామాన్ని సాక్షాత్తు తమ వంటయింట్లోనే చూసి, ముక్కుమీద వేలేసికొని ముసలమ్మ గుమ్మంలోనే నీలుక్కుపోయింది.

సంగ్రామ సంరంభంలో రోలు రోకళ్లు అటూఇటూ పరుగెత్తుతున్నాయి. సొట్టబడ్డ ఓటిబిందెలూ చెంబులూ తమ రాజపుత్ర పరాక్రమాన్ని వెల్లడించుకొంటున్నాయి. ఉట్లు ఉయ్యాల లూగుతున్నాయి. పచ్చళ్లు నేలమీదపడి పొర్లాడుతున్నాయి. తలుపుచెక్కలు తైతక్కలాడుతున్నాయి.

కొంతసేపటికి ఎలాగో ధైర్యం చేసి లోపలికి వెళ్ళింది, ముసలమ్మ. ఓటిబిందెను తీసి చకచకా ఉట్టిమీదకు సర్దబోయింది. తమ అంతర్యుద్ధంలో పరులు - అందులోనూ నరులు - కల్పించుకొన్నారనే ఘోరావమానంచేత ఇరుపక్షాలవారూ ముసలమ్మ మీద తిరగబడి ఆమె వీపు ప్రయ్యలు చేశారు. తలుపుచెక్కల పుణ్యమా అని ముసలమ్మ తల కాస్తా పగిలింది. కుయ్యోమొర్రో మంటూ, చేసేదేమీ లేక ముసలమ్మ గబగబా వీధిలోకి పారిపోయింది.

వీధిలోని నలుగురు పెద్దమనుషుల్ని పిలుచుకొచ్చింది. వాళ్ళలో ఒక భూతవైద్యుడుకూడా ఉన్నాడు. ఆ భూతవైద్యుడు యిల్లు చూడగానే యీ యింట్లో భూతమున్న

ఒకడు తన స్నేహితుడితో:— "నాకు పెళ్ళయ్యేదాకా ఆనందమంటే ఏమిటో తెలియలా."

రెండోవాడు :— "పాపం, తెలిసిమాత్రం ఏం చేస్తావ్, పెళ్లయిపోయాక ?"

* * *

మేష్టరు:— "ప్రపంచంలో మనం తల్చుకుంటే చెయ్యలేని పనిలేదు."

విద్యార్థి:— "బయటికి వచ్చిన టూత్ పేస్టును మళ్లీ ట్యూబ్ లోకి మీరులాగగలరా మేష్టారూ ?"

దంటూ అందర్నీ అవతల ఉండమని తానొక్కడూ వంట గదిలోకి వెళ్ళి "హ్రాం-హ్రీం-హ్రూం.." అంటూ మంత్రాలు మొదలెట్టాడు. వెంటనే వాడి బుర్ర "ఖంగు" మంది. "బాబోయ్‌నావల్లగా"దంటూ వాడు వీధినపడి పారిపోయాడు. వాడితో పాటు అవచ్చిన వాళ్లుకూడా తోక ఝాడించేశారు.

అప్పటికి యిరుపక్షాల వారూ అలసిపోయారు. పచ్చళ్ళ జాడీలూ, రాచ్చిప్పలూ, కుండలూ ముందే వీరస్వర్గాన్నలంకరించినై. రోలు రోకళ్ల పుణ్యమా అని పాత్ర సామగ్రి ముందే బద్దలయింది. ఈ మహా యుద్ధంలో లేకుబిందె శాస్త్రా రొట్టెముక్కలాగా సాగి పత్తా లేకుండా పారిపోయింది. ఇక మిగిలిన రోలు రోకళ్లు కూడా యుద్ధం చేసి అలసిపోయాయి. అయినా అల్లాగే మరికొంచెంసేపు పోరు సల్పి యిరుపక్షాలవారూ సంగ్రామం నుంచీ విరమించుకొని విశ్రాంతి తీసుకొన్నారు.

వీధిలోకి వెళ్ళిన ముసలమ్మ ఒక పందమందిని వెనకేసుకువచ్చి గబగబా తలుపు తీసింది. తానొక పెద్ద డిటెక్టివ్‌లా ఏదో చెయ్యబోతున్నానని ఆశపడిన ముసలమ్మకు ఒక్కసారిగా ఆశాభంగమయింది. ప్రతివస్తువూ యుద్ధరంగంలో చావుదెబ్బలుతిని ఎక్కడివక్కడ కదలమెదలక శాశ్వతనిద్ర నటిస్తున్నై. ఆ వచ్చిన పెద్దమనుష్యులంతా ముసిల్ది చెప్పిన విడ్డూరం కోసం మొఖం అంతా కళ్ళు చేసుకొని గడియసేపు దీక్షగా చూశారు. "ఇంట్లో సామాను చిందరవందరగా వుండటమైతే వున్నయి కాని, ఒక్కటీ కదలటంలేదు. ఇదంతా ఆ ముసిల్దాని మాయరా"- అంటూ ముసలమ్మ బుర్ర మోతెత్తించి, ఎవరికి అందింది వాళ్లు తలా ఒక వస్తువూ పట్టుకొని ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

పాపం ఆముసలమ్మ ఒళ్లు హూనమైనందుకు బాధపడుతూ, దక్కిన సామాను చెడిపోయినందుకు వెక్కి వెక్కి ఏడుస్తూ, దక్కని సామానులు పోయినందుకు మూలుగుతూ, సినీమానుంచీ వచ్చే తనవాళ్లకు ఏమి చెప్పుకోవాలో జవాబు తెలియక శోకాలు పెట్టిపెట్టి, అలిసి, సొలిసి అవలించి నిద్రపోయింది.

★



యునైటెడ్ టెక్నీషియన్స్ ఎండ్ శ్యామలావారి "పల్లెపడుచు"లో రామశర్మ.




భరణీవారి “చక్రపాణి” లో భానుమతి, సూర్యకాంతం.

★

మిల్లు మేనేజరును బయటికి నడవమంటున్నాడు యజమాని.

నేషనల్ ఆర్ట్ థియేటరువారి “తోడుదొంగలు” లో ఎన్. టి. రామారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు.



పిల్లల చిత్రాలు

"ఫిల్మ్‌ఫేర్" పత్రికలో "మన పిల్లలు - ఫిలిములు" అనే శీర్షిక క్రింద బ్రిటిష్ డైరెక్టరు హెర్బర్ట్ మార్షల్ ఈ క్రింది వ్యాసం వ్రాశారు:

నేటి బాలబాలికలు రేపటి పౌరులు కనుక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్న ప్రతి వ్యక్తీ పిల్లల చిత్రాల సమస్య తెలుసుకోవలసి ఉంది. దేశ నాయకుల దగ్గర్నుంచి సామాన్యులైన తల్లిదండ్రులవరకూ ప్రతివారూ పిల్లల విద్యను గురించి, క్రమశిక్షణ గురించి జాగ్రత్త తీసుకోక తప్పదు. ఈ రోజుల్లో పిల్లలు - ఇల్లు, స్కూలు, సినిమా, ఈ మూడు సాధనాల ద్వారా విజ్ఞానం ఆర్జించుతున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. ఈ మూటిలో సినిమాను గూర్చి మనం ఇక్కడ ఆలోచిద్దాం.

సినిమాలకు పిల్లలమీద ఉండే ప్రభావం సరిగ్గా ఎటువంటిది అనే విషయమై వాద ప్రతివాదాలున్నాయి. ఇంటివద్ద తండ్రి తన పిల్లలను పిల్లలుగానే పరిగణిస్తాడు. వారికి కథలు చెప్పినా, పాటలు విని పించినా, బొమ్మల పుస్తకం ఇచ్చినా అవి పెద్దవాళ్ళకని ఉద్దేశించబడినవై ఉండవు. హంతకుల ఘోరాలు, సెక్సుపాటలు, అటువంటివే పత్రికలను తన పిల్లలకు దూరంగా ఉంచుతాడు.

కొన్ని దేశాలను మినహాయిస్తే, మిగతా చాలా దేశాల్లో వయోజనులకోసం తయారైన చిత్రాలనే పిల్లలకు చూపిస్తున్నారు. పిల్లలు చూస్తున్నారు. పిల్లల సినిమా ప్రోగ్రాముల్లో కూడా వయోజనుల చిత్రాలే చూపిస్తున్నారు. పిల్లలు 'ఏ' సర్టిఫికెట్ గల కొద్ది చిత్రాలు తప్పిస్తే మిగతా చిత్రాలన్నీ చూడవచ్చును. ఇలా పిల్లలను చూడనిస్తున్న చిత్రాల్లో అనేకం, నిజంగా పిల్లలకు తగినవి కావనీ, వాటివల్ల పిల్లల మనస్సులకూ, ప్రకృతులకూ చాల హాని కలుగుతున్నదనీ అంతా అంగీకరించారు.

పిల్లలకు ప్రత్యేక చిత్రాలు నిర్మించడమనే సమస్యను మొదట పరిష్కరించింది సోవియెట్ యూనియను; తరువాత గ్రేట్ బ్రిటన్. సోవియెట్ యూనియన్‌లో, పిల్లలకోసం మామూలు చిత్రాలు, రంగు చిత్రాలు, పెద్దచిత్రాలు, చిన్న చిత్రాలు తయారుచేసే స్టూడియోలు అనేకం ఉన్నాయి. ఇరవై ఏళ్ళ కిందట మాస్కోలోని బాల చిత్రాల స్టూడియోలో పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఆతరువాత బ్రిటన్‌లో ఆర్థర్ రాంక్ సంస్థకు బాలచిత్రాలను తయారుచేసి ఇచ్చాను. అందుచేత సోవియెట్, బ్రిటిష్ బాలచిత్రాలను పోల్చి తారతమ్యాలు తెలుసుకునే మంచి అవకాశం నాకు కలిగింది.

మొదటి ముఖ్యమైన తేడా ఏమంటే, సోవియెట్ యూనియన్‌లో బాలచిత్ర నిర్మాణం పూర్తిగా ప్రభుత్వాధికారం క్రింద ఉన్నది. బ్రిటన్‌లో పూర్తిగా ప్రైవేటు సంస్థల చేతులలో ఉంది. సోవియెట్ యూనియన్‌లో, బాల చిత్రాల స్టూడియోలు, థియేటర్లు సినిమటోగ్రఫీ మంత్రిత్వశాఖ అజమాయిషీలో వుంటాయి. ప్రభుత్వంవారి ప్లానింగ్‌లో వీటి కొక స్థానమున్నది. వారి చిత్రాలు చిన్న పిల్లల విద్యాకార్యక్రమంలో ఒక భాగంగా, సోషలిస్టుసమాజంలో నివసించబోయే భావి పౌరులనీతివిలువలను తీర్చిదిద్దేవిగా, నిర్మించబడతాయి.

సోవియెట్ యూనియన్‌లో కళ ప్రయోజనాత్మకం అని ఒక సిద్ధాంతం ఉన్నది. అందుచేత వారు తలపెట్టినది నిర్విఘ్నంగా కొనసాగుతుంది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతా అరాజకమే. కళ కేవలం వినోదంకోసమే నని చిత్రనిర్మాతలు నిరూపించజూస్తారు. కాని ఏ యుద్ధమో ముంచుకువచ్చినప్పుడు పెట్టుబడిదారీ ప్రభుత్వాలే చిత్రనిర్మాణాన్ని వశపరుచుకుని, ప్రచారాత్మకమైన చిత్రాలు నిర్మిస్తాయి. ఈ ధోరణి ఇప్పటికీ కొనసాగుతోంది.

రెండో ప్రపంచయుద్ధకాలం వరకూ బ్రిటన్ ప్రత్యేకంగా పిల్లలచిత్రాలంటూ ఏమీ నిర్మించలేదు. 1948 నాటికి ఆర్థర్ రాంక్ ఫిలిం పారిశ్రామికుడుగా అత్యుచ్ఛదశలో ఉన్నాడు. ఆయన ప్రొడ్యూసరు, డిస్ట్రిబ్యూటరు, ఎగ్జిబిటరుకూడాను. తన ఫిలిం సామ్రాజ్యానికి ఒక అంగంగా బాల చిత్రాల నిర్మాణంకూడా ఏర్పాటు చేయాలని సంకల్పించాడు. పిల్లల విజ్ఞాన చిత్రాలు తీసి పేరు ప్రఖ్యాతులు పొందిన మిస్ మేరీ ఫీల్డును పిలిపించి ఆమెకు ఈ పని ఒప్పగించారు. ఆమె నిపుణులైనవారిని తనతో చేర్చుకుని పనిచేయ మొదలిడింది. ఆర్థర్ రాంక్ బాల చిత్రనిర్మాణం 1948 నుండి 1950 దాకా ఏళ్ళు అవిచ్ఛిన్నంగా సాగింది. ఫిలిం రంగంలో యుద్ధానంతర మాంద్యం మూలాన రాంక్ బాల చిత్రాలకు ధనసహాయం ఇవ్వడం మానివేశాడు. అందుచేత అవి ఆగిపోయాయి.

ఆ ఏడేళ్ళలో రాంక్ ఆధిపత్యాన 202 బాల చిత్రాలు తయారైనవి. వీటిలో అన్ని రకాలవీ ఉన్నాయి. 76 వార్తా చిత్రాలు, 11 హాస్యకథా చిత్రాలు, 19 దీర్ఘకథా చిత్రాలు, 7 కార్టూన్ చిత్రాలు, 6 సంగీత చిత్రాలు, 27 సీరియల్ కథాభాగాల చిత్రాలు, 38 ప్రకృతిశాస్త్ర చిత్రాలు, 16 యాత్రా చిత్రాలు, 7 డాక్యుమెంటరీలు.

ఈ చిత్రాలను రాంక్ సంస్థలకోసం పెద్ద ప్రొడ్యూసర్లు, స్వతంత్ర నిర్మాతలు బయటివారే ఎక్కువగా తయారుచేశారు. నేను స్థాపించిన "సిటిజన్ ఫిలిమ్స్ లిమిటెడ్" కంపెనీ మూడు బాలచిత్రాలు తయారుచేసింది. శనివారం ఉదయాలు పిల్లలకు చిత్రాలు చూపించే సమయాలుగా నిర్ణయించాము. థియేటర్ల మేనేజర్లు పిల్లల సినిమా క్లబ్బులు నడిపేవారు. ఈ క్లబ్బుల ద్వారానే నిర్మాతలకు తమ చిత్రాలపట్ల పిల్లల అభిప్రాయాలెలా వుంటున్నాయో తెలిసేది. మేనేజర్లు బాలప్రేక్షకులకు ప్రశ్నాపత్రాలు ఇచ్చేవారు. వీటిని బాలబాలికలు అన్సరుచేసి ఇచ్చేవారు. మచ్చుకి ఒక ప్రశ్నాపత్రం ఉదహరిస్తున్నాను.

(1) (ఎ) పిల్లలకు ఈ చిత్రం కొసదాకా చూడాలనిపించేదిగా ఉందా?

(బి) అలా లేకపోతే, ఏయే చోట్ల విసుగు పుట్టించింది?

(2) (ఎ) ఏ పాత్రలు పిల్లలకి బాగా నచ్చాయి?

(బి) ఏ పాత్రలు నచ్చలేదు?

(సి) ఎవరిగొంతుక బాగా విన బుద్ధివేసింది?

(డి) పై మూడు ప్రశ్నల సమాధానాలకి కారణాలు చెప్పండి.

(3) (ఎ) మిమ్మల్ని బాగా ఆకర్షించిన అంశాలేమిటి?

(బి) కామెరా ఎఫెక్టులు, సౌండు ఎఫెక్టులు ఏవైనా మిమ్మల్ని ఆకర్షించాయా?

(4) ఈ చిత్రంమీద మీ వ్యక్తిగత అభిప్రాయాలేమిటి?

(5) ఇతరుల వ్యక్తిగతాభిప్రాయాలేమిటి?

అయితే ఈ మాదిరి ప్రశ్నల ద్వారా పిల్లల అభిప్రాయాలు తెలుసుకోవడం ఆర్థర్ రాంక్ థియేటర్లలోనే సాధ్యమయ్యేది. ఆయన చేతికింద బ్రిటన్‌లో 600 థియేటర్లున్నాయి.

పిల్లల భావాలను తెలుసుకుందుకు ఇంతకంటే శాస్త్రీయమైన పద్ధతులు అవలం

చేయబడేవి. చిత్రం చూస్తున్నప్పుడు పిల్లలు చేసే శబ్దాలు రికార్డు చేసేవారు రికార్డింగ్ యంత్రం అటు చిత్రంలోని శబ్దాలను, ఇటు పిల్లల శబ్దాలనుకూడా ఒకేసారి రికార్డు చేసేది. పిల్లల ముఖాల్లోని హావభావాలను కనిపెట్టేందుకు ఫొటోగ్రాఫులు కూడా తీయబడేవి.

ఒక ముఖ్యవిషయం ఏమంటే, తెరమీది పిల్లలతో బాల ప్రేక్షకులు పూర్తిగా తాదాత్మ్యం పొందేవారు తమకు తెలియకుండానే తెరమీది పిల్లల భంగిమలను, చలనాలను అనుకరించేవారు కొందరు పిల్లలు తెరమీది పాత్రలు నిజంగా ఉన్నారని భ్రమించి ఉత్తరాలు కూడా రాసేవారు.

మరొక ముఖ్య విషయంకూడా తేలింది: వయోజనులకోసం తీసిన చిత్రాలలోని ప్లాటు పిల్లలకు అర్థం కాదు. తెరమీద కనిపించే విడివిడి దృశ్యాలను పిల్లలు అర్థంచేసుకోగలరు ఉదాహరణకి, దొంగలను పోలీసులు తరిమే దృశ్యం వారికి అర్థమవుతుంది కాని సంభాషణలకోసం కథాగమనం నిలిచిపోయినప్పుడు పిల్లలకు విసుగు పుడుతుంది.

ఇదిగాక ఏడు, పదకొండు ఏళ్ళ మధ్య వయస్సుగల ఆడ, మగపిల్లల అభిరుచుల్లో బాగా తేడా కనిపిస్తుంది ఆడపిల్లలు తాము తాదాత్మ్యం పొందేందుకని కథలో తమ లాంటి ఆడపిల్లయే ఉండాలనీ, ఆ పిల్ల ప్రధానపాత్ర వహించాలనీ కోరుతారు కాని మగపిల్లలకు ఆడపిల్ల ప్రధానపాత్ర కావడం ఇష్టం ఉండదు

పిల్లలు తమ స్వభావానికి సరిపడిన పాత్రలనైతేనే హర్షిస్తారు వంగి వంగిగా, అణకువగా ఉండే పాత్రలు వాళ్ళకి నచ్చవు గుర్రాలు, కుక్కలు, పిల్లులవంటి జంతు పాత్రలుకూడా వారికి నచ్చుతాయి కాపీ పుస్తకాల్లో కనిపించే నీతి వాక్యాలను వల్లించే చిత్రాలుకూడా వారికి నచ్చవు

పిల్లల చిత్రాల్లో కథాగమనం నెమ్మదిగా ఉండాలి. ఎందుకంటే, ముందేమి జరుగుతుందో ఊహించుకుంటూ, తాము ఊహించినది జరగ్గానే ఆనందిస్తారు.

ఫొటోగ్రఫీ సౌందర్యం పిల్లల హృదయాలను హత్తుకుంటుందనేది ఆశ్చర్యకరమైనా, అది సత్యమే. కాని ఫొటోగ్రఫీ మరీ కొట్టవచ్చినట్లు ఉండకూడదు. ఈ రోజుల్లో తయారవుతున్న కార్టూన్‌చిత్రాల్లో బాగా ముదురు రంగులు, ఎక్కువ పాత్రలు ఉపయోగించబడుతున్నాయి వీటికంటే తెలుపు నలుపులో తయారైన, సాదా కార్టూన్ చిత్రాలే పిల్లలకు బాగా నచ్చుతాయి

ఈ విషయాలన్నీ మిస్ మేరీ ఫీల్డ్.



"తోడుదొంగలు"లో సొమ్మసిల్లిపడిపోయిన ఎన్. టి. రామారావుకు నీళ్లు అందిస్తున్న పుండరీకాక్షయ్య.

ఆమెతో పనిచేసిన మేమందరమూ స్వానుభవపూర్వకంగా కనుక్కొన్నాము

అర్థర్ రాంక్ బాలచిత్రనిర్మాణం నిలిపివేయడం దురదృష్టం కాని కొంత కాలం తర్వాత "చిల్డ్రెన్స్ ఫిల్మ్ ఫౌండేషన్" అనేది స్థాపించబడింది దీనికి ప్రభుత్వసహాయం ఉన్నప్పటికీ, అట్టే చిత్రాలు తయారవడం లేదు

సోవియెట్ యూనియన్‌లో బాల చిత్రనిర్మాణం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ప్రత్యేకంగా పిల్లల చిత్రాలు ప్రదర్శించే థియేటర్లు చాలా ఉన్నాయి ఇవిగాక పిల్లలకు క్లబ్బులు, ఆటల కేంద్రాలు, పార్కులు, వినోద వ్యాపక కేంద్రాలు, గ్రంథాలయాలు పఠనాలయాలు ఎన్నో ఉన్నాయి పిల్లలను సంరక్షించడం వృత్తిగా గల నిపుణులనేకులు ఉన్నారు

మేరీ ఫీల్డుకు పిల్లల థియేటరు గాని

★ పిల్లల చిత్రాలు ★

స్టూడియో గాని లేదు. ఆమె ప్రారంభించిన పని ఇప్పుడు మందకొడిగా వుంది. దీని నుండి ఇండియా నేర్చుకోవలసిన పాఠం తప్పకుండా ఉంది.

ఇండియాలో 5—15 ఏళ్లమధ్యవయస్సు గల పిల్లలు 8½ కోట్లమంది ఉన్నారు. వీరికి ఆరోగ్యవంతమైన, వినోద విజ్ఞానాత్మకమైన చిత్రాలు నిర్మించే పనికి దిగడానికి భారతీయ చిత్రపరిశ్రమ సిద్ధంగా లేదు. భారతీయ పరిశ్రమ సుసంఘటితం కాకపోవడమే దీనికి కారణం. 1949 లో భారత ప్రభుత్వం నియమించిన ఫిల్మ్ విచారణ సంఘం, ప్రభుత్వమే పిల్లల చిత్రాలు నిర్మించాలని సూచించినది. పిల్లల చిత్రాల పట్ల ప్రజలకు, తలిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి శ్రద్ధ కలిగించడానికి ఢిల్లీలోని "కల్చరల్ ఫిల్మ్ సొసైటీ" పనిచేస్తోంది.

పై సొసైటీ అనధికార సంఘమైనా, ఒక ఏడాదిలో చాలా ప్రశంసార్హమైన పని చేసింది. రెండు బాలచిత్రోత్సవాలు జరిపింది. న్యూఢిల్లీలో ప్రతి శనివారం పిల్లల చిత్రాలు ప్రదర్శిస్తోంది. నిత్యమూ నగరంలో ఏదో ఒక చోట బాలచిత్రం ఒకటి ప్రదర్శింపబడేట్లు చేసింది. ఇతర దేశాలనుండి ప్రఖ్యాత బాల చిత్రాల దిగుమతికి సంప్రదింపులు జరిపింది. స్థానిక నిర్మాతలకు బాల చిత్రనిర్మాణావశ్యకతను గూర్చి నచ్చచెప్పింది. వివిధచిత్రాలపట్ల బాలబాలికల అభిప్రాయాలు సేకరించింది.

బాల చిత్రోద్యమం దేశవ్యాప్తంగా, జయప్రదంగా సాగించడానికి ప్రభుత్వమూ, ప్రజలు, నిర్మాతలు ఏకం కావడం అవసరం. నిర్మాతల, సంఘసేవకుల, ఉపాధ్యాయుల ప్రతినిధులను కొందరిని చేర్చి ఒక సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈ సంఘానికి అటు ప్రజల సహకారం, ఇటు ప్రభుత్వసహాయం కూడా ఉంటుంది. గనుక, పని జరుగుతుంది. ఈ సంఘం బాలచిత్ర నిర్మాణం, ఇతరభాషల్లోని బాలచిత్రాలను అనువదించడం, ప్రదర్శించడం, పరటాయించడం మొదలైన పనులు చేయాలి.

ప్రపంచమంతటా పిల్లలు ఒకే రకం ఫెయిరీ కథలను అభిమానిస్తారు గనుక, ఇతర దేశాల బాలచిత్రాలను భారతీయ భాషల్లోకి అనువదించడం లాభసాటిగా ఉంటుంది. భారతప్రభుత్వపు ఫిల్మ్ శాఖ నిర్మించిన డాక్యుమెంటరీలలో చాల వాటిని, కామెంటరీలోను, ఎడిటింగ్‌లోను మార్పులు చేసి పిల్లలకు ప్రదర్శించవచ్చు. ఈ సూచనకు కేంద్రమంత్రి బి. వి. కేస్కార్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై త్వరలో ఏదో జరుగుతుందని ఆశించవచ్చు.

దేశంలోని 3200 థియేటర్లూ ప్రతి ఆదివారం ఉదయం బాలచిత్ర ప్రదర్శనకు పూనుకుంటే ఈ ఉద్యమం సుసాధ్యమవుతుంది.

ఈ ఉద్యమంపట్ల ఆసక్తి కలిగిన వ్యక్తులు గాని సంస్థలు గాని నాకు ("ఫిల్మ్‌ఫేర్" చిరునామాకు) వ్రాస్తే, నేను కొంత కృషి చెయ్యగలను. బొంబాయిరాష్ట్ర విద్యాశాఖకు నేను నా సూచనలు తెలిపాను. వారు విజువల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు ఈ సూచనలు అందజేశారు. ఆయన చాలా సహకారభావం చూపిస్తున్నారు. బాల చిత్రోద్యమం త్వరలో ఇక్కడ ప్రారంభించవచ్చునని నాకు ఆశగా ఉన్నది. ఇంగ్లండులోని "చిల్డ్రెన్స్ ఫిల్మ్ మువ్‌మెంటు"తో కలిసి ఒక బాలచిత్రాన్ని నిర్మించడానికి కూడా నేను కుతూహల పడుతున్నాను. అయితే ఇక్కడి నిర్మాతలు గాని, సంస్థలు గాని సహకరిస్తే ఇది సులభసాధ్యమవుతుంది. ★

వర్ణార్ణవం

గత మాసంలో పదిమంది చిత్రకారులతో కలిసి, మద్రాసు మ్యూజియంలో చిత్రకళాప్రదర్శనం చేసిన మొక్కపాటి కృష్ణమూర్తిగారు, యీమాసంలో త్యాగరాయనగర్‌లోని సోషల్ అండ్ కల్చరల్ క్లబ్‌లో ఒంటరిగా మరొక చిత్రకళాప్రదర్శనం జరిపించారు. తద్రూపేణా వీరి చిత్రాలను మరింత సమగ్రంగానూ, సన్నిహితంగానూ చూచే అవకాశం నాబోటి కళాభిమానులకి కలిగింది: వారితో పరిచయం కలిగించుకోటానికీ వీలైంది.

క్రిందటిసారి ప్రదర్శించినట్లే యీసారి కూడా యీయన నలభైపైదాకా చిత్రాలు ప్రదర్శించారు. వీటిలో తొమ్మిది లినోకట్ చిత్రాలు. మిగిలినవన్నీ నీటిరంగుల చిత్రాలు.

ఈ రెండు ప్రదర్శనలలోనూ వారు ప్రదర్శించిన చిత్రాలనుబట్టి వీరికి స్వతస్సిద్ధంగా నీటిరంగులమీదనే అభిమానం ఎక్కువైనట్లూ, ఆ రంగులలోనూ ముదురు రంగులవూను ఎత్తకుండా వీలున్నంతవరకు మసకగావుండే మబ్బురంగులే వారి కుంచెకి తగులుతున్నట్లు తోస్తుంది. చిత్రరచనకు వారు ఎన్నుకొనే ఇతివృత్తాలను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు: పౌరాణికం, ప్రాబంధికం, నిత్యజీవితం. వర్రని రంగులు వాడనట్లే, ప్రేక్షకుడి అనుభూతులను బలంగా కదిలించే ఘట్టాలను కూడా ఆయన తన చిత్రాలలోకి రానీయరు; మానవ జీవితంలో ప్రణయం, యవ్వనంలాంటి సుకుమార సుందర ఘట్టాలనే చిత్రీకరిస్తూంటారు. ఊరిపొలిమేరలు, పూరిపాకలు లాంటి దృశ్యాలను చిత్రించినప్పుడు కూడా, ఆ వాతావరణంలో ఎవరేనిహాయి అలుముకొనివున్నట్లే స్ఫురింపచేస్తారు. అక్కడ నివసించే ఆ ఒకరిద్దరు మనుష్యులు, పైకి కనిపించటానికి పేదవారిలా కనిపించినా, ఆత్మపరంగా అనంతమైనజీవనమాధుర్యాన్ని ఆస్వాదించి,నిమిత్తమాత్రంగా యీ చిత్రంలోకి వచ్చి నిలిచినట్లు తోస్తుంటారు. వాస్తవిక జీవితానికి సంబంధించిన యీమాదిరి చిత్రాలన్నిటిలోనూ కృష్ణమూర్తిగారు మానవ జీవితంపై తనకుగల దృక్పధాన్ని వ్యక్తంచేస్తున్నారు. జీవితంలో సుఖ దుఃఖాలు రెండూ కలిసివుండి తీరుతాయనేది ఎవరూ కాదనలేని సత్యమే అయినా, చిత్రకారుడుగా కృష్ణమూర్తిగారు మాత్రం దుఃఖం జోలికి పోకుండా పోరు. ప్రేక్షకుడి గుండెలు పిండే కష్టాన్ని ఎలాగైతే ఆయన చిత్రించరో, అలాగే మైమరపించే ఆనందోద్రేకాన్ని రేకెత్తించే చిత్రాన్ని చిత్రించరు. లాలిత్యము, సౌకుమార్యము అనే ఆ సరిహద్దులు దాటనంతవరకే ఏ యితివృత్తాన్నైనా ఆయన చిత్రిస్తారు. ఉదాహరణలు: మొదటి ప్రయాణం, కొత్తపంట, ఆషాఢాగమనం వగైరా చిత్రాలు. సదా సౌకుమార్యము, లాలిత్యాలకోసమే వెదికే వీరి కంటికి, ప్రకృతీ, ప్రాణులూకూడా తదనుగుణంగానే కనిపించటంలో ఆశ్చర్యం ఏమీలేదు. నాతి విశాలము, నాతి సంకుచితము అయిన ధృక్పధాన్ని యీయన అలవర్చుకొన్నవాడై, తీరనిదాహంతో శరపరంపరగా చిత్రరచన కొనసాగిస్తున్నారు. వయస్సు ఎంత మారినా, పట్టుదల విడవకుండా పద్ధతి సడలనీయకుండా చిత్రరచన కొనసాగించే కొద్దిమంది వ్యక్తుల్లో యీయన ఒకరు.

వీరి చిత్రాలలో ఏ ఏ ప్రముఖవ్యక్తుల ప్రభావం కనిపిస్తుందో యీనాడు ఆలోచించటం అనవసరం. చిత్రకారుడుగా యీయనకు యిప్పటికే కనీసం పదిపదిహేనేళ్ల జీవితం గడిచింది. ఆదిలో ఏఏ వ్యక్తుల శక్తుల ప్రభావం అయితే యీయనలో కనిపించిందో, అదియింతకుముందే యీయనలో జీర్ణించి, యీయన కొక ప్రత్యేక పద్ధతి కూడా సిద్ధించింది. కాకపోతే, యీనాడు మిగిలిన చాలామంది ఆంధ్ర చిత్రకారులను సరికొత్తగా ఆవహించిన అధునాతన, అతి వాస్తవిక ప్రభావాలు మాత్రం యీయనకు అంటలేదు.

పురాణాలు, ప్రబంధాలకు సంబంధించిన పాత్రల చిత్రణంలో యీయన ఏవో కొన్ని మచ్చులు ఏర్పరచుకొన్నారు. ఆయా సందర్భాలలో వాటిని సమర్థించటం, అన్వయించటం సాధ్యం కావచ్చునేమో కాని, అవే మచ్చులు, వాటి ఛాయలు వాస్తవిక జీవితానికి సంబంధించిన చిత్రాలలో కూడా తొంగిచూస్తుంటే, అతివల అందాకికతకోసం తెచ్చుకొన్న సాంకేతికాల ఔచిత్యం చిన్నబోతోంది. ★



పారమౌంట్ తార మేరీ మర్ఫీ

సినిమా వార్తలు

జపానులో హాలీవుడ్ అనుకరణ జాడ్యం మరీ ఎక్కువైపోయి, ఇటీవల నగ్న దృశ్యాలుగల చిత్రాలు అధికం అవుతున్నాయట. కంపులుతీరిన అందగత్తెలు నగ్నంగా జలకమాడే దృశ్యాలతో ఈ చిత్రాలు నిండి ఉంటున్నాయట.

*　　*　　*

హాస్యనటుడు, హాస్య చిత్రనిర్మాత అయిన భగవాన్ "రసీలా" అనే కొత్త చిత్రం తీస్తున్నాడు ఈ చిత్రంలో అయిదుగురు తారలు ప్రధానపాత్రలు ధరిస్తారట గీతాబాలి, సుమిత్రాదేవి, శ్యామ, శకుంతల, నిరూపరాయ్‌లను బుక్ చేసుకోవాలని భగవాన్ అనుకుంటున్నాడట.

*　　*　　*

మరాఠీ నిర్మాత దినకర్ పాటిల్ "మూత్ భర్ చావే" అనే చిత్రం తీయనున్నాడు ఇది ప్రత్యేకంగా పిల్లలను గూర్చిన చిత్రమని తెలుస్తున్నది.

*　　*　　*

చాల ఏళ్ళుగా, చాలా చిత్రాల్లో నటించిన శాంతాఆప్టే, వెల్కం పిక్చర్స్ వారి హిందీచిత్రం "అదాలత్"లో తిరిగి నటిస్తున్నది ఆమెతోపాటు ఇబ్రాహీం షాహీ కూడా నటిస్తున్నాడు.

*　　*　　*

ట్వంటీయత్ సెంచరీఫాక్స్ కంపెనీ వారు "అలెగ్జాండర్ ది గ్రేట్" అనే చిత్రం ఇండియాలో నిర్మించనున్నారట. ఈ చిత్రం సినిమా స్కోప్‌లో తీస్తారట. గ్రీకు చక్రవర్తి అలెగ్జాండరు ప్రపంచ దండయాత్రచేస్తూ భారతదేశం రావడం, మౌర్య చంద్రగుప్తుడు అతని దండయాత్రను నిరోధించడం కథావస్తువట

*　　*　　*

"సుబహ్ కాతారా" అనే పేరు చిత్రం వి శాంతారాం నిర్మిస్తున్నాడు ఇందులో అతని భార్య జయశ్రీ, కుమార్తె రాజశ్రీ, ప్రదీప్‌కుమార్ నటిస్తున్నారు. సంగీత దర్శకుడు సి రామచంద్ర

*　　*　　*

"పరిణీత" చిత్రం నిర్మించి ప్రేక్షకుల గౌరవానికి పాత్రుడైన అశోక్‌కుమార్ తన రెండవ చిత్రంగా "సమాజ్" నిర్మిస్తున్నాడు ప్రఖ్యాత బెంగాలీ రచయిత శైలజానంద ముఖర్జీ వ్రాసిన నవల దీనికి ఆధారం అశోక్‌కుమార్ ఇందులో తాను నాయకపాత్ర ధరించకుండా డ్రైవరుగా నటిస్తున్నాడట శశికళ, నజీర్ హుస్సేన్, ఆగా మున్నగువారు నటిస్తున్నారు మరాఠీ డైరెక్టరు వసంత జోగ్లేకర్ డైరెక్ట్ చేస్తున్నాడు సంగీత దర్శకుడు అరుణ్‌కుమార్.

*　　*　　*

శరత్ నవల "బిరజ్ బాహూ" అనే పేరుతో చిత్రీకరించబడుతున్నది నిర్మాత హిరేన్ బాదిరి డైరెక్టరు బిమల్ రాయ్ కామినీ కౌశల్, అభిభట్టాచార్య నటిస్తున్నారు ★

గ్రంథస్వీకారం

జేగంటలు

"జేగంటలు" మూడవ సంపుటం; ఇందులోని విషయం కౌంట్ పరతత్త్వవాదం రచయిత జి వి కృష్ణరావు, వెల 2-0-0; ప్రచురణ - ది గ్లోబ్ ప్రెసర్స్, అరండల్ పేట, గుంటూరు

కృష్ణరావు గారు నవలాకారులుగా, వ్యాస రచయితగా జిజ్ఞాసువుగా ఆంధ్ర పాఠకలోకానికి సుపరిచితులు సంస్కృతాంధ్రాంగ్ల వాఙ్మయాలలో సమగ్రమూ, విస్తృతమూ అయిన పాండిత్యం కలవారు. విశేషించి తత్త్వాన్వేషణ పరులు. పాశ్చాత్య తత్త్వవేత్తలతో తెలుగువారికి




భరణీవారి "చక్రపాణి"లో
టి. జి. కమలాదేవి, రమణారెడ్డి.

పరిచయం కలిగించడానికి పేరు గ్రీకు తత్త్వవేత్త ప్లేటోగూర్చి ఇదివరలో ఒక పుస్తకం వెలువరించారు ప్రస్తుత సంపుటంలో జర్మన్ దార్శనికుడు కాంట్ నుగూర్చి, ఆయన పరతత్త్వవాదంగూర్చి సంగ్రహంగా వ్రాశారు కాంటియన్ తత్వానికి విలువలు కట్టే ప్రయత్నం చేయకుండా కేవలం కాంట్ ఏమి చెప్పాడు అనేది మాత్రమే తీసుకుని, గ్రంథాంతంలో కాంటియన్ తత్త్వం లేకెత్తించే కొన్ని సంశయాలను పేర్కొని వాటికి సమాధానాలు చెప్పే బాధ్యత పాఠకులకే వదిలివేశారు. జ్ఞాన స్వరూపము, ధర్మస్వరూపము, రామణీయక స్వరూపము వీటినిగూర్చి కాంట్ చెప్పినదాన్ని మూడు ప్రకరణాల్లో సంగ్రహించారు తత్త్వశాస్త్రాసక్తులు తప్పక పరిశీలింపదగిన గ్రంథము.

ఇరుగు పొరుగు

నాటకం; రచన శరత్ బాబు; అనువాదం "కేరా"; వెల 1-4-0; ప్రతులకు గుండిమెడాస్, పబ్లిషర్ ఎండ్ బుక్ సెల్లర్స్, ఏలూరు. శరత్ నవల "పల్లీ సమాజ్"కు ఇది నాటకీకరణం హిందీ నుండి తర్జుమా చేయబడింది. ★

"పల్లెపడుచు"లో చలం,
కృష్ణకుమారి



యోగాసనములు-దేహారోగ్యము

9. శరీరవిభాగములు, యోగాంగముల నిర్ణయము.

యోగశాస్త్ర సంకేతమందు శరీరము 1. సాత్త్వికము, 2. రాజసము, 3. తామసము అను మూడుభాగములుగా విభజింపబడినది. కన్నులు, ముక్కు, చెవులు, నాలుక అను జ్ఞానేంద్రియములకు స్థానమైన తలను సాత్త్వికభాగమందురు.

శ్వాసకోశము (ఊపిరితిత్తులు), హృదయము, భుజములు, చేతులు, కడుపు, పిత్తకోశ మలకోశములు బొడ్డువరకు (కర్మేంద్రియములను) రాజసమందురు.

బొడ్డు క్రింది భాగము పొత్తికడుపు, మూత్రకోశము, వీర్య రజఃకోశములు, రహస్యేంద్రియస్థానములు, కాళ్లుగల భాగమును తామసభాగమందురు.

సాముద్రిక శాస్త్రమందు వీనినే ఊర్ధ్వకాయము, మధ్యకాయము, అధఃకాయమందురు.

సాత్త్వికభాగము చెడినచో తెలివిక్షీణించి కోపతాపాదు లుద్రిక్తమగును.

రాజసభాగము చెడినచో హృదయము దుర్బలమై రక్తసంచార వాయుసంచారములు హెచ్చుతగ్గులు తోచి తలతిరుగుట, నిద్రపట్టకుండుట, ఆకలి మందగించుట, శరీరము నీరసముగుట మొదలగునవి సంభవించును.

తామస భాగము చెడినచో మలబంధరోగము, మూత్రరోగము, నడుమునొప్పి, కాళ్లతీతలు, స్వప్నస్ఖలనము మొలలు పుట్టుట మొదలగు రోగబాధలు జనించి శరీరము నశము తప్పదు.

శరీర లాఘవము చురుకు, బుద్ధి తేటగా నున్నచో సాత్త్వికభాగమైన ఊర్ధ్వకాయము శుద్ధముగా ఎట్టిరోగము లేకున్నదని నిర్ణయింపవలెను.

మనస్సు స్థిమితముగాను శ్వాసోచ్ఛ్వాసగతి దీర్ఘముగానుండి కార్యదక్షత చెడకున్నంతవరకూ రాజస భాగమైన మధ్యకాయము సరిగానే యున్నదని నిర్ణయింపవలెను.

నిద్ర, [illegible], మలమూత్ర విసర్జన సరళముగా నున్నచో తామసభాగమైన అధఃకాయము ఆరోగ్యముగానే యున్నదని భావించవలెను.

వీనిలో ఏది విరుద్ధముగనున్ననూ, ఆభాగమును శోధించి తగు యోగాంగములను మితముగా సకాలములో నభ్యసించవలెను.

శరీరమందు రోగమునకుగాని ఆరోగ్యమునకుగాని మూలహేతువు సత్త్వ, రజస్, తమస్సుల ప్రకోపమే నని ఈశ్వరకృష్ణముని సాంఖ్యకారికలో చెప్పియున్నాడు.

"సత్త్వం లఘు ప్రకాశకమిష్టం
ఉపష్టంభకం చలంచ
"రజః గురు వరణక మేవ
తమః ప్రదీపవచ్చార్థతో వృత్తిః"

మరియు భగవద్గీతలో

"సత్త్వం సుఖే సంజయతి
రజః కర్మణి భారత
"ప్రమాదమోహౌ తమసో
భవతః అజ్ఞాన మేవచ"

అని చెప్పబడినది.

టి. కృష్ణమాచార్య

దేహారోగ్యసాధకమైన యోగాంగ సాధనలుకూడ శుద్ధము, మిశ్రము, పరివాహము అని మూడు రకములుగ విభజింపబడినది.

"శుద్ధమిశ్ర పరీవాహ
భేదాత్ యోగ స్త్రిధామతః
"నిశ్చలం శుద్ధమిత్యుక్తం
మిశ్రకేతు చలాత్మకమ్
"ఆలస్యాది ప్రమాదోత్థం
పరివాహ మితీరితమ్."

(యోగరహస్యము)

సాత్త్వికమైన శరీరభాగమును శుద్ధపరచుకొనుటకు, చక్కని తెలివిని, జ్ఞాపకశక్తి ధారణాశక్తులను, ఆయుర్వృద్ధి సాధించుట కొరకు శీర్షాసనములను (బహు విధములు), మహాముద్ర, జాలంధర బంధములను అభ్యసించ దలచువారు వానిని భోజనమునకు పూర్వమే అభ్యసించుట యోగ్యము.

రాజసభాగమును శోధించి ఆరోగ్యము, బలము, ప్రాణశక్తి, అంగలాఘవము సాధించుట కొరకు సర్వాంగాసన తద్భేదములను, వసిష్ఠాసన, విశ్వామిత్ర, కౌండిన్యాసనాదులను ఉడ్డియాణబంధమును భోజనాత్పూర్వమే యభ్యసించవలెను. లేదా భోజనానంతరము ఆరుగంటలు గడిచిన పిదప యభ్యసింపవలెను.

తామసభాగములోని నాడీగ్రంథులను, కిడ్నీను, మలకోశ మూత్రకోశ రజఃకోశ వీర్యనాళములను శుద్ధిగా నుంచుకొని వ్యాధులు రాకుండ నివారించుటకు నాసా మూలబంధాదులను అభ్యసించువారు కూడ అదే విధముగ భోజనాత్పూర్వము గాని, భోజనానంతరము ఆరుగంటల తరువాతగాని యభ్యసించు టుచితము.

ఇట్లు వీనికి తగు యోగాసనముల పూర్వ వ్యాసములలో వివరింపబడినవి.

యోగరహస్యసారము దెలియని యోగ ప్రచారకులు శరీర ధర్మములను పాటించక అందరికినీ ధౌతి, నేతి, నౌలి, బస్తి, గజకరణి మొదలగు క్రియలను నేర్పుట అపాయకరమని హఠయోగప్రదీపికలో చెప్పబడినది.

" మేదః శ్లేష్మాధికః పూర్వం
షట్కర్మాణి సమాచరేత్
"అన్యస్తు నాచరేత్ తాని
దోషాణాం సమభావతః"

ఇట్టి దురభ్యాసముచే యోగశక్తి [illegible] ములను సత్యమును సాతకులు మరువరాదు.

వసిష్ఠాసనము, త్రివిక్రమాసనము, హనుమాసనము మొదలైనవాని పేరులే కొందరు యోగప్రచారకులకు తెలియకపోయిన వాని లక్షణ, ఫలములు ఎట్టివారికి బొత్తిగా తెలియవని వేరుగా చెప్పనక్కరలేదు.

నిలబడి, కూర్చుని, పరుండి, తల క్రిందుగాను, పార్శ్వములమీదను నుండలా కారముగాను చేయు యోగాసనము లెన్నియో యున్నవి. వానికి మితిలేదు. వీని వివిధ వ్యక్తుల ప్రకృతులనుబట్టి వినియోగింపవలెను. ఇవి యున్ని యోగులని ప్రశ్నించువారు శ్రీరామచంద్రునకు విశ్వామిత్రుడు లెక్కలేనన్ని శస్త్రాస్త్రవిద్యల నుపదేశించినమాట స్మరించి తెలుసుకొనుట మేలు.

విలక్షణములుగల వ్యక్తులకుగల విచిత్రమైన రోగములను గురించి యిచ్చు ఔషధాదులవలెనే యోగాంగ సాధనలుకూడ వివిధరీతుల నభ్యసించవలెను.

ఇన్ని విచిత్రములైన యోగాంగాసన ప్రాణాయామాదులను ఆచరించియే మన ప్రాచీనులు మన ఆరోగ్య, దీర్ఘాయుష్య, బుద్ధి బలాత్మ జ్ఞానసంపదల నిమిత్తమై మన కెట్టి అపాయ, అపమృత్యువుల

విజ్ఞానవీధులు

"డాక్టర్

177. పరమాణువంటే....?

ప్రకృతిలో అనేక వస్తువులున్నాయి కదా. వీనిలో ఒక్కొక్కదానినే తీసికొని, మనకు సాధ్యమైన సకలవిధ సాధనాలనూ ఉపయోగించి, విభజించడం ప్రారంభించినట్లయితే ఎంతవరకు ఆ విధంగా విభజింపగలం? మాటవరుసకు మామూలు ఉప్పును తీసికొందాం ఒక ఉప్పురాయిని మెత్తగా నూరితే వేల సంఖ్యలోనో లక్షల సంఖ్యలోనో ఉన్న సూక్ష్మరేణువులుగా అది విభజింపబడుతుంది. ఆ సూక్ష్మ రేణువులలో ఒకదానిని యెట్లో అతి ప్రయాస మీద విడదీసి నాలుకమీద వేసుకొన్న యెడల ఉప్పురాయివలెనే ఆ రేణువుకూడా ఉప్పగానే ఉంటుంది. అంటే అది ఉప్పు లక్షణాలను కలిగియున్న రేణువే యన్న మాట. అట్టి రేణువునే ఇంకొకదానిని తీసికొని నూరడంచేతనో మరో విధంగానో ఇంకా విభజింపగా అతి సూక్ష్మరేణువులు లభిస్తాయి. ఆ అతి సూక్ష్మరేణువులను ఇంకా విభజిస్తే బహు మిక్కిలి చిన్నవైన సూక్ష్మరేణువులు లభింపవచ్చు. ఈ సూక్ష్మ రేణువులలో ప్రతీ రేణువూ కూడా ఉప్పు లక్షణాలనే కలిగియుండవచ్చు...అయితే ఈ రేణువులను ఇంకా ఎంతవరకు ఆ విధంగా విభజింపగలం? ఎంతవరకైనా ఆ విధంగా విభజింపగలమా? లేదా విభజింపడానికి వీలులేని కణాలేమైనా చివరకు లభిస్తాయా? ఈవిధంగా విభజింపగా విభజింపగా...ఏర్పడే కణం ఉప్పులక్షణాలను కలిగియుండేదిగా ఉండాలంటే ఒక పరిమితిని దాటి విభజనను సాగించడానికి వీలుండదు. ఉప్పుకణం విషయంలోనే కాదు; ఏ వస్తువు విషయంలోనైనా ఇంతే. ఈవిధంగా ఒక వస్తువును విభజింపగా విభజింపగా ఏర్పడునట్టి ఆ వస్తులక్షణమును కలిగిన కనిష్ఠపరిమాణం గల ద్రవ్యకణానికి అణువు (*Molecule*) అని పేరు. నీరూ, బొగ్గూ ప్రాణవాయువూ, ఇనుమూ, బంగారము, పాదరసము, ఒకటేమిటి, ప్రకృతిలోని వస్తువులన్నీ యిట్టి అణువులతో కూడినవే. కాని ఒక వస్తువుకు ఇంకొకవస్తువుకు తేడా ఉంటుంది కాబట్టి ఒక వస్తువుయొక్క అణువులకు ఇంకొక వస్తువుయొక్క అణువులకు తేడా ఉంటుంది. అయితే ఒకే వస్తువులోని అణువులన్నీమాత్రం సమానంగానే ఉంటాయి; వాటిలో వాటికి ఏవిధమైన వ్యత్యాసమూ ఉండదు.

అణువు అవిభాజ్యమైనదని అంటే విభజించడానికి శక్యము కానిదని ప్రాచీన కాలంలో విజ్ఞులు తలుస్తూండేవారు. కాని ఆ తరువాతి శాస్త్రజ్ఞుల కృషివలన నీ ఉప్పువంటి వస్తువుల అణువులనుకూడా విభజించడానికి వీలున్నదని తెలిసినది. ఒక నీటి అణువును విభజించినట్లయితే 2 హైడ్రోజని కణాలు, 1 ఆక్సిజని (ప్రాణవాయువు) కణమూ లభ్యమౌతాయి. అయితే ఈ హైడ్రోజని కణాలలోగాని, ఆక్సిజని కణంలోగాని నీటిలక్షణా లుండవు. ఆవిధంగానే మామూలు ఉప్పు అణువును బ్రద్దలుకొటినట్లయితే ఒక సోడియం కణము, ఒక క్లోరీన్ కణము ఏర్పడతాయి. హైడ్రోజని కణాలలోను, ఆక్సిజనికణంలోను నీటి లక్షణాలులేనట్లే సోడియంకణంలోనూ, క్లోరీన్ కణంలోనూకూడా ఉప్పులక్షణాలు లేవు. నీటి అణువును విభజింపగా లభ్యమైన రెండు హైడ్రోజనికణాలు, ఒక ఆక్సిజని కణమూ, ఉప్పు అణువును విభజింపగా వచ్చిన సోడియం కణమూ క్లోరీన్ కణమూ ప్రాథమిక స్వభావం కలవి. ఈ కణాలనూ ఇంకా విభజించడం అసాధ్యం అని చెప్పలేముకాని సులభసాధ్యం మాత్రం కాదు. ఇట్టి ప్రాథమిక స్వభావం గల ద్రవ్యకణాలను పరమాణువుల (*Atoms*) ని పేర్కొంటారు.

ప్రతివస్తువుయొక్క అణువులోనూ ఒకటిగాని అంతకంటె ఎక్కువగాని పరమాణువులుంటాయి. ఒక వస్తువుయొక్క అణువులో ఉండే పరమాణువులన్నీ ఒకేమో స్తరుగానున్నవి కావచ్చును; లేదా వ్యత్యాసంగానున్నవైనా కావచ్చును. హైడ్రోజని అణువులో రెండు పరమాణువు లుంటాయి. ఆ రెండూ ఒకేమో స్తరుగానున్న హైడ్రోజని పరమాణువులే. ఉప్పు అణువులోకూడా రెండు పరమాణువు లుంటాయి. కాని ఆ రెండూ భిన్నమైన పరమాణువులు; ఒకటి సోడియం పరమాణువు; రెండవది క్లోరాక్ పరమాణువు. ఏ వస్తువులలోనిపరమాణువైతే అన్నీ ఏకవిధంగా ఉంటాయో, అట్టివస్తువును మూలద్రవ్యము (*Element*) అంటారు. ఇక భిన్నపరమాణువుల కలయికచే చేర్పడిన రసాయన ద్రవ్యాలను సంయోగద్రవ్యాలని (*Compounds*) పేర్కొంటారు. ప్రకృతిలో కోట్లాది సంయోగద్రవ్యాలున్నాయి. మనము త్రాగేనీరు, రుచికి వాడే ఉప్పు, బట్టలు ఉతకడాని కుపయోగించే చాకలిసోడా,...ఇట్టవన్నీ సంయోగద్రవ్యాలే. కాని మూలద్రవ్యాలుమాత్రం 100 కు లోపుగానే ఉన్నాయి. కచ్చితంగా చెప్పవలసివస్తే 97 మాత్రమే అవి గలవు. వీనిలో అన్ని ప్రకృతిలో సమానంగా దొరకవు. కొన్ని అపురూపంగా ఉంటాయి. ఆక్సిజని (ప్రాణవాయువు) బొగ్గువంటివి చాల విరివిగా దొరుకుతాయి. నెప్ట్యూనియమ్, ప్లూటోనియమ్, క్యూరియం, ఎమరీషియమ్ అనే నాలుగు మూల

సంభవించకుండ రక్షించుటకై మన కిచ్చివప్పుడు, మనవారిలోనే కొందరు తెలియక యోగాంగాభ్యాసములను పొరబాటుగా నభ్యసించి బాధలకు లోనగుటవలన, మనవారే యోగసాధన చెడ్డది, యోగశాస్త్రము కల్పితము, అపాయకరము అని అపప్రచారము చేయుచున్నారు. కాని వీరే ఆధునిక వైద్యప్రవీణులు శస్త్రచికిత్సలను చేయుచున్నప్పు డెన్నెన్నో చావులు, అపాయములు మనకండ్లఎదుట సంభవించుచుండగా ఆమాటనైనా యెత్తరు. శాస్త్రీయ్యము, దేశీయ్యము, మితవ్యయమగు నీ యోగాంగ సాధనలను చేయువారిలో ఒక్కడో ఒకచోట ఎవరో ఎక్కరికి అజాగ్రత్తవలన కొంచము బాధ కలిగినచో చాలును, చేయరానిదిచేసి చచ్చినాడని ప్రచారము చేయుచుండుట శోచనీయము. ఇంచుక వివేకము గలవారెవరూ ఇట్లు చేయకున్ననూ తదితరులు విస్తారముగాచేయుచున్న ఉపప్రచారము భారతీయ యోగరహస్య ప్రచారమునకొటంక మగుచున్నది. సత్యాన్వేషణకు విమర్శన ప్రధానము. కాబట్టి చక్కగా యోచించి, నిష్ణాతులైన గురువులవద్ద కొన్ని రోజులైననూ యోగరహస్యములను (ముఖ్యమైనవానిని) తెలుసుకొని, అటుపిమ్మట స్వతంత్రించి అభ్యసించువారికి ఎట్టిఅపాయమును వాటిల్లదు.

—సశేషము.

[గతవారం ప్రచురించబడిన "వజ్రోలి, భూసమాధి మొదలగు క్రియలు యోగాంగములు కావు" అను వ్యాసము 7 వ వ్యాసము గాదనీ 8 వ వ్యాసమనీ పాఠకులు గుర్తించ ప్రార్థన.]

★ విజ్ఞాన వీధులు ★

ద్రవ్యాలు మన భూమిమీద సహజంగా దొరకనే దొరకవు. వానిని కృత్రిమంగానే తయారుచేస్తారు. ఈ 97 మూల ద్రవ్యాల పరమాణువులు వేర్వేరు విధాలుగా కలియడంవలన ప్రకృతిలో కోట్లాదిగ ఉన్న సంయోగ ద్రవ్యాలన్నీ ఏర్పడుతున్నాయి. ఒక వస్తువుకు నిర్దిష్టమైన రంగు రుచి వాసన మున్నగు లక్షణాలు ఏర్పడడానికి ఆ వస్తువులోని పరమాణువులు, అవి కలిసియున్న విధానమూ కారణం. ఒక సంయోగద్రవ్యంలో, ఆ ద్రవ్యాన్ని ఏవిధంగా తయారుచేసినప్పటికీ, ఎల్లప్పుడూ ఒకే విధమైన పరమాణువులు ఒకేరీతిగా కలిసి ఉంటాయి. అందుచేతనే ఆ సంయోగద్రవ్యం ఎల్లపుడూ సమాన లక్షణాలను కలిగియుంటుంది.

పై విషయాన్ని సింహావలోకనం చేస్తే ప్రకృతిలోని ప్రతివస్తువు పరమాణులచే కూర్చబడి యుందనీ, ఒకేరకమైన పరమాణువులచే మూలద్రవ్యాలు ఏర్పడుచుండగా విభిన్నమైన పరమాణువులచే సంయోగద్రవ్యాలు సంభవిస్తున్నాయనీ తెల్లమాతుంది. ఘనస్థితిలోనున్న వస్తువులలోని పరమాణువులుఒకదానితోనొకటి దృఢంగా (*tidily*) బంధింపబడియుంటాయి. ఘనస్థితినుండి వస్తువు ద్రవస్థితిని పొందినపుడు ఆ వస్తువులోని పరమాణువులు ఎక్కడకూ పారిపోవవుగాని తమ స్వస్థానంనుంచి అటూ ఇటూ కొంత స్వేచ్ఛగా కదులుతాయి; వాయుస్థితియందైతే అవి సంచరించే దూరం ఎక్కువగా ఉంటుంది.

—'అనంత్.'

చిట్టిప్రశ్నలకు జవాబులు

—ఎవరైనా ఒక నక్షత్రమునాడు చనిపోతే ఇల్లు విడిచి పెట్టాలనడము కేవలము ఆచారమే. మరొకరాష్ట్రములో అలాంటి ఆచార ముండకపోవచ్చును. తెలుగువారు అక్షతలు లేని గంధము అశుచి (మైల) రోజులలోగాని పెట్టుకోరు. అరవవారు రోజూ పెట్టుకుంటారు. ఉత్తరదేశములో సుమంగళులు నెత్తిమీద ముసుగు వేసుకుంటారు. దక్షిణదేశంలో వితంతువులుగాని అలా చెయ్యరు. ఆచారాలు వివిధాలు. వాటికి కారణమేమీ ఉండదు. విశాఖజిల్లాలో తాతగారు బ్రతికి ఉన్నాగానీ మనమడికి ఆయన పేరు పెట్టుదురు. రాయలసీమలో అలాగ పెట్టరట.

—త్రాచుపాములుంటే ప్రదేశమా? మొగలిపూల వాసన వేస్తుందా? మేము గారడీవానివద్ద ఎన్ని పాములో దగ్గరనుంచి చూచాము. ఏవాసనా వెయ్యలేదు రామమూర్తిగారూ.

—మనుష్యులు నడిచేటప్పుడు చేతులు ఊపడము ఒకవైపు కాలుచేసే గమనానికి రెండోవేపు చెయ్యి ఊగి సరితూగడానికి. గమనము శరీరపు ఒకపార్శ్వానికే కాదు గదా, మొత్తపు శరీరమంతా ముందుకే తూగాలి. కనక ఈకాలూ ఆ చెయ్యీ ముందుకు మొగ్గుతాయి.

—పురుషులూ స్త్రీలూ నూటికి నూరుపాళ్ళూ పురుషులూ స్త్రీలూ కారు. పుట్టిన తర్వాత వ్యతిరేకలక్షణాలు పెరిగినట్లయితే, అలాటివారికి మార్పు త్వరగా రావడానికే డాక్టర్ల సహాయము. వ్యతిరేక లక్షణాలు జోరుగా లేనివారికి లింగభేదము సాధించలేదంటారు శాస్త్రజ్ఞులు.

మారినవాళ్ళకూ తక్కినవారికీ తేడా ఏమీ ఉండదు. లేకపోతే మార్పనగా యేమిటి?

—జగత్ప్రళయము మానవుడు భూమిమీద ఆవిర్భవించినతర్వాత జరిగినట్టు సూచనలు లేవు. అవి మానవులు ఊహించినవి. క్రైస్తవ మహమ్మదీయ, ఆర్య మతగ్రంథాలలో పూర్వుల నమ్మకాలే బింబించాయి. ప్రళయము జరిగితే ఒకరు చూచి రాసిన తరవాత మరొక జాతివారు గ్రహించారని మేమెప్పుడూ రాయలేదు.

—మేము నాస్తికులమని అభిప్రాయపడతారా? పడండి స్వామీ. మా అభ్యంతరమేమీ లేదు. కాని మేమేమి అభిప్రాయపడుతున్నామో కూడా కొంత వినండి: "దేవుడున్నాడని పలికేవారంతా ఆస్తికులు కారు." "దేవుడున్నాడ"ని రాసిపెట్టిన కాగితము ఎల్లప్పుడూ 'దేవుడున్నాడ'ని ఒకరికి చెప్తూన్నా, అసలులో నాస్తిక శిఖామణియే నంటాము.

—తెలుగూ, అరవమూ, కన్నడమూ, మళయాళమూ ద్రావిడభాషలు. వీటిలోని పోలికలనిబట్టి ఇవన్నీ తొలి ద్రావిడభాషలోనుంచి విడిపోయి వృద్ధి అయిన భాషలని పండితుల అభిప్రాయము.

—రామేశ్వరమువద్ద అటు ధనుష్కోటి నుంచి ఇటు రామేశ్వరానికి కొంతదూరము వరకూ మునిగిన ఇసకపర్ర ఉంది. ఎంత దూరము వెళ్లినా లోతు ఎక్కువవదు. నేల రాపిడికి పెద్ద కెరటాలు ఉధృతము తగ్గిపోతాయి. అందుచేత సముద్రము ప్రశాంతంగా ఉంటుంది. కాకినాడలోనూ ఇంతే.

—రేడియో తరంగాల్ని భూమికి బంధిస్తారు ప్రసార కేంద్రంలో. అందువల్ల అవి భూమిని అంటిపెట్టుకు ప్రయాణము చేస్తాయి. ఆకాశములోకిపోయి అయనావరణమనే అడ్డుకి తగిలి పరావర్తమైవచ్చే తరంగాలుకూడా ఉంటాయి. అవి మధ్య తరంగ ప్రసారాలు.

★

★ రెండో పెళ్లి ★

(8-వ పేజీ తరువాయి)

నీసుఖమే నాసుఖం ఇంతకంటె ఎక్కువ వ్రాయలేను...ఒకందుకు మాత్రం నవ్వొస్తోంది. మా రాధకు అప్పుడే యిద్దరు పిల్లలన్న మాట! చివరి పరిహాసానికి కోప్పడకు.

నీ అన్న,
రఘు.

ఈ త్తరం పూర్తి చేసినమీదట రాధమీద నాకు అమితమయిన కోపం వచ్చింది. ఇది అంత యిష్టంలేని పెళ్లా? ఆమె ఎవరి నైనా ప్రేమించిందా? ఛీ! ఈ ఆడజాతిని నమ్మనే కూడదు...ఇంతలో చాచి వీపుమీద చరిచినట్లు ఒక ఆలోచన స్ఫురించింది. 'మగజాతిని నమ్మవచ్చా' అని. భార్య పోగానే స్వసుఖంకోసం - రెండో పెళ్లికి సిద్ధమయిన నన్నేమనాలి? నేను చేసిన నిరవాకంఏమిటి? మొగవాడై పుట్టినంతమాత్రాన ప్రేమించడం పెళ్లాడడం అనే విషయాలలో నిరంకుశుడన్న మాట! ఆడవాళ్లయినంత మాత్రాన ఆహక్కులు వాళ్లకు లేకుండా పోతాయన్న మాట...ఆ వుత్తరంవల్ల ఆమె అన్న రఘు ఎంత బాధపడుతున్నాడో అర్థమయింది.

ఇంతలో తలుపు చప్పుడయింది...రాధ లోపలికి వచ్చింది. ఎవరో తలుపు వేసే కారు. నేనుమాత్రం ఈ త్తరం కనబడనీయకుండా మడిచి జేబులో పెట్టుకున్నాను. రాధ అలాగే నిలబడి వుంది.

"అలా కూర్చో రాధా"

మంచంమీదపోయి కూర్చుంది. నేను దగ్గరగా వెళ్లాను. ఎలా ఉపక్రమించాలో అర్థం కాలేదు. నన్ను చూచినరాధ కొంచెం దూరంగా జరిగింది. నేనేంచేయాలో తెలియక దిక్కులు చూస్తున్నాను. అప్రయత్నంగా రాధవైపు చూచాను. రాధ కళ్ల నీళ్లు కారుస్తోంది. ఉలిక్కి పడ్డాను.

"ఏమిటిరాధా అది?"

రాధ వెక్కి వెక్కి ఏడ్వ నారంభించింది. పిల్లలిద్దరూ నిశ్చింతగా నా పక్కపైన నిద్రపోతున్నారు. తిరిగి రాధ ముఖంవంక చూశాను. ఆ ముఖాలు మూడింటిలోనూ ఏదో అనురూప బాంధవ్యం కనపడింది నా కంటికి. ముగ్గురూ ఇప్పుడు నిస్సహాయులు. నేను చేసినపనికి నాకే విరక్తికలిగింది. రాధ ఇంకా ఏడుస్తూనే ఉంది.

మెల్లిగా జేబులోనుంచి ఉత్తరం తీసి రాధచేతి కిచ్చాను. "ఇది నీదే. ఇక్కడ పడి ఉంది" అన్నాను.

రాధ ఉలిక్కిపడింది. ఉత్తరం నేలమీద పడింది. చెంగులో ముఖం కప్పుకుంది.

"ఇందుకేనా?" అని అడిగాను.

తలెత్తి నా ముఖంలోకి చూసింది. కన్నీట తడిసిన ఆ ముఖం తళతళ లాడింది.

"నన్ను క్షమించండి"

"కాదు. నన్నే నువ్వు క్షమించాలి."

రాధ మౌనంగా నేలవంక చూసింది. ఆ చెంపలపైన కన్నీరు తుడవాలనిపించింది. దగ్గిర చేరబోయాను, ఆమె దూరంగా జరిగింది. విరక్తిభావంతో ఒకసారి పిల్లలవంక చూశాను. ఆమెకూడా అటే చూసింది.

"ఒకటి కోరతాను మిమ్మల్ని. అనుగ్రహిస్తారా?"

"తప్పకుండా. చెప్పు. నువ్వెవరి నైనా ప్రేమించావా?"

"కాదు కాదు" అంటూ తలాడిస్తూనే తన నోటికి వేలడ్డు పెట్టుకుంది.

"అయితే ఏమిటో చెప్పు."

"రాత్రి చేసిన మేలే ఈ రాత్రి కూడా అనుగ్రహించండి."

"రాత్రి...ఏం చేశాను?"

"ఆ మంచంమీద పడుకున్నారుగా ... అలాగే ఈ రాత్రికూడా."

ఇది రాధకు మేలా! ఇలా సంసారం ఎలా గడుస్తుంది? పిల్లలకేదో దిక్కవుతుందని, నా జీవితానికి వెలుగుబాట అవుతుందని ఎంతో ఆశపెట్టుకున్నాను. ఇం విధంగా పరిణమించింది.

"సరే రాధా! ఒక విషయం అడుగుతాను చెప్పు. నీ కోరిక చెల్లిస్తాను. కాని ఇది ఈ ఒక్క రాత్రితోనే తీరిపోయేదికాదుగా?"

"అవును...కాని..." అంటూ ఆమె ఆగిపోయింది. ఒకసారి పిల్లలకేసి చూసింది. కళ్లు తుడుచుకుంది.

"జరిగిన అన్యాయం చాలు".

నాకు కోపం ఆవేదన ఒక్కసారి ముంచుకు వచ్చాయి. కాని నిగ్రహించుకున్నాను. "ఎవరికి? నీకా?" అని అడిగాను.

"కాదు, పిల్లలికి! ఇంక ఏ పిల్లలకీ వద్దు! పిల్లలూ వద్దు!"

★

భారతదేశం చూడడానికి వచ్చిన ఒక అమెరికన్ హిమాలయ పర్వతాల్లో యాత్ర చేస్తున్నాడు. ఆప్రదేశం చూపించడానికి వచ్చిన యు. పి. మనిషి ఒకడు అమెరికన్‌తో ఇలా అన్నాడు:

"ఈ పర్వతాలు ఇలా ఏర్పడ్డానికి ఎన్నో లక్షల ఏళ్లు పట్టిందట."

"అలాగా? చాలా పెద్ద ప్రాజెక్టే. మీ గవర్నమెంటుకి చాలా ఖర్చయి ఉంటుంది."

* * *

ఒకడు ఒకకొట్లోకి వెళ్లి "పొద్దున ఇక్కడ నాగొడుగు మర్చిపోయానా?" అని అడిగాడు.

"తెలియదండీ, ఎలా ఉంటుంది మీగొడుగు?" అడిగాడు కొట్టువాడు.

"నా గొడుగులాంటిదైతే నాకు ఫరవాలేదు. ఏదో ఒకటి ఇవ్వండి."

★ మూడు మేడలూ, నాలుగు కార్లూ ★

(9-వ పేజీ తరువాయి)

రంగనాయకులు బట్టల షాపులో నూరు రూపాయలూ, సిటీ ఎంపోరియంలో ఏభై రూపాయలు అరువు పెట్టి చక్కా వచ్చింది. ఈ మాట విన్న మా మామ 'భార్యంటే యింత బరువుగా ఉంటుందా?' అని కొత్తగా విస్తుపోయాడట!

'జరిగింది చాలు! ఆ విస్కీ పంపెయ్యి' అన్నాడు మామ.

'చాల్చాలు. మనం చెయ్యలేకపోతే చూసైనా సంతోషించవద్దూ? అంత హుందా సంబంధాన్ని ఎలా వదులుకోగలమూ? ఒక్కతే ఆడపిల్లట. ఏటన్నిటినీ మించి వాళ్ళకి...'

'ఎవరికీ?'

'అదే - వియ్యాల వారికి. వారికి ఏముందో తెలుస్తే మీరీ సంబంధాన్ని కాదనరు'

'ఏముందీ?'

'మీలా కాదు! ఉన్న యిల్లు రిపేరు చేయించడానికి మీరు ఖర్చు చెయ్యలేరు. ఏది కొన్నా సెకండు హేండు తప్ప కొనలేరు - వాళ్లు అలాగా! మనం తల్చుకోడానికేనా అనర్హులం! మూడు మేడలున్నాయిట! - ఒకటి రెండూ కాదు, నాలుగు కార్లుట!'

'అయితే మనకేం లాభం?'

'అంతలోనే ఉంది తెలివి! అన్నీ పోషించడానికి ఎంత సంపాదనాపరుడై ఉండాలో ఆలోచించండి - ఒక్కగానొక్క పిల్ల. ఇవన్నీ ఏం చేసుకుంటారూ?'

మా మామ ఏదో అనబోయాడు. అత్త కస్సున లేచింది.

'ఇంత ఘరానాగా ఉన్నప్పుడు కట్న ప్రసక్తి ఎత్తడం మన తెలివితక్కువ - ఇష్టపడ్డామని ఉత్తరం రాయండి.'

మా మామ రాయలేదు. మా అత్తే రాయించింది. చాలామంది భర్తలలాగే మా మామ ఉత్తరం రాశాడు. చిన్నబావ ఉత్తరం పోకుండా రిజిష్టరు చేశాడట!

* * *

మొత్తానికి పెళ్ళి అయిందనిపించారు. నాకు కనబడినంతవరకూ వియ్యాలవారింట్లో కర్రసామానూ, గాజు సామానూ ఎక్కువగానే ఉంది! పెళ్ళికూతురు కూడా పొడుగ్గా, కర్రలా, గాజుబొమ్మలాగే ఉంది!

'అదేమిటమ్మా, పెళ్ళి ఒక మేడలో అయినా చేశారు కారు?' అంది మా రంగమ్మత్త పెళ్ళి జరిగిన పెంకుటిల్లు చూసి ఉండబట్టలేక. దానికి ఏ కారణం చేతనో ఎవరూ జవాబు చెప్పలేదు. ఎవరివో గాని నాలుగయిదు కార్లు మాత్రం ఆ పెళ్ళి ఒక్కరోజూ యిటూ అటూ తిరిగేయి. వియ్యంకుడు ఒక్క రోజు పెళ్ళి అతి క్లుప్తంగా తెలివిగా జరిపించివేశాడు - ఆ తరవాత మూడురోజులుండి మా రంగమ్మత్తా, చిన్నబావా యిల్లు చేరుకున్నారు.

ఆ తరవాత ముఖ్యంగా చెప్పవలసిన సంగతి మా చిన్నబావ పెళ్లాం అత్తారింటికి రావడం సంగతి. ఆవేళ నేను అక్కడే ఉండడం తటస్థించింది. ఆ వయ్యారి ఓనాడు వేసవికాలం మధ్యాహ్నం వేళ పెట్టె బెడ్డింగూ కూలివాడి చేత పట్టించుకుని టకటక నడుచుకుంటూ అత్తారింటికి వచ్చేసింది!

మా రంగమ్మత్త ముక్కుమీద వేలేసుకుని —

'అదేమిటమ్మా, కావళ్లేవీ?' అని అడిగింది.

'కావళ్లేమిటే?'

'అదేనమ్మా - సారె కావిళ్లు!'

'మావాళ్ళకి సారె పెట్టడం అలవాటు లేదే!' అంది ఆ పిల్ల కోయిలకంఠంతో తిప్పుకుంటూ. ఇంకేం మాట్లాడుతుందీ వెర్రి రంగమ్మత్త?

'స్టేషను అంతదూరం గదా, నడిచే వస్తారా ఎండవేళ? ఓ టేక్సీ అయినా చేయించుకుని రాకపోయావా?'

'ఈమాత్రం దానికి కారెందుకండీ?'

'మీ ఊళ్ళో యిలాగే చేసేవారా?'

'మరి యింకెలాగ?'

'అయితే మీ కార్లన్నీ ఏమయినట్టు? నాలుగు కార్లూ ఏం చేసుకునేవారు?'

'నాలుగు కార్లే! అసలు మాకు ఒక కారైనా లేదే!'

రంగమ్మత్త నోట మాటలేదు. ఎలాగో తెప్పిరిల్లి అడిగేసింది.

'మీకు మూడు మేడలుండాలిట?'

'మూడు మేడలే! మూడు మేడలే ఉంటే అద్దె యింట్లో బాధపడ్డం దేనికీ?' అంది ఆ అమ్మాయి ఆశ్చర్యపోతూ. మా అత్త కోపం ఆగలేదు. మేం యివతలిగదిలో కేరమ్సు ఆడుతున్న వాళ్ళం అక్కడికొచ్చేశాం. నడుముమీద చేతులెట్టుకుని అరచింది.

'మరి మీ అమ్మ అలా అందేం?'

'దానికేముందండీ, ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క అలవాటు. లేనిది ఉన్నట్టు చెప్పడం మా అమ్మ కలవాటు. ఉన్నది లేనట్టు చెప్పడం మా నాన్న కలవాటు. ఈ సంగతి ముందే తెలుసుకోకపోవడం జరిగిన పొరపాటు. ఇంతకీ నాకు మా అమ్మ గుణాలేం రాలేదు. నావల్ల మీకు జరిగే హాని ఏమీ లేదు.'

మా అత్త పళ్లు పటపట కొరికింది.

'నీవల్ల నాకు జరిగే హాని లేకపోవచ్చు. కాని నావల్ల నీకు ముందుముందు ఎంత హాని అయినా జరగవచ్చు, దీనివల్ల మీ అమ్మకి బుద్ధి రావచ్చు' మా చిన్నబావ ఈ పరిస్థితుల్లో ఊరుకోలేదు.

'ఇంకా గుమ్మంలో అడుగు పెట్టిందో లేదో యీ అల్లరేమిటే అమ్మా? దాని మనసు ఎవరేవిధంగా నొప్పించినా నేను మాత్రం ఊరుకోనేదిలేదు సుమా! ఛీ, ఎప్పుడనగా భోంచేశావో.'

మా రంగమ్మత్త ఊరుకుందిగాని ఆ అమ్మాయి ఊరుకోలేదు!

'ఇంతకీ అత్తగారి అభిమానం, అదూయ కత్యంగాని మా నాన్నకి ఒకవేళ మూడు మేడలూ నాలుగు కార్లూ ఉంటేమాత్రం మీకేం లాభముందీ? ఇంకొకళ్ళదగ్గర పూచిక పుల్ల పుచ్చుకోవలసిన అవసరం మీకేమిటీ? నాలుగు కార్లు, నలభై కార్లు గుమ్మంలో తెచ్చి పెడితే మాత్రం మీరుగాని, అత్తగారు గాని వేలేస్తారా? రేపొద్దుట పెద్ద ఉద్యోగం చేస్తే నాకు కావలసినది ఏర్పడితే అది మీరు కొనిపారెయ్యరూ?'


'సెభాష్ కోడలా!' అందరం వెనక్కి తిరిగిచూశాం. మా మామ! మా రంగమ్మత్త తప్ప అందరం నవ్వుకున్నాం! ★

"తోడేలు బాలుడు"

(11-వ పేజీ తరువాయి)

మానవప్రకృతిగా మార్చటం సంభవమైనప్పుడు మానవప్రకృతిని జంతుప్రకృతిగా మార్చటం కూడా సంభవం కావచ్చుననే భావం పండితులకు కలిగితే కలుగవచ్చు. అలాంటి ప్రయత్నం చేసి మానవత్వాన్ని ఎటుపడితే అటు మార్చదగిన మట్టిముద్దగా మాత్రం భావించకూడదు. పరిసరాలుమార్చినందువల్ల ప్రాణులస్వభావాలుమార్చిందటం అనేది తోడేలు బాలుడి పరంగా విజయవంతం అయితే, సైన్సు విజ్ఞానంలో విప్ల[...]త్మకమైన పరిణామాలు కొన్ని రాకమా[...] ఆ దృష్టితో చూస్తే, తోడేలు బాలు[...] రాము, యీనాడు యిన్ని వేల ఏళ్ల మా[...] పరిశోధనల ఫలితంగా తయారైన శాస్త్రీ[...] విజ్ఞానానికి సవాలుగా నిలచివున్నా[...] చెప్పక తప్పదు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



ఉదయ ప్రార్థన

—ఫొటో యస్ యస్. శర్మ, తెల్లప్రోలు.